04-12Pg1exHMNWJQE 1 ONG_04-12Pg1exHMNWJQE.qxd 04/Dec/25 12:13 AM Page 1

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

ఒంగోలు

కపిల్ చిట్స్‌తో బంధం ఆనందాల అనుబంధం
KAPIL GROUP
కపిల్ చిట్స్
Visit Us: www.kapilchits.com
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం

: fb.com/vaartha Digital

Published from Ongole, Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

4-12-2025 గురువారం సంపుటి: 31 సంచిక: 303 పేజీలు: 12 వెల: 6.50

# సాగు మేలుకు పంచసూత్రాలు

**అంతరపంటలతో అధికాదాయం**

**విద్యుత్ ఛార్జీలు పెంచే ఉద్దేశం లేదు**

**ఆహార అలవాట్లకనుగుణంగా సాగు పద్ధతులు**

**నల్లజర్ల 'రైతన్నా.. మీకోసం'లో సిఎం చంద్రబాబు**

**ఉత్తమ రైతులకు సన్మానం చేసిన సిఎం**

**విజయవాడ/దేవరపల్లి(నల్లజర్ల), డిసెంబరు 3 ప్రభాతవార్త:** వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి, అన్నదాతకు అండగా నిలిచేందుకు కూటమి ప్రభుత్వం పంచసూత్ర ప్రణాళికతో ముందుకెళుతోందని సిఎం చంద్రబాబు స్పష్టం చేశారు. పంచసూత్రాలపై అవగాహన కల్పించేందుకే "రైతన్నా...మీకోసం" కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రతి రైతు కుటుంబం అభివృద్ధి చెందడమే లక్ష్యంగా పనిచేస్తోందని చెప్పారు. తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం నియోజకవర్గం నల్లజర్లలో "రైతన్నా...మీ కోసం" కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులతో ముఖాముఖి నిర్వహించారు. వ్యవసాయ యాక్షన్ ప్లాన్‌పై చర్చించారు. అంతకముందు అక్కడి రైతులు సాగు చేస్తున్న అంతర్ పంటలను పరిశీలించారు. అనంతరం రైతులను ఉద్దేశించి ముఖ్యమంత్రి మాట్లాడుతూ... "వ్యవసాయమే మన బలం. రాష్ట్రంలో 62శాతంమంది వ్యవసాయ, అనుబంధ రంగాలపైన ఆధారపడి జీవిస్తున్నారు. అందుకే సాగును లాభసాటి చేసేందుకు మొదటి రోజు నుంచి ప్రయత్నిస్తున్నామని" ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు.

**వ్యవసాయ అనుబంధ రంగాలపై దృష్టి పెట్టాలి**

"మనది వ్యవసాయ ఆధారిత రాష్ట్రం. వ్యవసాయం లాభసాటిగా మారాలి. రైతుకు గిట్టుబాటు ధర రావాలి. రైతులు వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాలపైనా దృష్టి పెట్టాలి. అలాగే భూగర్భ జలాలు పెంచుకోగలిగితే కరువు ఉండదు. రాబోయే రోజుల్లో గోదావరిని వంశధారలో కలుపుతాం. పెన్నాకూ తీసుకెళతాం. ఈ ఏడాది 7 వేల టీఎంసీల నీరు వృథాగా సముద్రంలోకి పోయింది. కృష్ణా నుంచి 1500 టీఎంసీల నీరు సముద్రంలోకి పోయింది. ఇందులో 200 టీఎంసీల నీరు మనం వాడుకోగలిగితే కరువు అన్నమాటే వినపడదు" అని సీఎం అన్నారు.

**కృష్ణాగోదావరి అనుసంధానంతో ప్రతి ఎకరాకు నీళ్లు**

"భూమినే జలాశయంగా చేసి భూగర్భ జలాలు పెంచుకోగలిగితే కరువు ఉండదు. పోలవరం రైట్ కెనాల్ నుంచి నీరు ఇస్తే ఈ ప్రాంతంలో భూగర్భ జలాలు పెరుగుతాయి. రాష్ట్రమంతటా డిసెంబర్1 నాటికి 6.8 మీటర్ల భూగర్భ జలాలు రాగా తూర్పుగోదావరి జిల్లాలో 18 మీటర్లు ఉన్నాయి. అందుకు ఇక్కడున్న భూమే >>2



బుధవారం తూర్పుగోదావరి జిల్లా నల్లజర్లలో 'రైతన్నా...మీ కోసం' కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు



బుధవారం నెల్లూరులో కురిసిన భారీ వర్షాలకు జలమయమైన రోడ్లు

# ఎడతెరిపిలేని వాన

## దిత్వా తుఫాన్ ప్రభావంతో మునిగిన నెల్లూరు నగరం

### జల దిగ్బంధంలో కాలనీలు

**నెల్లూరు, డిసెంబరు 3, ప్రభాతవార్త (వైద్యం):** దిత్వా తుఫాన్ నెల్లూరును నిండా ముంచింది. తుఫాన్ ప్రభా వంతో కురిసిన భారీ వర్షాలకు నెల్లూరు నగరం తడిసి ముద్దయింది. బుధవారం నెల్లూరును వరద నీరు చుట్టు ముట్టింది. పలు కాలనీలు నీట మునిగాయి. తుఫాను తీరందాటింది తమిళనాడులో నైనా నెల్లూరులో వరద బీభత్సం కొనసాగింది. వెంకటాచలం నుంచి పెన్నా బ్రిడ్జి వరకు, నేషనల్ హైవేతో పాటు నెల్లూరులోని ప్రధాన రహదారులన్నీ వరద నీటిలో చిక్కుకున్నాయి. నాలుగు రోజుల పాటు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలతో నెల్లూరులో జనజీవనం స్తంభించింది. నిత్యావసర వస్తువులకు సైతం గడప దాటి కాలు బయట పెట్టలేని పరిస్థితులు నెలకొన్నాయి. వాయుగుండం తీరం దాటే సమయంలో నెల్లూరు జిల్లాలో గాలుల ప్రభావం లేకపోవడంతో ప్రజలు కొంతవరకు ఊపిరి పీల్చు కున్నారు. తల్పగిరి కాలనీ ముంపుకు గురి కావడంతో ఆ నీరంతా వేదయపాలెంలో >>2

# ఎపిపిఎస్సీ 21 పరీక్షల షెడ్యూల్ విడుదల

## వచ్చే రెండు నెలల్లో పరీక్షలు

### 890 ఉద్యోగాల భర్తీకి చర్యలు

**విజయవాడ, డిసెంబరు3, ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిరుద్యోగులకు శుభవార్త తెలిపింది. ఎంతో కాలం నుంచి ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న వారి కోసం ఇప్పటికే విడుదల చేసిన నోటిఫికేషన్ల ప్రకారం పరీక్షల తేదీల్ని ప్రకటించింది. ఈ మేరకు వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న 890 ఉద్యోగాలను భర్తీ చేసేందుకు వీలుగా ఈ ఏడాది 21 నోటిఫికేషన్లు విడుదల చేసింది. వీటికి పరీక్షల్ని వచ్చే రెండు నెలల్లో నిర్వహించబోతున్నారు. ఆ మేరకు వెబ్ సైట్‌లో పూర్తి వివరాలను వెల్లడించింది. ఈ ఏడాది విడుదల చేసిన 21 ఉద్యోగ నోటిఫికేషన్లకు పరీక్షల తేదీల్ని నిర్ధారిస్తూ ఎపిపిఎస్సీ ప్రకటన విడుదల చేసింది. ఈ పరీక్షల్ని కొత్త ఏడాదిలో జనవరి, ఫిబ్రవరి నెలల్లో వివిధ తేదీల్లో నిర్వహించబోతున్నారు. ఏయే పరీక్షను ఏయే తేదీల్లో నిర్వహించబోతున్నారో వివరిస్తూ ఎపిపిఎస్సీ జాబ్ షెడ్యూల్ చార్జ్ విడుదల చేసింది. ఇప్పటికే ఆయా పరీక్ష >>2



బుధవారం జరిగిన ఉద్భవ్ వేడుకలో లాంఛనంగా విల్లు ఎక్కుపెట్టిన కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రి జువల్ ఓరమ్

# ఆదివాసీలు, గిరిజనుల అభివృద్ధికే 'ఉద్భవ్'

## విద్యార్థులు సంస్కృతి సంప్రదాయాలు కూడా నేర్చుకోవాలి


### క్రీడల్లో గిరిజన విదార్థులు మెరుస్తున్నారు..

### 'ఉద్భవ్' వేడుకలను ప్రారంభించిన కేంద్రమంత్రి జువల్ ఓరమ్

### ఈ వేడుక గొప్పమార్పుకోసమే: మంత్రి సంధ్యారాణి

**విజయవాడ, డిసెంబరు 3, ప్రభాతవార్తప్రతినిధి:** ఆదివాసీ, గిరిజన విద్యార్థులు చదువు మాత్రమే కాకుండా సంస్కృతి, సంప్రదాయాలు కూడా నేర్చుకోవాలని కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి జువల్ ఓరమ్ వెల్లడించారు. ఇఎంఆర్ఎస్ బాలబాలికలు అన్ని రంగాల్లో రాణించాలని ఆయన ఆకాంక్షించారు. అమరావతిలోని కెఎల్ యూనివర్సిటీ వేదికగా ఉద్భవ్2025 వేడుకలను కేంద్ర మంత్రి తొలిరోజు ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. కార్యక్రమంలో గిరిజనాయుధం విల్లును లాంఛనంగా ప్రదర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు హిందీ, ఇంగ్లీష్, ప్రాంతీయ భాష కూడా ముఖ్యమే అన్నారు. గిరిజన వ్యవహారాల శాఖకు వాజ్ పేయి హయాంలో నామకరణం జరిగిందని ప్రస్తావించారు. గత ఐదేళ్లు జరిగిన గిరిజన సంస్కృతి ఉత్సవాల సమయంలోనూ తానే కేంద్రమంత్రిగా ఉండడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. జవహర్ లాల్ నవోదయ, కేంద్రీయ విద్యాలయాలు, సైనిక్ స్కూళ్ల తరహాలోనే ఇఎంఆర్ఎస్ పాఠశాలలను అభివృద్ధి చేస్తామని కేంద్రమంత్రి ఓరమ్ స్పష్టం చేశారు. క్రీడల్లోకూడా గిరిజన విద్యార్థులు మెరుస్తున్నారన్నారు. ఉద్భవ్ అంటే హృదయాంతరాల నుంచి బయటకి తీయడం అనే అర్థం అన్నారు. అందుకే ఈ ఉత్సవాలకు ఆ పేరు పెట్టడం జరిగిందన్నారు.

ఈ సందర్భంగా ఎంతో కష్టపడి ఉత్సవాలలో లోటుపాట్లులేకుండా నిర్వహిస్తోన్న ఎపి ప్రభుత్వం, గిరిజన శాఖ మంత్రి సంధ్యారాణి, ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి ఎం.మల్లికార్జున నాయక్‌లను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా 6వ జాతీయ ఇఎంఆర్ఎస్ సంస్కృతి, సాహిత్య, కళాఉత్సవాన్ని జువల్ ఓరమ్ ఆవిష్కరించారు. అనంతరం కేంద్రమంత్రి జువల్ ఓరమ్ ని రాష్ట్రమంత్రి గుమ్మిడి సంధ్యారాణి సన్మానించారు. వేంకటేశ్వరస్వామి విగ్రహాన్ని ఆయనకు బహూకరించారు. అంతకుముందు ముఖ్య అతిథిగా వచ్చిన కేంద్ర మంత్రి ఓరమ్ ను ఈఎంఆర్ఎస్ విద్యార్థులు గిరిజన సంప్రదాయ నృత్యాల నడుమ స్వాగతం పలికారు. అనంతరం ఆయన సభా ప్రాంగణం వద్ద గిరిజన సంప్రదాయాలు ప్రతిబింబించేలా ఏర్పాటు చేసిన ప్రదర్శనను ఆసక్తిగా తిలకించారు. బొమ్మలను పరిశీలించారు. విల్లును పట్టుకుని బాణాన్ని ఆకాశానికి ఎక్కుపెట్టి కేంద్రమంత్రి ఓరమ్ సందడి చేశారు. అక్కడే ఏర్పాటైన గిరిజనుల ఉత్పత్తిగా అంతర్జాతీయ ఖ్యాతి పొందిన అరకు కాఫీ స్టాల్ ను సందర్శించారు. దాంతో పాటు గిరిజనుల ఉత్పత్తి అయిన తేనే బాటిళ్లను పరిశీలిం >>2



# పుతిన్‌కు ఐదంచెల భద్రత

## నేడు రానున్న రష్యా అధ్యక్షుడు

**న్యూఢిల్లీ, డిసెంబరు 3:** రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ భారత పర్యటనకు సర్వం సిద్ధమైంది. ప్రధాని నరేంద్ర మోడీ ఆహ్వానం మేరకు భారత్-రష్యా వార్షిక సదస్సులో పాల్గొనేందుకు ఆయన రేపు సాయంత్రం ఢిల్లీ చేరుకోనున్నారు. ఈ నేపథ్యంలో దేశ రాజధానిలో అపూర్వమైన భద్రతాఏర్పాట్లు చేశారు. పుతిన్‌కు ఐదంచెల అభేద్యమైన భద్రతా వలయాన్ని ఏర్పాటు చేశారు. ఈ భద్రతలో రష్యా అధ్యక్షుడి భద్రతా సిబ్బందితో పాటు, భారత నేషనల్ సెక్యూరిటీగార్డ్ ఎన్ఎస్‌జి కమాండోలు, స్నైపర్లు, డ్రోన్లు, జామర్లు, >>2

# భారీ ఎన్‌కౌంటర్

## 12 మంది మావోయిస్టులు, ముగ్గురు జవాన్ల మృతి

### కొనసాగుతున్న కూంబింగ్

**చర్ల, డిసెంబర్ 3,(ప్రభాతవార్త):** చత్తీస్‌గఢ్ రాష్ట్రంలో వరుస ఎన్‌కౌంటర్లు జరుగుతున్నాయి. తాజాగా బుధవారం ఉదయం బీజాపూర్- దంతెవాడ జిల్లాల సరిహద్దు అటవీ ప్రాంతంలో మావోయిస్టులకు భద్రతా బలగాలకు భారీగా ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఎదురుకాల్పుల్లో 12 మావోయిస్టులు మృతిచెందగా ముగ్గురు డిఆర్జి జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. మరో ఇద్దరు జవాన్లకు గాయాలయ్యాయి. మావోయిస్టులే లక్ష్యంగా అటవీ ప్రాంతంలో డిఆర్జి, ఎస్‌టిఎఫ్, సిఆర్పీఎఫ్ కోబ్రా బలగాలు సంయుక్తంగా శోధన ఆపరేషన్ చేపట్టాయి. ఈక్రమంలో మావోయిస్టులు తారసపడటంతో ఇరువురి మధ్య కాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో హెడ్ కానిస్టేబుల్ మోను వాడాది (డిఆర్జి), గొండె దుకారు, సోడి రమేష్ (డిఆర్జి) మృతిచెందగా సోమ్‌దేవ్ యాదవ్‌తో పాటు మరో జవాన్‌కు గాయాలయ్యా >>2

# 'సిట్'వలలో ముంబయి బులియన్ వ్యాపారి

## మద్యం కుంభకోణం కేసు

**విజయవాడ,డిసెంబరు 3,ప్రభాతవార్తప్రతినిధి :** వైకాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో జరిగిన రూ. మూడున్నర వేలకోట్ల మద్యం కుంభకోణం కేసులో ముంబై బులియన్‌వ్యాపారి రోణక్‌కుమార్ జస్‌రాజ్‌ను సిట్ అధికారులు అరెస్టు చేశారు. అతడిని విచారణ నిమిత్తం విజయవాడకు పిలిపించగా.. బయట హాల్లో ఉంటానని చెప్పి తప్పించుకుని పారిపోతుండగా గన్నవరం విమానాశ్రయంలో అతడిని అదుపులోకి తీసుకున్నారు. జగన్ ప్రభుత్వంలో రాష్ట్ర ప్రజలకు నాసిరకం మద్యం అధిక ధరలకు విక్రయించి ముడుపుల రూపంలో వేల కోట్ల రూపాయలను వైసిపికు చెందిన నేతలు వసూలు చేసినట్లు సిట్ ఆరోపణలు,ఆధారాలతో ఉన్నాయి.ఆ సొమ్ముతో ఎన్నికల్లో వైసిపికి నిందితులు ఓట్లు కొనడం మొదలుకొని.. పొరుగు రాష్ట్రాల్లో స్థిరాస్తులు, ముంబైలో బంగారం కొనుగోలు చేసిందని అభియోగాలున్నాయి. మనీలాండరింగ్, హవాలా రూపంలో ఇతర దేశాలకు తరలింపు.. ఆ తర్వాత వైట్ మనీగా మార్చుకున్న రాజ్ కసిరెడ్డి గ్యాంగ్ అక్రమాలను ఒక్కొక్కటిగా సిట్ అధికారులు బయటకు తీస్తున్నారు. ఆదాన్ డిస్టిలరీస్, లీలా డిస్టిలరీస్, ఎస్‌పివై ఆగ్రోస్ నుంచి ముంబైకి చెందిన అనిల్ చోఖ్రా సృష్టించిన సెల్ కంపెనీల బ్యాంకు ఖాతాల్లోకి రూ.78 కోట్లు బదిలీ అయినట్లు ఆధారాలు లభించాయి.

చోఖ్రాను ముంబైలో అదుపులోకితీసుకుని.. విజయవాడ ఎసిబి కోర్టులో ప్రవేశపెట్టి..కోర్టు అనుమతితో కస్టడీకి తీసుకుని విచారిస్తున్నారు. ఆదాన్, లీలా, ఎస్‌పివై యజమానులతో నాకు ప్రత్యక్షంగాసంబంధాల్లేవు.ముంబైలోని హవాలా >>2

# 'ఉప్పాడ'కు శాశ్వత పరిష్కారం

## సముద్ర జలాల కాలుష్య సమస్యపై శాస్త్రీయ పరిశోధన

### ఉప్పాడ మత్స్యకారులతో డిప్యూటీ సిఎం పవన్

**విజయవాడ, డిసెంబరు 3 ప్రభాతవార్త ప్రతినిధి:** "ప్రజా ధనం నుంచి ఖర్చు పెట్టే ప్రతి పైసాకు ప్రతిఫలం ఉండాలి. ఇచ్చిన ప్రతి మాటకు కట్టుబడి పనిచేయాలనేదే కూటమి ప్రభుత్వ లక్ష్యం. గత ప్రభుత్వంలో విచ్చలవిడిగా ప్రజా ధనాన్ని ఖర్చు చేశారు. అప్పటి ప్రభుత్వం ఓ ప్రణాళిక లేకుండా, సొంత ప్రాపకాల కోసం ఇష్టానుసారం చేసిన ఖర్చులతో నిధులు అక్కరకు రాకుండా పోయాయి" అని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చెప్పారు. పోలవరం డయా ఫ్రం వాల్‌ను గత ప్రభుత్వ హయాంలో కాంట్రాక్టర్లు మార్చి, రివర్స్ టెండర్లు అంటూ ఇష్టానుసారం నిర్మించడంతో ఎందుకు పనికిరాకుండా పోయిందనీ, ఇప్పుడు దాన్ని పునర్ని ర్మాణం చేయాల్సి వచ్చిందన్నారు. అలాగే ఉప్పాడలో నిర్మించిన మత్స్యకారుల జెట్టీ కూడా డిజైన్ల లోపం కారణంగా పనికిరాకుండా పోయింది, దానికి మళ్లీ రూ.80 కోట్లు ఖర్చయ్యే పరిస్థితిని తీసుకొచ్చారని చెప్పారు. చేసిన పనికే ప్రజాధనాన్ని మళ్లీమళ్లీ ఖర్చు చేసేలా అప్పటి పాలకులు పని చేశారని వివరించారు.

ఉప్పాడ మత్స్యకారులతో 100 రోజుల ప్రణాళిక అమలు, భవిష్యత్తు కార్యాచరణ, ఆదాయం పెంపు అనే అంశాలపై బుధవారం మంగళగిరి క్యాంపు కార్యాలయంలో పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. తమిళనాడు, కేరళలో విజయవంతంగా అమలు అవుతున్న సముద్ర ఉత్పత్తులతో అదనపు ఆదాయం విధానాలను పరిశీలించేందుకు ఉప్పాడ నుంచి 60 మందితో ప్రత్యేక బృందాన్ని అక్కడకు పంపాలని నిర్ణయించారు. సమావేశంలో మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపే యాక్షన్



ప్లాన్‌ను వారి సమక్షంలోనే పవన్ తెలియజేశారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ "మత్స్యకారులకు సమస్య వస్తే నాకు వచ్చినట్లే. మా ఇంట్లోని వారికి సమస్య వచ్చినట్లే భావిస్తాను. అదే భావనతో సమస్యను పరిష్కరిస్తా. ఈ విషయాన్ని అక్టోబరు 9న ఉప్పాడసెంటర్‌నుంచి చెప్పాను. ఇప్పుడు అదే మాటమీదఉన్నాను. సమస్య వస్తే రాజకీయాలకు అతీతంగా దాని పరి >>2

# వివేకా హత్య కేసు సునీత పిటీషన్‌పై 10న తీర్పు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు3:** దివంగత వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో లోతైన విచారణ జరగాలని, లేదంటే అసలు నిందితులు తప్పించుకునే ప్రమాదం ఉందని వైఎస్ సునీత తరఫు న్యాయవాది అన్నారు. తన తండ్రి వివేకానంద రెడ్డి హత్య కేసులో సమగ్ర దర్యాప్తు జరపాలని కోరుతూ కుమార్తె వైఎస్ సునీత నాంపల్లి సీబీఐ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై బుధవారం నాంపల్లి సీబీఐ >>2

# దివ్యాంగులకు ఏడు వరాలు

## వారు అందరిలా హక్కులు, అవకాశాలు పొందాలి

### కరుణ కుమారికి ప్రభుత్వం తరపున ఇంటి నిర్మాణం, రూ. 15 లక్షలు, దీపికకు కూడా ఇల్లు, రూ. 10 లక్షల నజరానా

**విజయవాడ,డిసెంబరు 3,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీఎస్ ఆర్టీసీబస్సుల్లో ఇకపై దివ్యాంగులకు ఉచిత ప్రయాణమని సిఎం చంద్రబాబు ప్రకటించారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం నిర్వహించారు. ఈకార్యక్రమంలో సిఎం చంద్రబాబు, మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి పాల్గొన్నారు. అలానే ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున విభిన్న ప్రతిభావంతులు పాల్గొన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా కూటమి ప్రభుత్వం తరపున సిఎం 7వరాలు ప్రకటించారు. స్థానిక సంస్థల్లో, కార్పొరేషన్స్ పబ్లిక్ సెక్టార్ ఎంటర్‌ప్రైజెస్‌లో కనీసం ఒక దివ్యాంగ ప్రతినిధిని నామినేట్ చేస్తామని తెలిపారు. ఆర్థిక సబ్సిడీ పథకాన్ని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు అందించినట్టుగానే దివ్యాంగులకు మళ్లీ ప్రారంభిస్తామని స్పష్టంచేశారు. శాప్‌ద్వారా అన్ని క్రీడా కార్యక్రమాలు, >>2



బుధవారం విజయవాడలో అంధ మహిళల ప్రపంచకప్‌లో ప్రతిభకనబరచిన కరుణ, దీపికలను అభినందిస్తున్న సీఎం చంద్రబాబు

# లోక్‌భవన్‌గా రాజ్‌భవన్ పేరు మార్పు

**విజయవాడ, డిసెంబరు 3,ప్రభాతవార్తప్రతినిధి:** భారత ప్రభుత్వ హోం మంత్రిత్వ శాఖ నుండి అందిన ఆదేశాల ప్రకారం, ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ 'రాజ్ భవన్, ఆంధ్రప్రదేశ్' పేరును 'లోక్ భవన్, ఆంధ్రప్రదేశ్' గా మార్చడానికి ఆమోదం తెలిపారు. ఈ మేరకు గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి. అనంత రాము బుధవారం నోటిఫికేషన్ జారీ చేశారు. దీంతో రాజ్‌భవన్ దగ్గర పేరును మారుస్తున్నారు.

04-12pg2exHMNWJQE 2_04-12pg2exHMNWJQE.qxd 04/Dec/25 12:10 AM Page 1





ఉద్భవ్ వేడుకల్లో గిరిజన సంప్రదాయ నృత్యాలు ప్రదర్శిస్తున్న అరకు ప్రాంత విద్యార్థులు

# ఆదివాసీలు, గిరిజనుల అభివృద్ధికే 'ఉద్భవ్'

>> చారు. ఉద్భవ్2025 అంటే వేడుక కాదు..గొప్ప మార్పుకు వేదిక అని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి వెల్లడించారు. చిన్నారులలోని ప్రతిభ, సృజనాత్మకతను బయటకి తీసి విశ్వాసం నింపాలనేదే లక్ష్యమన్నారు. కొత్త పరిచయాలు, కొత్త సంప్రదాయాలను తెలుసుకునే అవకాశం ఈ ఉత్సవం వల్ల సాధ్యపడుతుందన్నారు. 405 ఇఎంఆర్ఎస్ స్కూళ్ల నుంచి 1647 మంది తరలివచ్చారని మంత్రి సంధ్యా రాణి స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా ఇంత పెద్ద సంఖ్యలో చిన్నారులు పాల్గొనే వేదిక ఎపి కావడం సంతోషకరమన్నారు. 110 మంది ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు. గిరిజనుల అభివృద్ధికోసం ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని ఉద్భవ్ 2025 వేదికగా మంత్రి సంధ్యారాణి వెల్లడించారు. వెనుకబడిన వర్గాలకు సీఎం నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తోందన్నారు. గిరిజన చిన్నారులు కూడా డాక్టర్లు, ఇంజినీర్లు, టీచర్ల వంటి గొప్ప చదువు చదవడమే కాకుండా మంచి పౌరులుగా నిలవాలన్నారు. గెలుపు ముఖ్యమే..కానీ ఓటమికి మాత్రం భయపడ కూడదంటూ ప్రసంగంతో స్ఫూర్తి నింపారు. 28 లక్షల మంది గిరిజనులున్న ఎపిలో ఉద్భవ్ 2025కు ఆతిథ్యమిస్తున్నందుకు గర్వపడుతున్నట్లు గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.మల్లికార్జున నాయక్ పేర్కొన్నారు. ఇటువంటి సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ వల్ల మనలోని వైవిధ్యాన్ని పెంపొందిస్తాయన్నారు. దేశవ్యాప్తంగా 740 ఇఎంఆర్ఎస్ లు ఉన్నాయన్నారు. 440 ఇఎంఆర్ఎస్ భవనాలను కేంద్రం నిర్మిస్తోందన్నారు. రాష్ట్రాలవారీగా గిరిజనుల జీవన వైవిధ్యం, సంస్కృతిని దేశవ్యాప్తంగా తెలిపే వేదికగా ఉద్భవ్2025 మారుతుందన్నారు. ఇటువంటి ఉత్సవాలలో సినీ ప్రముఖులను కూడా భాగస్వామ్యం చేస్తే మరింత బాగుంటుందన్నారు. 20 ప్రత్యేక బృందాలను నియమించి పోటీలకు తగిన వసతులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే పోటీలకు తగ్గ భోజన, వసతి సదుపాయాలు సిద్ధంగా ఉందన్నారు. అతిథుల ప్రసంగాల అనంతరం కేంద్రమంత్రి జువల్ ఓరమ్, రాష్ట్ర మంత్రి సంధ్యారాణి, మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ, లిడ్ క్యాప్ ఛైర్మన్ పిల్లి మాణిక్యరావు, వక్ఫ్ బోర్డు ఛైర్మన్ షేక్ హసన్ బాష, నెస్ట్స్ కమిషనర్ అజిత్ కుమార్ శ్రీవాత్సవ, తదితరులను సన్మానించారు. వేంకటేశుని విగ్రహాలను వారికి జ్ఞాపికలుగా బహూకరించారు. అంతకుముందు జ్యోతి ప్రజ్వలనతో ఉద్భవ్ఉత్సవాలను ముఖ్యఅతిథి కేంద్ర మంత్రి ఓరమ్, రాష్ట్రమంత్రి సంధ్యారాణి ప్రారంభించారు.

# సునీత పిటీషన్‌పై 10న తీర్పు

>> కోర్టులో విచారణ జరిగింది. అసలు నిందితులు తప్పించుకోకుండా ఈ కేసు విచారణ జరపాలని ఆమె కోరారు. సప్లిమెంటరీ ఛార్జ్‌షీట్ వేసేలా సీబీఐని ఆదేశించాలని కోరారు. దర్యాప్తు కొనసాగితే సంచలన విషయాలు వెలుగులోకి వస్తాయని కూడా సునీత అభిప్రాయపడ్డారు. దర్యాప్తు కొనసాగించే అవకాశం లేదని నిందితుల తరఫు న్యాయవాదులు కోర్టుకు తెలిపారు. ఇరువైపుల వాదనలు విన్న న్యాయస్థానం తీర్పును రిజర్వ్ చేసింది. ఈ నెల 10న తీర్పును వెలువరించనుంది.

## ఇంటర్నెట్ సిసికెమేరాలను హ్యాక్‌చేసిన సైబర్ నేరగాళ్లు

**సియోల్, డిసెంబరు 3:** ఇంట్లో, ఆఫీసులో సెక్యూరిటీ కోసం ఏర్పాటు చేసుకునే సిసి కెమెరాలను సైబర్ నేరస్తులు హ్యాక్ చేశారు. ఏకంగా 1.20 లక్షల సీసీ కెమెరాలను హ్యాక్ చేసి మహిళలు, దంపతులు ఏకాంతంగా ఉన్న వీడియో క్లిప్ లను సేకరించి పోర్న్ వీడియోలు తయారు చేశారు. వాటిని ఆన్ లైన్ లో అమ్మకానికి పెట్టారు. సౌత్ కొరియాలో వెలుగుచూసిన ఈ భారీ సైబర్ స్కామ్‌తో అక్కడి ప్రజల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. ఈ క్రమంలో ఇంటర్నెట్ కనెక్టెడ్ సీసీ కెమెరాలు అమర్చుకున్న వారు జాగ్రత్తగా ఉండాలని, తరచుగా పాస్ వర్డ్‌లు మార్చాలని నిపుణులు సూచిస్తున్నారు. మిగతా వాటితో పోలిస్తే ఇంటర్నెట్ కనెక్టెడ్ సిసి కెమెరాల ధర చాలా తక్కువ. దీంతో చాలామంది వీటిని కొనుగోలు చేసి తమ ఇళ్లు, ఆఫీసుల్లో అమర్చుకుంటున్నారు.

# పుతిన్‌కు ఐదంచెల భద్రత

>> ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) మానిటరింగ్ వ్యవస్థలను మోహరించారు. సమాచారం ప్రకారం, ఇప్పటికే రష్యాకు చెందిన 48 మంది ఉన్నత స్థాయి భద్రతా సిబ్బంది ఢిల్లీకి చేరుకున్నారు. వారు ఢిల్లీ పోలీసులు, ఎన్ఎస్‌జి అధికారులతో కలిసి పుతిన్ ప్రయాణించే అన్ని మార్గాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. పుతిన్ భద్రతలో బయటి వలయాల్లో ఎన్ఎస్‌జి, ఢిల్లీ పోలీసులు ఉండగా, అంతర్గత వలయాల బాధ్యతను రష్యా అధ్యక్ష భద్రతా దళాలు చూసుకుంటాయి.

ప్రధాని మోడీతో ఉన్నప్పుడు, భారత స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ (ఎస్పీజీ) కమాండోలు కూడా ఈ భద్రతలో పాలుపంచుకుంటారు. ఈ పర్యటనలో మరో ప్రత్యేక ఆకర్షణ పుతిన్ వాడే అరస్ సెనాట్ అనే అత్యంత సురక్షితమైన లగ్జరీ కారు. దీనిని ప్రత్యేకంగా మాస్కో నుంచి భారత్‌కు తీసుకువస్తున్నారు. చక్రాలపై నడిచే కోటగా పిలిచే ఈ కారు పూర్తి ఆర్మర్డ్ వాహనం. పుతిన్ బస చేసే హోటల్‌తో పాటు ఆయన పర్యటించే రాజ్‌ఘాట్, హైదరాబాద్ హౌస్, భారత్ మండపం వంటి అన్ని ప్రదేశాలను భద్రతా దళాలు తమ ఆధీనంలోకి తీసుకున్నాయి.

# 'ఉప్పాడ'కు శాశ్వత పరిష్కారం

>> ష్కారానికి ముందుకు వెళ్లేవాడిని. నాకు మీ సహకారం కావాలి. నన్ను శకించకండి.. నేను మీ వాడిని. మిగతా పార్టీల నాయకుల్లా సమస్య వస్తే బూతులు తిట్టడం, గొడవలు పెట్టడం చేయను. పరిష్కారం వచ్చేలా పని చేస్తాను. దాని కోసం పరితపిస్తాను" అని పేర్కొన్నారు.

**కాలుష్యానికి మూలం తెలియాలి**

"సముద్రపు కాలుష్యం చాలా రకాలుగా ఉంటుంది. మత్స్యకారులు ఉప్పాడ తీరంలో కాలుష్య సమస్య నా దృష్టికి తీసుకొచ్చిన వెంటనే దీని మూలాలను శాస్త్రీయంగా వెతికేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టాను. ఇప్పుడు డాక్టర్ జో కిజాకూడన్ బృందం రంగంలోకి దిగి ఉప్పాడ తీరంలో కాలుష్య సమస్యపై పూర్తిస్థాయి అధ్యయనం చేస్తుంది. దీని మూలాలు వెతికి, శాశ్వత పరిష్కారం వెతుకుదాం. మత్స్యకారులకు ఎలాంటి సమస్యా రాకుండా చూసుకునే బాధ్యతను నేను తీసుకుంటాను. పరిశోధన బృందానికి మత్స్యకారులు తగిన విధంగా సహకరించాలి. వారు తీర ప్రాంతంలో అంతా తిరిగి, సముద్రంలోకి వెళ్లి మరీ కాలుష్యానికి అసలు కారణాలను తెలుసుకుంటారు" అని ఉపముఖ్యమంత్రి తెలిపారు.

**సమస్యను మర్చిపోలేదు**

"అక్టోబరు 9వ తేదీన ఉప్పాడ వేదికగా 100 రోజులు గడువు ఇవ్వాలని మత్స్యకారులను కోరాను. అప్పటి నుంచి నాతోపాటు నా కార్యాలయ అధికారులు దీనిపై కూలంకషంగా పని చేస్తున్నారు. సమస్య పరిష్కార దిశగా, మత్స్యకారులకు కొత్త భరోసా ఇచ్చే దిశగా ముందుకు వెళ్తున్నాం. సమస్యను నేనెప్పుడూ మర్చిపోలేదు. మత్స్యకారులు మారుతున్న కాలంతో మరింత వేగంగా వారి బతుకులను బంగారుమయం చేసుకునేందుకు వివిధ రాష్ట్రాల్లో విజయవంతంగా అమలు అవుతున్న పద్ధతులను అవలంబించాలి. దీనికోసం ఉప్పాడ మత్స్యకారులనుంచి ప్రత్యేకంగా బృందాలను తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు పంపుతున్నాం. అక్కడి విధానాలను అవగతం చేసుకోవాలి. దానికి ప్రభుత్వం కూడా మీకు తగిన విధంగా సహకరిస్తుంది. అక్కడ పద్ధతులను క్షుణ్ణంగా తెలుసుకోవాలి. అదనపు ఆదాయ మార్గాల మీద దృష్టి సారించాలి. ఉప్పాడలోని 7200 మంది మత్స్యకారులు, 25,600 మంది వారి కుటుంబ సభ్యులకు జీవన భృతి రెట్టింపు అవ్వాలి అన్నదే లక్ష్యం" అని పవన్ అన్నారు.

## విమానం హైజాక్‌ను తప్పించిన పైలట్ సమయస్ఫూర్తి

**జుబా, (దక్షిణసూడాన్), డిసెంబరు 3:** దక్షిణ సూడాన్‌లో ఓ విమానం హైజాక్ ఉదంతం సుఖాంతమైంది. సాయుధుడైన హైజాకర్ విమానాన్ని మరో దేశానికి మళ్లించాలని ఒత్తిడి చేయగా, పైలట్ సమయస్ఫూర్తితో వ్యవహరించి విమానాన్ని సురక్షితంగా ల్యాండ్ చేసి, నిందితుడిని అధికారులకు పట్టించారు. ఈ ఘటనలో సిబ్బందికి ఎలాంటి హాని జరగలేదు. రాజధాని జుబా నుంచి మైవుట్‌కు వైద్య సామగ్రితో సెస్నా గ్రాండ్ కారవాన్ విమానం బయలుదేరింది. టేకాఫ్‌కు ముందే యాసిర్ మహమ్మద్ యూసఫ్ అనే వ్యక్తి తుపాకీతో విమానంలోకి ప్రవేశించి, వెనుక క్యాబిన్‌లో దాక్కున్నాడు. విమానం గాల్లోకి లేచిన తర్వాత బయటకు వచ్చి, దానిని ఆఫ్రికా దేశమైన చాద్‌కు మళ్లించాలని పైలట్‌ను బెదిరించాడు.

ఈ అనూహ్య పరిణామంతో పైలట్ ఏమాత్రం కంగారు పడకుండా చాకచక్యంగా వ్యవహరించాడు. విమానంలో ఇంధనం అయిపోతోందని, చాద్‌కు వెళ్లాలంటే సమీపంలోని వావు నగరంలో ఇంధనం నింపుకోవాలని హైజాకర్‌ను నమ్మించాడు. అదే సమయంలో రహస్యంగా అధికారులకు సమాచారం అందించాడు. విమానం వావులో ల్యాండ్ అవగానే, భద్రతా సిబ్బంది నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనను దక్షిణ సూడాన్ సివిల్ ఏవియేషన్ అథారిటీ ధ్రువీకరించింది. విమానం సురక్షితంగా ల్యాండ్ అయిందని, పరిస్థితిని అదుపులోకి తెచ్చామని తెలిపింది. హైజాక్‌కు గల కారణాలపై దర్యాప్తు జరుపుతున్నట్లు అధికారులు వెల్లడించారు. దక్షిణ సూడాన్‌లో ఇలాంటి ఘటనలు చాలా అరుదు కావడంతో ఈ సంఘటన తీవ్ర కలకలం రేపింది.



బుధవారం విజయవాడలో సిఎం చంద్రబాబుతో భేటీ అయిన గౌతమ్ అదాని

# సిఎం చంద్రబాబును కలిసిన గౌతమ్ అదాని

**విజయవాడ, డిసెంబరు 3 ప్రభాతవార్త ప్రతినిధి:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో అదాని గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదాని భేటీ అయ్యారు. ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయంలో బుధవారం జరిగిన ఈ సమావేశంలో మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. రాష్ట్రంలో అదాని గ్రూపు చేపట్టిన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, రానున్న రోజుల్లో పెట్టబోయే పెట్టుబడులపై ఈ సమావేశంలో చర్చించారు.

# ఎడతెరిపిలేని వాన

>> ప్రధాన రహదారిపై చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వెంకటాచలం నుంచి వేదాయపాలెం సెంటర్ వరకు నేషనల్ హైవే నిండా వరద నీరు చేరింది. దీంతో గంటల కొలది ట్రాఫిక్ జామై వాహనాలు ముందుకు కదలలేని పరిస్థితులు నెలకొన్నాయి. అక్కడక్కడ కొన్నివాహనాలు మరమ్మతులకు గురికావడంతో వాహన రాకపోకలు ఆగిపోయాయి. ఆత్మకూరు బస్టాండు, విఆర్సి, మాగుంట లేఔట్ తదితర అండర్ బ్రిడ్జిల నిండా నీరు చేరినా, ముందస్తు ప్రణాళికలతో మోటార్లతో నీటిని తోడి వేయడంతో వాహనాల రాక పోకలు కొనసాగాయి. మాగుంట లేఔట్ ప్రధాన రహదారిపై మోకాలిలోతు నీరు చేరడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి. మినీ బైపాస్ కూడా వరద నీటిలో చిక్కుకొని ప్రజలు, వాహనదారులు అవస్థలు పడ్డారు. ఏది ఏమైనా నెల్లూరు నగరం గుండా ప్రవహించే పంట కాలువలు కొంత భాగం ఆక్రమణకు గురికావడం, మరి కొంత భాగంలో కాలువల వైశాల్యాన్ని తగ్గించడంతో ముంపు అనివార్య మవుతుంది.

## తీవ్ర అల్పపీడనంగా బలహీన పడిన వాయుగుండం

**విజయవాడ,డిసెంబరు 3,ప్రభాతవార్తప్రతినిధి:** నైరుతీ బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తీవ్ర అల్పపీడనంగా బలహీన పడినట్లు విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. ఈ మేరకు ఆ సంస్థ బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. దీని ప్రభావంతో గురువారం నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన మోస్తారు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ప్రకాశం, అనంతపురం, శ్రీసత్యసాయి, కడప, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించింది. వాయుగుండం నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా తేలికపాటి నుంచి ఒక మోస్తారు వర్షాలు కురుస్తున్నాయి.

ఈ నెల 2న ఉదయం 8.30 గంటల నుంచి 3న ఉదయం 8.30 గంటల వరకు తిరుపతి, నెల్లూరుజిల్లాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి..తిరుపతి జిల్లా వాకాడులో 281.4మిల్లీ మీటర్లు, చిట్టమూరులో 226.7, కోటలో 189.3, దొరవారిసత్రంలో 124.9, ఓజిలిలో 116.4, నాయుడుపేటలో 106.8 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైంది. పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వెంకటాచలంలో 247.5మిల్లీ మీటర్లు,మనుబోలులో 145.3, నెల్లూరు రూరల్‌లో 112.5, ముత్తుకూరులో 106.9మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైంది. బుధవారం సాయంత్రం 5 గంటలకు తిరుపతి జిల్లా తొట్టంబేడులో 47.2 మిల్లీ మీటర్లు, నెల్లూరు జిల్లా కృష్ణపట్నంలో 37.5 మిల్లీమీటర్లు, తిరుపతి జిల్లా మన్నారుపోలూరులో 32.7 మిల్లీ మీటర్లు, చిత్తూరు జిల్లా నింద్రలో 30 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైందని విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది.

# దివ్యాంగులకు ఏడు వరాలు

>> టాలెంట్ డెవలప్మెంట్ స్కీములు దివ్యాంగులకు అందుబాటులో ఉండేలా చర్యలు చేపడతామని సీఎం చంద్రబాబు వెల్లడించారు.

**సామాజిక భద్రతా పెన్షన్ పంపిణీ:**

బహుళ అంతస్తులు కలిగిన ప్రభుత్వ హౌసింగ్ ప్రాజెక్టుల్లో దివ్యాంగులకు గ్రౌండ్ ఫ్లోర్ కేటాయిస్తామని హామీ ఇచ్చారు. బాపట్లలో ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ పాఠశాల, జూనియర్ కాలేజ్‌తో పాటు వినికిడి లోపం ఉన్న విద్యార్థుల కోసం ప్రత్యేక డిగ్రీ కాలేజీ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. రెసిడెన్షియల్ స్కూల్స్, కాలేజీలు, హాస్టల్స్‌లో చదివే దివ్యాంగ విద్యార్థులకు అదే చోట సామాజిక భద్రతా పెన్షన్ పంపిణీ చేస్తామని సీఎం స్పష్టం చేశారు. రాష్ట్ర స్థాయిలో అమరావతిలో దివ్యాంగ్ భవన్ ఏర్పాటు చేస్తామని అన్నారు. ఇటీవలే అంధుల ప్రపంచకప్ గెలిచిన జట్టు కెప్టెన్ దీపికతో పాటు పాడేరుకు చెందిన కరుణకుమారికి ప్రభుత్వం తరపున ఆర్థిక సాయం ప్రకటించారు. ఇల్లు కట్టిస్తామని చెప్పారు. కరుణకుమారి కోచ్, అర్జున అవార్డు గ్రహీత అజయ్ కుమార్ రెడ్డికి కూడా ఆర్థిక సాయం ప్రకటించారు. వీరికి ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ తరపున 10 లక్షల పురస్కారం అందించారు. కరుణకుమారికి 5 లక్షల బహుమతి, కుమారి దీపిక, అర్జున అవార్డు గ్రహీత అజయ్‌కుమార్ రెడ్డికి బ్లైండ్ క్రికెట్ అసోసియేషన్ తరపున 1 లక్ష పురస్కారం అందించారు.కరుణ కుమారి, దీపిక జాతి గర్వపడేలా క్రికెట్ కప్ పోటీల్లో రాణించి స్ఫూర్తిని నింపారు... వారికి మనస్ఫూర్తిగా అభినందనలు. ఈ కార్యక్రమం ద్వారా వారికి అండగా ఉండటమే కాదు..పూర్తిగా ప్రోత్సాహించాలిజదివ్యాంగులు ఎప్పుడూ బలహీనులు కాదు... వారు విభిన్న ప్రతిభావంతులు.విభిన్న ప్రతిభావంతులకు కొంచెం మద్దతిస్తే విజయం సాధించగలరు.విల్ పవర్, పట్టుదల, శక్తి విభిన్న ప్రతిభావంతులకు ఉంది. పట్టుదలకు దివ్యాంగులు చిరునామాగా ఉంటారు. సమాజంలో అందరిలాగా దివ్యాంగులకు అవకాశాలు, హక్కులు, గౌరవం పొందాలి. అనుకూలమై సమాజాన్ని నిర్మించాలనే థీమ్ తో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నాం. దివ్యాంగుల ఎదుగుదలకు ఉన్న అడ్డంకులు తొలగిస్తూ అవసరమైన విధానాలు రూపొందిస్తున్నాం.

దివ్యాంగులకు అండగా ఉన్నది మా ప్రభుత్వమే. మొదట ఎన్టీఆర్ రూ.35 పింఛను ఇచ్చారు. తర్వాత 2014లో సీఎం అవ్వగానే దివ్యాంగుల పింఛను రూ.3000 చేశాం. 2024లో మళ్లీ రూ.6,000కు పెంచాం.దేశంలో ఎక్కడా రూ.6 వేలు పెన్షన్ ఇవ్వడం లేదు. ఇదీ దివ్యాంగుల పట్ల మా ప్రభుత్వానికి ఉండే అభిమానం, ప్రేమ. రాష్ట్రంలో 7.68 లక్షల మంది దివ్యాంగులకు ప్రతి నెలా రూ.470కోట్లు, ఏడాదికి రూ.6వేలకోట్లు పింఛన్ల రూపంలో ఇస్తున్నారు, దివ్యాంగులకు బ్యాక్ లాగ్ పోస్టులకు స్పెషల్ రిక్రూట్ మెంట్ డ్రైవ్‌ను పొడిగిస్తున్నాం. దివ్యాంగులు నడవడానికి మోటార్ వాహనాలు ఇస్తున్నాం.

ఈ ఏడాది 1800 వాహనాలను దివ్యాంగులకు ఇస్తున్నాం.వీటితో పాటు వీల్ ఛైర్లు ట్రై సైకిళ్లు, వినికిడి యంత్రాలు దాదాపు 14 వేల మందికి వివిధ పంపిణీ చేశామన్నారుజగత పాలకుల అస్తవ్యస్థ విధానాలతో రాష్ట్రం ఆర్థికంగా ఛిన్నాభిన్నం అయినా దివ్యాంగులను ఆదుకోవడానికి ప్రయత్నిస్తున్నాం. వైకల్యం విజయానికి అడ్డం కాదని కరుణ కుమారి, దీపిక, అజయ్ కుమార్ రెడ్డి నిరూపించారన్నారు.అల్లూరి జిల్లాకు చెందిన కరుణ కుమారి.ఎంతో ప్రేరణతో ఉండేది. కేవలం శబ్దంతోనే క్రికెట్ నేర్చుకుంది.ఆర్థిక పరిస్థితి బాగోలేకపోయినా కప్పుతో ఇంటికి వస్తానని తండ్రికి మాట ఇచ్చి అవార్డుతో ఇంటికి వచ్చి మాట నిలబెట్టుకుంది.ఇందుకు అజయ్ కుమార్ రెడ్డి ట్రైనింగ్ ఇచ్చారు.తీవ్రమైన దృష్టిలోపం ఉన్నా ప్రతిభలో వెనకబడలేదు. 42 పరుగులు చేసి దేశానికి కప్ రావడంలో కీలకంగా వ్యవహరించారు. ఆమెను చూసి నాకు తృప్తి కలిగింది. ఆధునిక వసతులతో ఉన్న పాఠశాలలో ఆడుకోలేదు... ప్రభుత్వ స్కూల్లో చదువుకుని ప్రపంచ కప్ గెలిచినందుకు గర్వపడుతున్నా. ఇది అందరికీ స్ఫూర్తి కావాలన్నారు.

# సాగు మేలుకు పంచసూత్రాలు

>> కారణం. కరువు ఎక్కువగాఉండే సీమలోని నంద్యాల జిల్లాలో 4 మీటర్లకు భూగర్భ జలాలు పెరిగాయి. రాష్ట్రం మొత్తం మీద తూర్పు గోదావరి, ఏలూరు, ప్రకాశం జిల్లాలో భూగర్భ జలాలు తగ్గాయి. రాష్ట్రంలో కృష్ణా, గోదావరి నుంచి నీరు వృథాగా సముద్రంలోకి పోతోంది. ఈ రెంటిని అనుసంధానం చేసి ప్రతి ఎకరాకు సాగు నీరు అందిస్తాం"అని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు.

**డిమాండ్ ఉన్న పంటల సాగుతో ఆదాయం**

"రైతులు డిమాండ్ ఉన్న పంటలను సాగు చేయాలి. వినూత్న పద్ధతుల్లో విభిన్న పంటలు పండించాలి. ఏ పంటలకు డిమాండ్ ఉంది, ఎక్కడ మార్కెట్ ఉంది, సాగులో కొత్త పద్ధతులు ఏంటి అనే వాటిపై రైతులకు అవగాహన రావాలి. వ్యవసాయ రంగాన్ని రీఓరియేంటేషన్ చేస్తాం. పామాయిల్ సాగులో టెక్నాలజీ ఉపయోగించి తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందవచ్చు. ఇథనాల్ తయారీ కోసం కేంద్ర ప్రభుత్వాలు మొదట మొక్కజొన్న సాగును ప్రోత్సహించాయి. తర్వాత పాలసీ మారడంతో ఇథనాల్ తయారీకి 40 శాతం వరి నూకలు, 60 శాతం జొన్నలు వాడుతున్నారు. దీంతో మొక్కజొన్నకు డిమాండ్ తగ్గి రైతులు నష్టపోయారు. అలాగే డిమాండ్ ఉందని హెచ్డీ బర్లీ పొగాకు భారీగా సాగు చేశారు. తర్వాత మార్కెట్ పడిపోయింది. అంతర్ పంటలు వేసిన రైతులకు లాభాలు వస్తున్నాయి. చిత్తూరు జిల్లాలో కొందరు రైతులు మామిడి పండ్లకు పురుగు పట్టకుండా కవర్ పెట్టి జాగ్రత్తలు తీసుకోవడంతో మంచి లాభాలు పొందారు" అని సీఎం తెలిపారు.

**ప్రకృతి సేద్యంతో ఆరోగ్యం పదిలం**

"టెక్నాలజీ వినియోగంతో వ్యవసాయం లాభసాటిగా మారుతుంది. ఒక పంట వరి వేసినప్పటికీ మరో పంటగా హార్టికల్చర్‌కు వెళితే ఆదాయం పెరుగుతుంది. నియోజకవర్గానికి ఒక ఎంఎస్ఎంఇ పార్కు పెడుతున్నాం. రైతులు పండించిన పంటను నేరుగా వినియోగదారునికి విక్రయించేలా చర్యలు తీసుకుంటున్నాం. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా తయారుచేస్తున్నాం. సీమలో 18 రకాల పంటలు, పండ్లు పండుతున్నాయి. ఎడారిలో పండే ఖర్జూరాలనూ వాళ్ల పండిస్తున్నారు. మారిన పరిస్థితులకు అనుగుణంగా ముందుకెళ్లాలి. డైరీ, పౌల్ట్రీ... మీట్‌లో రూ.2 లక్షల కోట్ల జీఎస్డీపీ వస్తుంది. హార్టికల్చర్‌లో రూ.లక్షా 85 వేల కోట్ల జీఎస్డీపీ వస్తుంది. చేపలు, రొయ్యల సాగుతో రూ.లక్షా 45 వేల ఆదాయం వస్తుంది. వ్యవసాయంలో కేవలం రూ.50 వేల ఆదాయమే వస్తుంది" అని సిఎం చంద్రబాబు వివరించారు.

**గత పాలకులు ఖజానా ఖాళీ చేశారు**

"గడిచిన ఐదేళ్లలో పాలన ఎలా ఉందో మనం చూశాం. జగన్మోహన్ రెడ్డి వ్యవస్థలను సర్వనాశనం చేశాడు. ఖజానా ఖాళీ చేశాడు. కనీసం అప్పు దొరకని పరిస్థితి. తాము దక్కించుకోవాల్సిన భూమిని దక్కించుకోలేకపోతే... ఆ భూములను లిటిగేషన్లో పెట్టేవారు. అలాంటి భూములను 22ఎ జాబితాలో చేర్చేవారు. కూటమిపై నమ్మకంతో ప్రజలు అద్భుత విజయం అందించారు. అన్నింటినీ సరిచేసుకుంటూ వస్తున్నాం. సూపర్ సిక్స్‌తో ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకున్నాం. కరెంటు ఛార్జీలు పెంచబోమనే మాటకు కట్టుబడి ఉన్నాం. వచ్చే సంక్రాంతి నాటికి గుంతలు పడ్డ రోడ్లన్నీ మరమ్మతులు చేస్తాం. ఇప్పటికే టాటా సంస్థ సహకారంతో డిజిటల్ నెర్వ్ సెంటర్ సంజీవని కేంద్రాలనే ప్రాజెక్టును తీసుకొచ్చాం" అని చంద్రబాబు తెలిపారు.

**విమర్శలు సహజమే**

పాలనలో సంస్కరణలు తీసుకొస్తున్న క్రమంలో అడ్డంకులు సహజం. నాడు నేను ఐటీని ప్రోత్సహించినప్పుడు విమర్శలు చేశారు. డ్వాక్రా సంఘాలు పెట్టినప్పుడు హేళన చేశారు. కానీ నేడు వాటి ఫలితాలు ఎలా ఉన్నాయో చూస్తున్నారు. సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యత ఇస్తున్నాం. విశాఖలో జరిగిన భాగస్వామ్య సదస్సులో రూ.13.25 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ఇప్పటికే విశాఖ నగరానికి గూగుల్ డేటా సెంటర్ వచ్చింది. 20 లక్షల ఉద్యోగాలు కల్పనకు కట్టుబడి ఉన్నాం. కేంద్ర సహకారంతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని, 2047 నాటికి స్వర్ణాంధ్ర కల సాకారమవుతుందని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

## వారం - వర్జ్యం

04-12-2025, గురువారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
మార్గశిరమాసం, దక్షిణాయణం
శరద్ ఋతువు, కృష్ణపక్షం
చతుర్దశి ఉ.8.37 ○పౌర్ణమి తె.4.44
కృత్తిక మ.2.54,జ్యేష్ఠ కార్తె
వర్జ్యం : రా.4.49-6.12
దు.ఉ.10.07-10.52, 2) మ.2.36-3.21
శుభసమయం : ఉ.11.00-11.45
రాహుకాలం - మ.1.30-3.00

## వార్తాఫలం

**మేషం:** పలురంగాల పట్ల మీకున్న అనుభవం ఉపకరిస్తుంది. వెనువెంటనే పూర్తవుతాయి. క్రయవిక్రయాలలో ప్రోత్సాహం.

**వృషభం:** అనుకున్న పనులు వాయిదా పద్ధతులలో సాగుతాయి. సోదరుల నుండి సహాయ సహకారాలు అందిస్తారు.

**మిథునం:** కరవమంటే కప్పకు కోపం, విడవమంటే పాముకు కోపం అన్న చందంగా ఎవరికీ సర్దిచెప్పలేని పరిస్థితి ఏర్పడుతుంది.

**కర్కాటకం :** దైవం మీద భారం వేసి ఒక కీలక నిర్ణయాన్ని అమలు పరుస్తారు. ఎదుటి వారు చెప్పే ఆసాంతం వినండి.

**సింహం:** సాధ్యమైనంత వరకు పెట్టుబడులను వాయిదా వేయడం మంచిది. వ్యవహారాలలో స్తబ్దత చోటు చేసుకుంటుంది.

**కన్య :** విపక్ష చేస్తున్న విమర్శలను ఎదుర్కొనడానికి కావలసిన ధైర్యసాహసాలను కలిగి ఉంటారు. వాహన సౌలభ్యం కలదు.

**తుల :** మానసిక వత్తిడి అధికమవుతుంది. సెంటిమెంటు వస్తు భద్రతపట్ల జాగ్రత్తలు అవసరం.ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు.

**వృశ్చికం:** స్త్రీలతో విభేదాలు ఏర్పడనంత వరకు చెప్పుకోదగిన ఇబ్బందు లేనీ చోటు చేసుకోవు. సన్నిహిత కలయిక. ఉద్యోగాలలో పదోన్నతులు.

**ధనుస్సు:** తొందరపాటు మాటలు, పరుష సంభాషణలు తగాదాలు లభించవు. అర్థం లేని ఆలోచనలు కొనసాగుతాయి. ధనలాభం.

**మకరం:** ఋణం చేయడం, ఋణం ఇవ్వడం రెండు కలిసిరావు. ఎంతో సాధించాలని తపన పడతారు. సమస్యలు పరిష్కారాన్ని కాలానికి వదిలివేస్తారు.

**కుంభం:** సినీ, కళారంగాలలోని వారు, వస్త్ర వ్యాపారస్తులు జాగరూకతతో మెలగవలసి ఉంటుంది.

**మీనం:** ఆస్తి వివాదాలు పరిష్కార మవుతాయి. మానసిక ప్రశాంత పొందుతారు. ఆరోగ్యంపట్ల మెలుకువ అవసరం. బంధువుల కలయిక.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# భారీ ఎన్‌కౌంటర్

>> యని బస్తర్ ఐజి పట్టులింగం సుందర్ రాజ్, బీజాపూర్ ఎస్పీ జితేంద్ర యాదవ్ తెలిపారు. కాల్పుల ప్రదేశంలో 303 రైఫిల్, ఎస్ఎల్ఆర్ రైఫిల్స్, ఇతర ఆయుధ సామాగ్రిని భారీగా స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతున్నదని, మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని తెలిపారు. అలాగే మృతదేహాల గుర్తింపు పూర్తికాలేదని శోధన పూర్తి అయ్యాక మరింత సమాచారం తెలియజేస్తామని అన్నారు.

# ఎపిపిఎస్సీ 21 పరీక్షల షెడ్యూల్ విడుదల

>> లకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఆయా తేదీల్లో పరీక్షలకు హాజరు కావాల్సి ఉంటుంది.తాజా షెడ్యూల్ ప్రకారం అగ్రికల్చర్ ఆఫీసర్ పరీక్షలు జనవరి 27వ తేదీ ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకూ పేపర్ 1, 28వ తేదీ మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకూ పేపర్ 2 నిర్వహిస్తారు. అలాగే ఏపీ గ్రౌండ్ వాటర్ సబార్డినేట్ సర్వీస్ టెక్నికల్ అసిస్టెంట్ జియో ఫిజిక్స్ పరీక్షను జనవరి 27వ తేదీ ఉదయం పేపర్ 1, 28వ తేదీ మధ్యాహ్నం పేపర్ 2 నిర్వహిస్తారు. ఎపి ఇంటర్ ఎడ్యుకేషన్‌లో లైబ్రేరియన్ సైన్స్ జూనియర్ లెక్చరర్ పరీక్ష కూడా జనవరి 27వ తేదీ ఉదయం పేపర్ 1, 28వ తేదీ మధ్యాహ్నం పేపర్ 2 నిర్వహిస్తారు. ఎపి బిసి వెల్ఫేర్ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పోస్టు పరీక్షలు జనవరి 27న ఉదయం పేపర్ 1, 28న మధ్యాహ్నం పేపర్ 2 ఉంటాయి. ఆర్‌డబ్ల్యూ ఎస్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోస్టుకు కూడా జనవరి 27న ఉదయం పేపర్ 1, 28న మధ్యాహ్నం పేపర్ 2 నిర్వహిస్తారు. ఎపి హార్టికల్చర్ ఆఫీసర్ పోస్టుకు జనవరి 27న ఉదయం పేపర్ 1, జనవరి 28న ఉదయం జనరల్ ఇంగ్లీష్ తెలుగు క్వాలిఫైయింగ్ టెస్ట్, 29న మధ్యాహ్నం పేపర్ 1, 30న ఉదయం పేపర్ 2 పరీక్షలు నిర్వహిస్తారు.

# 'సిట్'వలలో ముంబయి బులియన్ వ్యాపారి

>> డాన్లలో ఒకరైన చాముండ బులియన్ యజమాని చేతన్‌కుమార్ జస్‌రాజ్ నన్ను పిలిచి హైదరాబాద్ నుంచి రూ.100 కోట్లు వస్తాయి.. ఆర్వోసీలో మేనేజ్ చేసి షెల్ కంపెనీలు సృష్టించి కెవైసి ద్వారా బ్యాంకు ఖాతాలు తెరిపించాలని అడిగారు.. కమీషన్ మాట్లాడుకుని నేను 30 కంపెనీల పేర్లు, ఖాతాల వివరాలు చేతన్‌కుమార్‌కు అందజేశాను.. తర్వాత ఆదాన్, లీలా, ఎస్‌పివై ఖాతాల నుంచి నా పరిధిలో ఉన్న నాలుగు బ్యాంకు ఖాతాలకు రూ.78 కోట్లు వచ్చాయి.. నకిలీ ఇన్వాయిస్‌లు, ఫేక్ జిఎస్టీతో కొంత, బులియన్ ద్వారా బంగారం కొనుగోలు చేసినట్లు మరికొంత వైట్‌గా మార్చేసి కమీషన్ పోను మిగతా సొమ్ము తిరిగి చెల్లించా' అని చోఖ్రావెల్లడించాడు. దీంతో సిట్ అధికారులు చేతన్‌కుమార్‌కు ఫోన్ చేసి చోఖ్రాతో కలిపి ప్రశ్నించాల్సి ఉందని, విజయవాడకు రమ్మని పిలిచారు.తనకు ఆరోగ్యం బాగాలేదంటూ తన తమ్ముడు రోణిక్ కుమార్‌ను పంపాడు. మంగళవారం ఉదయం సిట్ కార్యాలయానికి వచ్చిన రోణిక్‌ను అధికారులు చోఖ్రాతోకలిపి సాయంత్రం వరకు విచారించారు. అతడు చెబుతున్న విషయాలేవీ తనకు తెలియవని, అంతా తన అన్నే చూసుకుంటాడని రోణిక్ చెప్పడంతో.. 'చేతన్‌ను బుధవారంరమ్మను.. ముగ్గురినీ కలిపి ప్రశ్నిస్తాం' అంటూ సిట్ అధికారులు సూచించారు. ఫోన్లో ఈవిషయం చెబుతానని, హాల్లో ఉంటానని చెప్పిన రోణిక్ అక్కడినుంచి తప్పించుకున్నాడు. గన్నవరం విమానాశ్రయానికిపరారయ్యాడు. ముంబై విమానం ఎక్కేందుకు బోర్డింగ్‌పాస్‌తో సిద్ధంగాఉన్న రోణిక్‌ను సిట్ అధికారులు అదుపులోకితీసుకున్నారు. ఈ కేసులో పూనాభాయ్ సోదరులిద్దరినీ నిందితులుగా చేర్చారు. అతడిని ఏ50గా, చేతన్‌కుమార్‌ను ఏ51గా పేర్కొంటూ ఏసీబీ కోర్టుకు సమాచారం కూడా ఇచ్చారు. దీంతో ఈ కుంభకోణం కేసులోని నిందితుల సంఖ్య 51కి చేరింది.

## రైల్వే పోక్సో కేసులో నిందితుడికి జీవితశిక్ష

**కడప,డిసెంబరు3, ప్రభాతవార్త:** ఆరుసంవత్సరాల క్రిందట తిరుపతి-నిజాముద్దీన్ రాయలసీమ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌రైల్లో జరిగిన ఎనిమిదేళ్ల బాలికపై అత్యాచారం కేసులో కడప ఫోక్సో కోర్టులో నిందితుడికి జీవితకాలం జైలుశిక్ష, 10వేల రూపాయలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. అంతేగాక బాధితురాలికి 10.50లక్షల రూపాయలు పరిహారం చెల్లించాలని న్యాయమూర్తి ప్రవీణ్‌కుమార్ గుంతకల్లు డిఆర్ఎంకు ఆదేశించారు. 2019వ సంవత్సరంలో రైల్లో ఎనిమిదేళ్ల బాలికపై కడపటౌన్‌కు చెందిన గాలిరామ్‌ప్రసాద్‌రెడ్డిఅనే ప్రసాద్‌రెడ్డి(28) రైలు బోగీ బాత్‌రూమ్‌లో అత్యాచారం చేశాడు. అప్పట్లో ఈ కేసును కడప రైల్వేపోలీస్‌లు నమోదు చేశారు. ఫిర్యాదుదారుల కేసు నమోదు చేసిన కడప జిఆర్‌పి పోలీస్ డిఎస్పీ రమేశ్ (ప్రస్తుతం రిటైర్డ్)దర్యాప్తు చేశారు. దీనిపై పిపిలు కొమ్మినేని వేణుగోపాల్, అప్పటి పిపి రామసుబ్బారెడ్డి ఈ కేసు వాదించారు. సాక్ష్యాధారాలతో కోర్టుకు సమర్పించడంతో నిందితుడికి జీవితకాలం జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టడంలో కడప రైల్వే హెడ్‌కానిస్టేబుల్ ఎం.నాగరాజునాయక్ చొరవతీసుకున్నారు.

04-12Pg3exHMNWJQEKLT 3 ONG_04-12Pg3exHMNWJQEKLT.qxd 03/Dec/25 11:59 PM Page 1



# అగ్రిగోల్డ్ బాధితుల ఆగ్రహం

**యాజమాన్యం కుట్రలను తిప్పికొట్టాలి - అగ్రి ఆస్తుల వేలంను వేగవంతం చేయాలి - సిఎం చంద్రబాబు చొరవ తీసుకుని సమస్య పరిష్కరించాలి - ఒక్క బాధితుడు మరణించినా ఆ బాధ్యత ప్రభుత్వానిదే:ముప్పాళ్ల నాగేశ్వరరావు**



**విజయవాడ, ప్రభాతవార్త డిసెంబర్ 03:** తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అగ్రిగోల్డ్ బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిరసన చేపట్టారు. అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన బాధితులు బుధవారం విజయవాడలోని రైల్వేస్టేషన్ నుండి ధర్నాచౌక్ వరకు ఆవేదన యాత్రను చేపట్టారు. అనంతరం అసోసియేషన్ అధ్యక్షుడు ఈవీ నాయుడు అధ్యక్షతన ఆవేదన దీక్షను చేపట్టారు. ఈ సందర్భంగా అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు ముప్పాళ్ళ నాగేశ్వరరావు మాట్లాడుతూ అగ్రిగోల్డ్ సమస్యపై పట్టువిడువకుండా వేలాదిమంది పోరాటపటిమతో ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడంతో కొంతమేరకు విజయం సాధించుకున్నామని దీంతో దాదాపుగా 10,4300మందికి రూ 10వేలు, రూ 20వేలు బాధితులకు ఇవ్వడం జరిగిందన్నారు. పలు ఇబ్బందులను తట్టుకోలేక దాదాపుగా 1100మంది ఆత్మహత్యలు చేసుకున్నారని, అందులో దాదాపుగా 127మందికి ఎటువంటి రిపోర్టులు లేకుండా పరిహారం ఇప్పించడం జరిగిందన్నారు. కంపెనీలో పెద్దమొత్తంలో డిపాజిట్ చేసినవారు దాదాపుగా 10లక్షలమంది పైగా ఉన్నారని వారికి న్యాయం జరిగేవరకు ఈ పోరాటం ఆగదని తేల్చిచెప్పారు. సమస్యను అధిగమించేందుకు చావోరేవో తేల్చుకునే వరకు వెనకడుగు వేయకుండా పోరాడాలని హితవు పలికారు. కొంతమంది కంపెనీ యాజమాన్యం భక్షులు ఉండి సమస్యను తప్పుదారి పట్టిస్తున్నారని వారి విజ్ఞతకే వదిలేద్దామని అన్నారు. పూర్తి స్థాయిలో సమస్యను పరిష్కరించే వరకు దాదాపుగా 12 సంవత్సరాల నుండి పలు విధాలుగా ఉద్యమాలు చేపడుతున్నామని, ఇలాంటి ఉద్యమం ఇప్పటివరకు దేశంలోనే లేదని స్పష్టం చేశారు. పోరాట ఫలితంగా సంస్థకు సంబంధించిన 14వేల ఎకరాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న నేపథ్యంలో ఈ ఆస్తిని మ్యూటివేషన్ చేయకుండా కోర్టులో కేసులు వేసి కంపెనీ యాజమాన్యం అడ్డుకుంటుందని, యాజమాన్యం ఆటలను సాగనివ్వమని తీవ్రంగా తిప్పికొడతామని హెచ్చరించారు. కొంతమంది ఎంతోమంది ప్రలోభాలకు గురిచేసిన అగ్రిగోల్డ్ బాధితుల పక్షాన అసోసియేషన్ నిలబడి పనిచేస్తుందని స్పష్టం చేశారు. సీఐడీలో నిజాయితీ గల అధికారులు బాధితులకు న్యాయం చేయాలని చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని తెలిపారు. బాధితుల పక్షాన నిలబడిన అసోసియేషన్‌తో ప్రతిఒక్కరు సహకరించాలని కోరారు. కష్టపడ్డ ఏజెంటులను ఇప్పటికీ మోసం చేస్తున్న సంస్థ యాజమాన్యం అవ్వా వెంకట రామారావు, అవ్వా వెంకట శేషు నారాయణరావు ఇతర ప్రతినిధుల ఇల్లును ముట్టడించాలని పిలుపునిచ్చారు. బాధితుల ఆవేదనను ప్రభుత్వం అర్థం చేసుకుని సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కంపెనీ ఆస్తులను వేలం వేసే ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. బాధితుల్లో ఏ ఒక్కరు మరణించిన ఆ బాధ్యత ప్రభుత్వానిదేనని అన్నారు. అధికారంలో లేనప్పుడు పవన్ కళ్యాణ్ అగ్రిగోల్డ్ బాధితులతో సమావేశమై న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చిన ఎటువంటి స్పందన లేకపోవడం దురదృష్టకరమన్నారు. చంద్రబాబు రాష్ట్ర ప్రజల అభివృద్ధి కన్నా ప్రపంచంలోని కోటీశ్వరుల అభివృద్ధి కోసం పనిచేస్తున్నారని కార్పొరేట్ వర్గాలకు పరిపాలిస్తున్నారని రాబోయే రోజుల్లో బాధితులను కూడగట్టుకుని 10వేల మంది వంట వార్పు కార్యక్రమాన్ని చేపడతామని పిలుపునిచ్చారు. ఇప్పటికైన ప్రభుత్వం స్పందించి అగ్రిగోల్డ్ బాధితుల ఆవేదన అర్థం చేసుకుని సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వి తిరుపతిరావు మాట్లాడుతూ గత 11 సంవత్సరాలు పోరాటం చేస్తూ ఈ సమస్య పరిష్కారానికి ప్రత్యక్షంగా ఇద్దరితోను, పరోక్షంగా ఒకరితో సాధ్యమవుతుందని తెలిపారు. ఉద్యమాన్ని ఆస్తులను స్వాధీనం చేసుకునే స్థాయికి తీసుకువచ్చామని సీఐడీ అధికారులు బాధితుల పక్షాన పనిచేస్తున్నారని కితాబు ఇచ్చారు. బాధితులను ఇబ్బందిపెడుతున్న యాజమాన్యానికి ప్రభుత్వాలు కొమ్ముకాస్తున్నాయని పేర్కొన్నారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి సమస్యను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సంస్థ చేసిన అన్యాయంతో పిల్లల చదువులు, వివాహాలు చేసుకునే పరిస్థితి లేదని దీంతో తీవ్ర ఆందోళన చెంది ఆత్మహత్య శరణ్యం అన్నట్లుగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.

# తిరుమల సమాచారం

## ఉద్యోగులకు సంతృప్తికరంగా బ్రహ్మోత్సవ బహుమానం విడుదల

**తిరుమల,డిసెంబర్ 3ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగవైకుంఠం తిరుమలకొండపై ఈ ఏడాది సెప్టెంబర్-అక్టోబర్‌లో జరిగిన శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో విశేషసేవలందించిన ఉద్యోగులకు మంజూరుచేసే బ్రహ్మోత్సవ బహుమానం విడుదలకు ప్రభుత్వం అనుమతించింది. అక్టోబర్‌లో జరిగిన టిటిడి ధర్మకర్తలమండలి సమావేశంలోశాశ్వత ఉద్యోగులకు 15,400 రూపాయలు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు 7,535 రూపాయలు బ్రహ్మోత్సవ బహుమానంగా,స్థానిక సిబ్బందికి అదనంగా 10శాతం మంజూరుకు ఛైర్మన్ బిఆర్‌నాయుడు, ఇఒఅనిల్‌కుమార్‌సింఘాల్, అదనపు ఇఒ చిరుమామిళ్ల వెంకయ్యచౌదరి నిర్ణయించి గత బోర్డు సమావేశంలో ఆమోదించిన విషయం విదితమే. తదుపరి ప్రభుత్వం నుండి ఆర్థిక ఆమోదానికి చేసిన విజ్ఞప్తికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. దీంతో ఉద్యోగులు ఎదురుచూస్తున్న బ్రహ్మోత్సవ బహుమానం నూతన ఆంగ్ల సంవత్సరంలో శుభవార్తగా ,ప్రత్యేక కానుకగా 15,400 రూపాయలతోబాటు అదనంగా 1,540రూపాయలు శాశ్వత ఉద్యోగులకు, 7,535రూపాయలు బహుమానంతో బాటు అదనంగా 774రూపాయలు అందుకోనున్నారు. టిటిడిలో 6,200మంది వరకు వివిధ హోదాల్లో శాశ్వత ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరెగాక పలు ఏజెన్సీల ద్వారా ,కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానంలో 12వేలమంది వరకు సేవలందిస్తున్నారు. వీరందరికీ జనవరినెల జీతంతో బ్రహ్మోత్సవ బహుమానం కూడా అదనంగా విడుదలకానుంది. ఇప్పటికే ఉద్యోగులకు బ్రహ్మోత్సవాల కానుకగా ఒక కల్యాణం లడ్డూ, ఒక వడ బహుమానంగా టిటిడి అందజేసింది.

## 'దిత్వా' తుఫాన్‌తో తిరుమలలో కుంభవృష్టి



**తిరుమల,డిసెంబర్ 3ప్రభాతవార్తప్రతినిధి:** దిత్వా తుఫాన్ ప్రభావంతో బుధవారం ఉదయం నుండి చిరుజల్లులతో పలకరించిన వర్షం సాయంత్రం గంటపాటు కుండపోతవాన కురిసంది. ఉన్నఫళంగా ఒక్కసారిగా బలమైన వర్షంతో భక్తులు పరుగులు తీశారు. గత నాలుగురోజులుగా దిత్వా ప్రభావంతో జడివాన కురుస్తోంది. బుధవారం సాయంత్రం కుండపోత వానతో ఓ వైపు జోరువర్షం మరోవైపు విపరీతమైన చలితో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వరుసగా కురుస్తున్న వర్షాలకు వాతావరణం మారి చలితీవ్రత పెరిగింది. దీంతో చిన్నపిల్లలు, వృద్ధులు చలికి వణుకుతున్నారు. వర్షంతో భక్తులు ఆలయంలోపలకు శ్రీవారి దర్శనానంతరం ఆలయం వెలుపలకు వర్షంలో తడిసి లడ్డూవితరణ శాలకు చేరుకోవాల్సి వస్తోంది. భారీ వర్షాల కారణంగా తిరుమల ఘాట్‌రోడ్లలో కొండచరియలు విరిగిపడే ప్రమాదం వుందని, వాహనదారులు ,భక్తులు అప్రమత్తంగా ఉండాలని టిటిడి విజిలెన్స్ హెచ్చరిస్తున్నారు. కొండల్లోంచి జలపాతాలు జోరున పరవళ్ళుతొక్కుతూ ప్రవహిస్తున్నాయి.

## శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తులు



**తిరుమల,డిసెంబర్ 3ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగ ప్రత్యక్షదైవమ్ తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో అందరికీ శుభాలు కలగాలని న్యాయమూర్తులు తెలిపారు. బుధవారం ఉదయం నైవేద్యాల విరామ సమయంలో జస్టిస్ ఇవి వేణుగోపాల్, జస్టిస్ జి.ప్రవీణ్‌కుమార్‌లు కుటుంబంతో కలసి ఉదయం ఆలయంలోనికి చేరుకుని వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. టిటిడి ఆలయ అధికారులు దర్శనం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## అందరూ సంతోషంగా ఉండాలని వేడుకున్నాం : ప్రముఖులు



**తిరుమల,డిసెంబర్ 3ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో తెలుగు ప్రజలందరికీ శుభాలు కలగాలని, అందరూ సంతోషంగా ఉండాలని వేడుకున్నట్లు ప్రముఖులు తెలిపారు. బుధవారం ఉదయం ఏసిబి రాయలసీమ జోన్ జెడి ఇజి అశోక్‌కుమార్, భారత్ బయోటెక్ ఎండి డాక్టర్ కృష్ణ ఎల్లా, సుచిత్ర ఎల్లా, సినీనటుడు సుధాకర్‌కోమల, తమిళన నటుడు జయంరవి, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ వేర్వేరుగా విఐపి బ్రేక్ దర్శనాల ప్రారంభసమయంలో ఆలయం వద్దకు చేరుకున్నారు. వీరికి ఆలయ అధికారులు స్వాగతం పలికి శ్రీవారి దర్శనం చేయించారు. వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## రేపు డయల్ యువర్ 'టిటిడి ఇఒ'



**తిరుమల,డిసెంబర్ 3 ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలకు వచ్చిన భక్తులకు వెంకన్న దర్శనంలోగానీ, వసతి కల్పనలో ఎదురైన అనుభవాలు, ఇబ్బందులు, తమతమ సూచనలు,సలహాలు తెలిపేందుకు 5వతేదీ శుక్రవారం తిరుమలలో "డయల్ యువర్ ఇఒ"కార్యక్రమం జరగనుంది. దేశవిదేశాల్లోని భక్తులు తమతమ ఫిర్యాదులు, సూచనలను శుక్రవారం ఉదయం 9నుంచి 10గంటల వరకు 0877-2263261 నంబర్లకు ఫోన్‌ద్వారా నేరుగా టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్‌తో మాట్లాడే అవకాశం కలుగుతుంది.

# వైకుంఠదర్శనాలకు పారదర్శకంగా టోకెన్లు జారీ

**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఆలయంలో పవిత్రమైన మోక్షమార్గం 'వైకుంఠద్వార"దర్శన విధానంలో గతంకంటే భిన్నంగా ఈ ఏడాది టిటిడి బోర్డు అమలుచేసిన ఆన్‌లైన్ ఇడిప్ విధానంలో తొలిమూడురోజులకు పారదర్శకంగా టోకెన్లు జారీచేసింది. 24లక్షలమంది వరకు భక్తులు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్నాటక,మహారాష్ట్రలనుండి ఆన్‌లైన్‌లో టిటిడి వెబ్‌సైట్, ఈ మెయిల్, ఏపి ప్రభుత్వవాట్సాప్‌ద్వారా ఆధార్‌కార్డు,మొబైల్‌నంబర్‌తో రిజిష్టర్ చేసుకున్నారు. వారిలో 1.76లక్షలమందికి దేవదేవుని ఆశీస్సులందాయి. వారంతా ఇడిప్‌లో ఉచిత దర్శన టోకెన్లు మెసేజ్ అందుకున్నారు. అలాంటి వారిలో అత్యధికంగా 12,099మంది భక్తులు వెంకట్, శ్రీనివాస్, లక్ష్మి,పద్మావతి, పద్మ అనే పేర్లున్న వారు ఉండటం విశేషమని టిటిడి ఐటి వర్గాల సమాచారం.అయితే ఇ డిప్ టోకెన్లు అందుకున్నభక్తుల్లో తమిళనాడు, తెలంగాణ ప్రాంతవాసులే కొంతవరకు అదికంగా ఉన్నారనేది టిటిడి విడుదల చేసిన జాబితాలో తెలుస్తోంది. ఆ తరువాత ఆంధ్రప్రదేశ్,కర్నాటక ప్రాంత భక్తులు. ఈ ఏడాది పదిరోజుల వైకుంఠద్వార దర్శనాల్లో తొలిమూడురోజులు డిసెంబర్ 30,31,జనవరి 1కి గాను ఆన్‌లైన్‌లో ఇ డిప్‌ద్వారా టోకన్లు జారీ చేసేశారు.ఆ మూడురోజులు ప్రోటోకాల్ పరిధిలోని ప్రముఖులు స్వయంగా వస్తేనే వైకుంఠ దర్శనం కల్పిస్తారు. పూర్తిగా విఐపి బ్రేక్,అన్ని దర్శనాలు రద్దుచేసిన విషయం తెలిసిందే. అలాగే తిరుమల,తిరుపతి,రేణిగుంట,చంద్రగిరి ప్రాంత వాసులకు జనవరి 6,7,8తేదీల దర్శనాల టోకెన్లుకు ఈనెల 10న ఆన్‌లైన్‌లో విడుదల చేస్తున్నారు. రోజుకు 5వేలమందికి దర్శనభాగ్యం కలుగుతుంది. మొత్తం 182 గంటల్లో 164గంటలు సామాన్యభక్తులకు దర్శనం కల్పించేలా టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు,ఇఒ అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ఏర్పాట్లు చేయిస్తున్నారు. జనవరి 2నుండి 8వరకు ఎస్ఇడి రోజుకు 15వేల టిక్కెట్లు, శ్రీవాణి రోజుకు వెయ్యిటిక్కెట్లు ఆన్‌లైన్‌లో జారీచేస్తారు. భక్తులు టిటిడి సూచనలు పాటించి ప్రశాంతంగా దర్శనం చేసుకోవాలని ఇప్పటికే ఛైర్మన్ విజ్ఞప్తి చేశారు. జనవరి 2వతేదీ నుండి 8వరకు పూర్తిగా ఎలాంటి టోకెన్లు, టిక్కెట్లు లేకున్నా సాధారణ సర్వదర్శనంలో వైకుంఠమ్ 2క్యూకాంప్లెక్స్ నుండి సామాన్యభక్తులను అనుమతించనున్నారు.

# దివ్యాంగులకు జ్ఞాపికలు అందించిన డిసిఎం పవన్ కల్యాణ్



**విజయవాడ, ప్రభాతవార్త, డిసెంబర్ 03:** విజయవాడ అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మంగళగిరిలోని తన క్యాంపు కార్యాలయంలో దివ్యాంగులు గోగన ఆదిశేషు, శెట్టివారి రఘులతో ముచ్చటించారు. మార్కాపురానికి చెందిన రఘు, బాపట్లకు చెందిన ఆదిశేషుల జీవనం, కుటుంబ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఆత్మస్థైర్యంతో ముందుకు వెళ్తున్న దివ్యాంగుల జీవితాలు ఎందరికో స్ఫూర్తిగా ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా వారిద్దరికీ జ్ఞాపికలు అందించారు. వారిద్దరూ మాట్లాడుతూ "కూటమి ప్రభుత్వం పింఛను మొత్తాన్ని పెంచడం మూలంగా తమ జీవనానికి ఒక వెసులుబాటు దొరికింది" అని చెబుతూ ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు కృతజ్ఞతలు తెలియచేశారు.

# అన్ని జిల్లాల్లో స్పోర్ట్స్ అకాడమీలను పునఃప్రారంభిస్తాం : శాప్ ఛైర్మన్ రవినాయుడు

**విజయవాడ,డిసెంబరు3,ప్రభాతవార్తప్రతినిధి:**వచ్చే ఏడాది జూన్ నాటికి అన్ని జిల్లాల్లో స్పోర్ట్స్ అకాడమీలను పునఃప్రారంభిస్తామని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఛైర్మన్ రవినాయుడు తెలిపారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ. అల్లూరి సీతారామరాజు స్టేడియం, ఇండోర్ స్టేడియం పూర్తిగా పరిశీలించామని, వాటిని పూర్తి స్థాయిలో క్రీడాకారులకు ఉపయోగ పడేలా సిద్ధం చేస్తామని తెలిపారు. అల్లూరి సీతారామరాజు స్టేడియంలో మూడు లేయర్ల సింథటిక్ ట్రాక్ నిర్మిస్తామని చెప్పారు. ఇటీవల నిర్వహించిన డిఎస్సిలో 81 మందికి స్పోర్ట్స్ కోటాలో పిఇటిలు, పీడీలుగా ఉద్యోగాలు వచ్చినట్లు తెలిపారు. నకిలీ సర్టిఫికెట్లకు చెక్ పెట్టే విధంగా ఆధార్ అనుసంధానంతో క్రీడాయాప్ తీసుకొస్తామని తెలిపారు. నేషనల్, జోనల్, యూనివర్సిటీ స్థాయిలో పతకాలు సాధించిన క్రీడాకారులు ఆ యాప్‌లో నమోదు చేసుకుంటే వారికి ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. అమరావతి, తిరుపతి, రాజమండ్రి, విశాఖపట్నం, గుంటూరు, కర్నూలు, అనంతపురం ప్రాంతాలను స్పోర్ట్స్ హబ్‌లుగా తయారు చేయనున్నామని, ప్రతి జిల్లాలో స్థానికంగా ఎక్కువ ప్రాచుర్యం పొందిన నాలుగు క్రీడలను ఎంపిక చేసి వాటి అభివృద్ధికి పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. జనవరి నాటికి రూ. ఐదు కోట్ల రూపాయలతో అన్ని జిల్లాలకు క్రీడా పరికరాలు అందిస్తామని, త్వరలోనే కోచ్‌ల నియామకాలు చేపడతామని తెలిపారు.

# కల్తీనెయ్యి కేసులో కరీముల్లకోసం సిట్ గాలింపు

**- టిటిడి మాజీ అధికారులను విచారణ దిశగా చర్యలు**




**తిరుమల,డిసెంబర్ 3 ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల లడ్డూల తయారీకి కల్తీనెయ్యి సరఫరా చేసిన కేసులో సిబిఐ సిట్ అధికారులు చేస్తున్న లోతైన దర్యాప్తులో భాగంగా త్వరలో మూడోఛార్జిషీట్ దాఖలుకు వేగంగా చర్యలు తీసుకుంటున్నారు. ఇందుకోసం రెండుమూడురోజుల్లో టిటిడి మాజీ అధికారులను కొందరిని, ఇదే కేసులో కీలకమైన పరారీలో ఉన్న వినయ్‌చావ్డా ప్రతినిధి కరీముల్లకోసం సిట్ అధికారులు గాలిస్తున్నారు. ఆయన ఆచూకీ కోసం ఆరా తీస్తున్నారు. గత వారంలో నెల్లూరు ఏసిబి కోర్టులో సిట్ అధికారులు దాఖలుచేసిన మెమోతో ఏడుమంది టిటిడి అధికారులపై కల్తీనెయ్యికేసు నమోదైన విషయం విదితమే. కల్తీనెయ్యి బాగోతంలో టిటిడి మార్కెటింగ్ విభాగం మాజీ జిఎం సుబ్రమణ్యంను సిట్ రిమాండ్‌కు పంపింది. ఆయన రిమాండ్ రిపోర్టుతో టిటిడి మార్కెటింగ్ విభాగం జూనియర్ అసిస్టెంట్ ఈశ్వర్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ వెంకట అనిల్‌కుమార్, మాజీ డిప్యూటీ ఇఒ వెంకట్‌నటేశ్‌బాబు, మాజీ జిఎంలు, ఎస్ఇ, ఇఇలు ,గోశాల మాజీడైరెక్టర్ డాక్టర్ హరినాధరెడ్డి(ఇప్పటికే సస్పెన్షన్‌లో ఉన్న)లపై 274,275,316(5), 318(4),61(2),299 రెడ్‌విత్ 3(5)బిఎన్ఎస్ 51,59 సెక్షన్‌ల క్రింద కేసు నమోదు చేశారు. ఈవారంలో వీరిలో కొందరిని సిట్ విచారణకు పిలిచే సమాచారం ఉందనేది తెలుస్తోంది. అరెస్ట్‌లకు కూడా రంగం సిద్దంచేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఈ కేసును డిసెంబర్ 15కి తుదిదశకు తీసుకురావాలని భావిస్తున్న సిట్ మరింత వేగం పెంచింది. 2019-2024 సంవత్సరాల్లో టిటిడి మార్కెటింగ్ విభాగం, కొనుగోళ్ళ విభాగం,డెయిరీ విభాగంకు సంబంధించి కల్తీనెయ్యిలో కీలకమనేది కూడా సిట్ సమాచారం. అర్హత లేని డెయిరీలకు కాంట్రాక్టులు కట్టబెట్టడం వెనుక పెద్దల హస్తం ఉందనేది కూడా సిట్ గుర్తించిన అంశాలు.

# సిఆర్డిఏ అధికారుల ఆధ్వర్యంలో అనధికారిక లేఅవుట్ల ధ్వంసం



**గుంటూరు, డిసెంబర్ 3, ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీ సిఆర్డిఏ పరిధిలోని బుధవారం అక్రమ లే అవుట్లను అధికారులు ధ్వంసం చేయించారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండలం పాతపాడులోని సర్వే నెం.114 లోని 5.50 ఎకరాల భూమిలోని అనధికార లే అవుట్, సర్వే నెం.145 లోని 1 ఎకరం 20 సెంట్ల భూమిలోని అనధికార లే అవుట్‌ను సిఆర్డిఏ డెవలప్మెంట్ ప్రమోషన్ విభాగం అధికారులు ధ్వంసం చేయించారు. సిఆర్డిఏ పరిధిలో అనధికార లే అవుట్లను ఎట్టి పరిస్థితులలో ఉపేక్షించబోమని అధికారులు వెల్లడిఆంచారు.

# రైతుల సమస్యల పరిష్కారానికి సివిల్ సప్లై భవన్‌లో కంట్రోల్ రూమ్: మంత్రి నాదెండ్ల



**విజయవాడ,డిసెంబరు3,ప్రభాతవార్తప్రతినిధి:**ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం విక్రయ పద్ధతిలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం సివిల్ సప్లై భవన్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ధాన్యం సేకరణ, అందుతున్న ఫిర్యాదులపై అధికారులతో సివిల్ సప్లై భవన్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ అంశాలను ఆయన మీడియాకు వివరించారు.ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 1,77,934 మంది రైతుల నుంచి 11,93,743 మెట్రిక్ టన్నుల ధాన్యం తమ ప్రభుత్వం కొనుగోలు చేసిందన్నారు. ఇందుకు సంబంధించి ఆయా రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.2,830 కోట్లు జమ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించిన ఎటువంటి సమస్యలున్నా 1967 టోల్‌ఫ్రీ నెంబరును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ నెంబరు సోమవారం నుంచి శనివారం వరకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు అందుబాటులో ఉంటుందన్నారు. రైతులు ధాన్యం రిజిస్ట్రేషన్ సమస్యలు, టోకెన్ రావడంలో ఆలస్యం, మిల్లుల్లో తూకం సమస్యలు, ఎఫ్‌టిఒ పెండింగ్, రవాణా లేదా గోనె సంచుల కొరత వంటి వాటితో పాటు ఏదైనా కేంద్రాల వద్ద ధాన్యం కొనుగోళ్లు ఆగిపోవడం వంటి సమస్యలన్నింటినీ టోల్ ఫ్రీ నెంబరుకు తెలియజేయవచ్చన్నారు. ఫోన్ చేసే ముందు రైతులు వారి ఆధార్, రిజిస్ట్రేషన్, టోకెన్ నెంబర్లు, గ్రామం పేరు, రైతు సేవా కేంద్రం వివరాలు దగ్గర ఉంచుకోవాలని మంత్రి సూచించారు. కంట్రోల్ రూమ్‌లో ఫిర్యాదును నమోదు చేసి సంబంధిత అధికారులకు పంపుతామన్నారు. సమస్య పూర్తిగా పరిష్కారమయ్యే వరకు అధికారులు చొరవ తీసుకుంటారన్నారు.

# 23న సచివాలయ ఉద్యోగుల సంఘం ఎన్నికలు

**విజయవాడ,డిసెంబరు 3,ప్రభాతవార్తప్రతినిధి:**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల సంఘం ఎన్నికలు ఈ నెల 23వ తేదీన జరగనున్నాయి. ఏపీ సెక్రటేరియట్ ఉద్యోగుల సంఘం ఎన్నికల నిర్వహణపై అప్సా అధ్యక్షులు కాకర్ల వెంకటరామిరెడ్డి అధ్యక్షతన కార్యవర్గం బుధవారంసమావేశమైంది. ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు.ఈ నెల 29వ తేదీతో ప్రస్తుత అప్సా అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి ప్యానెల్ పదవీ కాలం ముగియనుంది.

ఈ క్రమంలో ఎన్నికలను ఈ నెల(డిసెంబరు) 23వ తేదీన నిర్వహించాలని అప్సా కార్యవర్గం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఎన్నికల షెడ్యూల్‌ను అప్సా కార్యవర్గం ప్రకటించింది. తొమ్మిది కేటగిరీలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో సచివాలయం, అసెంబ్లీతో కలిపి 1200 మంది ఓటర్లు ఓటుహక్కు వినియోగించుకోనున్నారు.

# మంగళగిరి గోల్డ్ క్లస్టర్‌కు రూ.75 లక్షలు విడుదల

**విజయవాడ, డిసెంబరు 3 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం మంగళగిరిలో బంగారు ఆభరణాల తయారీ క్లస్టర్ దిశగా మరో కీలక ముందడుగు పడింది. గుంటూరు జిల్లా మంగళగిరిలో బంగారు ఆభరణాలు తయారు చేసే పరిశ్రమలకు ఒక ఉమ్మడి సౌకర్యాల కేంద్రం (సీఎఫ్‌సీ) ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ప్రాజెక్టు కోసం రాష్ట్ర ప్రభుత్వం తన వాటా కింద రూ.75 లక్షలను విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సీఎఫ్‌సీ ఏర్పాటుకు మొత్తం రూ.9.99 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. ఈ ప్రాజెక్టులో కేంద్ర ప్రభుత్వం 80 శాతం వాటాగా రూ.7.99 కోట్లు అందిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం 15 శాతం వాటాగా రూ.1.49 కోట్లు భరిస్తుంది. అలాగే, ఈ సీఎఫ్‌సీని పర్యవేక్షించడానికి ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రాజెక్టు వాహనం (ఎస్పీవీ) రూ.50 లక్షలు అందిస్తుంది. ఈ సీఎఫ్‌సీ ద్వారా బంగారు ఆభరణాల తయారీదారులు మెరుగైన సౌకర్యాలు పొందనున్నారు. ఇది పరిశ్రమ అభివృద్ధికి దోహదపడుతుంది. మొత్తం మీద మంత్రి లోకేష్ నియోజకవర్గంలో కీలకమైన ఆభరణాల తయారీ క్లస్టర్ సాధించారు. మంత్రి లోకేష్ ఈ క్లస్టర్ ఏర్పాటుపై ఎప్పటికప్పుడు సమీక్షలు చేశారు. పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలిలో కొబ్బరి పరిశ్రమను ప్రోత్సహించడానికి ఈ కామన్ ఫెసిలిటీ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నారు. దీని ద్వారా కొబ్బరి ఉత్పత్తుల ప్రాసెసింగ్, ప్యాకేజింగ్ వంటి సౌకర్యాలు కల్పిస్తారు. ఈ ప్రాజెక్టుకు మొత్తం రూ.29.97 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేయబడింది. ఈ నిధులలో కేంద్ర ప్రభుత్వం రూ.20.98 కోట్లు అందిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా రూ.4.50 కోట్లు కేటాయించింది.

# టెట్ అభ్యర్థులకు మూడురోజుల్లో హాల్ టిక్కెట్లు

**విజయవాడ,డిసెంబరు3,ప్రభాతవార్తప్రతినిధి:**ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు రెండు, మూడు రోజుల్లో హాల్ టిక్కెట్లు అందుబాటులోకి వస్తాయని కన్వీనర్ ఎమ్‌వి కృష్ణారెడ్డి వెల్లడించారు. వెబ్‌సైట్ నుంచి అభ్యర్థులు డౌన్‌లోడ్ చేసుకోవాలని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10 నుంచి ప్రతిరోజూ టెట్ పరీక్ష ఉంటుందన్నారు. రోజుకు రెండు పూటలా పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. తొలి సెషన్ ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రెండో సెషన్ మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తామని వెల్లడించారు. అక్టోబరు 24 నుంచి నవంబరు 23 వరకు దరఖాస్తులను స్వీకరించగా, 2,41,509 మంది అభ్యర్థులు 2,71,692 దరఖాస్తులు చేసుకున్నారని తెలిపారు.

# అమరావతిలో గ్రీనరీకి ప్రాధాన్యత: మంత్రి పి,నారాయణ

**విజయవాడ, డిసెంబరు 3,ప్రభాతవార్తప్రతినిధి:**రాజధాని అమరావతిలో పనులు వేగంగా జరుగుతున్నాయని మంత్రి నారాయణ స్పష్టం చేశారు.అమరావతిలో 30 శాతం గ్రీనరీకి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నాం. 133.3 కి.మీ. పరిధిలో ప్లాంటేషన్ ప్రణాళిక రూపొందించాం. వివిధ ప్రాంతాల్లో పార్కుల అభివృద్ధి చేపడుతున్నాం అన్నారు. శాఖమూరు, కృష్ణాయపాలెం, నీరుకొండల్లో గ్రీన్ అండ్ బ్లూ కాన్సెప్ట్‌కు ప్రణాళిక రూపకల్పన చేశాంఅన్నారు.వచ్చే జనవరి నెలాఖరుకల్లా టెండర్ల ప్రక్రియ పూర్తి చేస్తాం అన్నారు. రైతు సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కారం జరుగుతోంది అన్నారు. 29 గ్రామాల పరిధిలో భూ సమీకరణకు రైతులకు ఇవాళ్టికీ విజ్ఞప్తి చేస్తున్నాం. రైతులు ముందుకు రాకుంటే భూసేకరణకు వెళ్తాం. సీఆర్డీఏ కార్యాలయంలోనే రైతుల కోసం ప్రత్యేక సెల్ ఏర్పాటు చేస్తాం.అమరావతిలో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి నారాయణ మాట్లాడారు. ఇందుకు అనుగుణంగా వివిధ ప్రాంతాల్లో పార్కుల అభివృద్ధి చేపడుతున్నామని వివరించారు. శాఖమూరు, కృష్ణాయపాలెం, నీరుకొండల్లో గ్రీన్ అండ్ బ్లూ కాన్సెప్ట్ కు అనుగుణంగా ప్రత్యేక ప్రణాళిక రూపొందించామని తెలిపారు. వచ్చే జనవరి నెలాఖరుకల్లా టెండర్ల ప్రక్రియ పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. సీజన్ లో వచ్చే ఫ్లవర్స్ ప్రకారం బ్యూటిఫికేషన్ ఉంటుందన్నారు. 22 రోడ్లలో రెండువైపులా బఫర్ జోన్‌లో గ్రీనరీ అభివృద్ధి జరుగుతోంది. వివిధ ప్రాంతాల్లో పా ర్కుల అభివృద్ధి చేపడుతున్నామని వివరించారు. శాఖ మూరు, కృష్ణాయపాలెం, నీరుకొండల్లో గ్రీన్ అండ్ బ్లూ కాన్సెప్ట్‌కు అనుగుణంగా ప్రత్యేక ప్రణాళిక రూపొందించామని తెలిపారు.

వార్త

నీ అంతరాత్మ ప్రబోధం నీవు పాటిస్తే
నీకు స్వయం క్రమశిక్షణ ఉన్నట్టు లెక్క.

-రోజర్

# చలి కాలపు జంఝూటం


దక్షిణాది రాష్ట్రాలను 'చలి పులి' పిండేస్తోంది. జనం ఘూము పొద్దెక్కినా నిద్రలేవలేకపోతున్నారు. చలికి భయపడి మంచాలు దిగిరావడం లేదు. శీతాకాలంలో చలి ఎక్కువగానే ఉంటుందని ముందుగానే భారత వాతావరణ విభాగం హెచ్చరించింది. తెలంగాణతోపాటు కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశాలోని అధిక ప్రాంతాలకే ఈ పరిస్థితి ఉంది. తెలంగాణ, ఒడిశా రాష్ట్రాలకు పక్కనే ఉన్న పార్వతీపురం, మన్యం, కర్నూలు, నంద్యాల, ప్రకాశం, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు చలి తీవ్ర ప్రభావాన్ని చూపెడుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో గత యేడాది ఇదే సమయంలో చలి ప్రభావాన్ని గమనిస్తే ఈసారి తక్కువేనని చెప్పాలి. చలి ఎక్కువగా ఉన్నా, తక్కువగా ఉన్నా ఆయా రాష్ట్రాలలో అధిక చలి వలన సీజనల్ జ్వరాలకు జనంలో ఆందోళన పెరిగిపోయింది. ఆస్పత్రుల్లో రద్దీ పెరిగింది. ప్రైవేట్ ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. చలితోపాటు సాంక్రమిక వ్యాధులు ప్రజల్ని ఊపిరి పీల్చుకోనివ్వడంలేదు. ఇంత చలిలోనూ కళ్లు మంటలు తప్పడం లేదు. ఈ నేపథ్యంలోనే ప్రతి వ్యక్తి నీరు ఎక్కువగా తాగాలని జాగ్రత్తలు చెప్తున్నారు డాక్టర్లు. చలికాలపు శీతల వాతావరణాన్ని గతంలో మాదిరిగా తట్టుకోలేకపోతున్నారు. ఉష్ణోగ్రతలు భారీగా తగ్గిపోవడమే అందుకు కారణం. ప్రత్యేకించి చల్లటి వాతావరణం, పొగమంచుతోపాటు తేమ కూడా కాస్త ఇబ్బందిపెడుతోంది. అధిక చల్లదనాన్ని భరించలేని శరీరానికి రోగ నిరోధక శక్తి కూడా తగ్గిపోతుంది. ఈ సీజన్‌లో వ్యాప్తి చెందే సాధారణ వ్యాధులతోపాటు కొన్ని వైరస్‌లకు సంబంధించిన కొత్త వేరియంట్స్‌తో కలిపిన జ్వరాలు రోగుల మీద దాడిచేస్తున్నాయి. ఈ మధ్య కాలం లో జలుబు, గొంతునొప్పి విపరీతంగా జనాన్ని బాధిస్తున్నాయి. స్త్రీ, బాల, వృద్ధులు వీటికి గురై ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు. ఈ సీజన్‌లో శ్వాసకోస సంబంధిత వ్యాధులు బాగా ఉధృతంగా ఉన్నాయి. ఈ కాలంలో గాలిలో తేమ ఎక్కువగా ఉండడంతోనే జలుబు, గొంతునొప్పులు వగైరా లక్షణాలు కనిపిస్తున్నాయి. ఓ పట్టాన శీతాకాలపు వ్యాధులు అంత గమ్మున తగ్గవు. సతాయిస్తూనే ఉంటాయి. వాటి లక్షణాలు విచిత్రంగా ఉంటాయి. పుండ్లు కూడా మానవు. ఒక్కొక్కప్పుడు శీతగాలులకు కళ్లు మసకబారుతాయి. ఫ్లూ, న్యూమోనియా, బ్రాంకైటిస్ వంటి సీజనల్‌గా వచ్చే వ్యాధులు శ్వాసకోస అలెర్జీలను వెంట తెస్తాయి. తలనొప్పి, తుమ్ములు, కండరాల నొప్పిలతో జ్వరాలు సోకుతున్నాయి. వీటితోపాటు న్యూమోనియా సోకితే కోలుకోవడానికి కొదినద రోజులు పడుతుంది. శ్వాసకోశ వ్యాధులన్నీ ఇబ్బంది పెట్టేవే. శ్వాసకోశంలో ఇన్‌ఫెక్షన్ పెరిగితే కండరాల నొప్పులు, ఉబ్బసం లక్షణాలతో నీరసపడతాయి. కొందరి లో ఆస్మా తీవ్రత పెరిగి ముక్కుదిబ్బడేస్తుంది. గొంతులో శ్లేష్మం ఊరుతుంది. తరచు ఇబ్బంది పెడుతుంది. ఉష్ణోగ్రతలు బాగా తగ్గడం వలన రక్తనాళాల్లో ఒత్తిడి పెరిగి ఒక్కోసారి హార్ట్‌ఎటాక్‌కి గురవుతారు. వయసుతో నిమిత్తం లేకుండా చలి నుంచి రక్షణ పొందేందుకు అప్రమత్తమవ్వాలి. చర్మంలో తేమ తగ్గిన సందర్భాలలో చర్మం పొడిగా మారి ఎగ్జిమా, డయాబిటిస్ వ్యాధులకు దారితీస్తాయి. చర్మానికి పోషకాలు అందని పరిస్థితులు ఏర్పడతాయి. చర్మవ్యాధులు సోకితే వంటిపై దద్దుర్లు ఏర్పడడం, మంటలెక్కిపోతుంటాయి. ఆంధ్రప్రదేశ్‌లో నిర్దేశితకాలాల తో నిమిత్తం లేకుండా కురుస్తున్న వర్షాలు మరో విధంగా రోగాలను ఆహ్వానిస్తున్నాయి. గాలిలో తమ కారణంగా ఒళ్లు మంటలు బాధిస్తాయి. తగినంత నీటిని తీసుకోక పోతే డయేరియా, కలరా వంటి వ్యాధులు సోకుతాయి. శరీరానికి సరిపడనంత నీరు డీహైడ్రేషన్ ఏర్పడుతుంది. ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే పరిస్థితుల్నుంచి మనల్ని మనమే కాపాడుకోవాలి. సరైన పోషకాహారం తీసుకోవాలి. ఇదే సమయంలో కాలుష్యవ్యాప్తిని కూడా గుర్తించాలి. పొగమంచుతో బయటకువిడుదలయ్యే కాలుష్యగాలి, మంచు కలిపి కలరా వంటి వ్యాధులు వ్యాప్తికి కారణమౌతాయి. ఇదే సందర్భంలో శీతాకాలంలో వచ్చే దోమల బెడదను ఎదుర్కోవాల్సిన ఉంటుంది. మలబద్ధకం,పేగు సంబంధిత సమస్యలు, రక్తస్రావం సమస్యలుంటాయి. వర్షాల వల్ల గుంటల్లోకి నీరు చేరి కాలుష్య కారకాలవుతున్నాయి. ఇక్కడ నిల్వ ఉండే పరిస్థితుల్లో దోమలు విజృంభిస్తాయి. దోమల బాధను తట్టుకోలేక జనం దోమ తెరలను, కాయిల్స్‌లను ఆశ్రయిస్తున్నారు. మలేరియా, ఫైలేరియా వ్యాధు లు సోకకుండా డాక్టర్ల సలహాలు తీసుకోవాలి. కొత్త తరహా వైరస్ వ్యాధి 'స్క్రబ్ టైఫస్' ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో ప్రవేశించి ముగ్గురిని కాటేసింది. విజయనగరం, చిత్తూరు పల్నాడు జిల్లాల్లో ఈ వ్యాధి వ్యాప్తి ఉంది.'చిగ్గర్‌మైట్' కీటకాలు కుట్టడం వల్ల వచ్చేవ్యాధి. దీనిపై అవగాహన పెంచాల్సినఅవసరం ఉంది. ఈవ్యాధి గురించి రాష్ట్రప్రజలు కొత్తగా వింటున్నారు. అంటువ్యాధి కాదని డాక్టర్లు చెప్తున్నా ఈ వ్యాధి లక్షణాలు,జాగ్రత్తలు గురించి జనానికివిస్తృత పరిచయం చేయాల్సిన అవసరముంది. అధిక జ్వరం, చలి,తీవ్రమైన తలనొప్పి, కండరాల నొప్పులతోపాటు వంటిపై గోకుడుపుండ్లు వంటివి ఏర్పడతాయి. శీతాకాలపు పుండు బ్రహ్మరాక్షసిగామారకుండా, చలిప్రాంతాలలో అవగాహన శిబిరాలు ఏర్పాటు చేయడం అత్యంత అవశ్యకం. ఈవ్యాధి అంటువ్యాధి కాదని శాస్త్ర జ్ఞులే వివరించాల్సి ఉంది. మరింత వ్యాపించకముందే వైద్యసిబ్బందికి అవగాహన కల్పించడం ప్రభుత్వ బాధ్యత.

దిగజారడం ప్రారంభించనే కూడదు. ఒక్కసారి దిగజారితే ఇక దానికంతే ఉండదు.



హెచ్. లాంగ్‌ఫెలో

మాటకు మాట ప్రతీకారం కాదు, మౌనమే దానికి సమాధానం.



ప్లినీ

# విద్యార్థుల జీవితాలతో ఆటలాడుకోవద్దు!

**మొత్తం సంక్షోభానికి మూలం ప్రభుత్వ నిర్లక్ష్యం, బాధ్యత లేకపోవడం. విద్యార్థులు ఇంతటి ఆర్థిక ఒత్తిడిలో చదువుతుంటే వారి విద్యా నాణ్యత ఎలా మెరుగుపడుతుంది? ఒక విద్యార్థి ఆలోచన మొత్తం రేపటి ఫీజుగురించి ఉంటే, అతని దృష్టి చదువుపై ఎలా ఉంటుంది? విద్యార్థులు అనిశ్చితిలో ఉన్న సమాజం అభివృద్ధిచెందదు. మన దేశం బలంగా ఎదగాలంటే మన యువతకు బలోపేతమైన విద్య, ఆర్థిక భద్రత అవసరం. కానీ ప్రస్తుతం జరుగుతున్నది దీని పూర్తిగా విరుద్ధం. ప్రభుత్వం ఏవైనా పథకాలు ప్రారంభించవచ్చు, ఏవైనా నూతన కార్యక్రమాలు ప్రకటించవచ్చు. కాని విద్యపై ఉండే పథకాల విషయంలో రాజకీయాలు చేయకూడదు. విద్యకు సంబంధించిన పథకాలు ప్రభుత్వాలు మారినా, పార్టీలు మారినా, నిరంతరంగా కొనసాగాలి. ఒక విద్యార్థి చదువును మధ్యలో ఆపడం అంటే సమాజానికే నష్టం.**



మన్నారం నాగరాజు

రాజకీయ నాయకులు పదవులు, ప్రాభవం కోసం కాదని, సమాజ సేవ కోసం రావాలనే భావన ప్రతి ప్రజాస్వామ్య దేశానికీ పునాది. ఆ ధర్మాన్ని కార్యరూపంలో చూపించిన నాయకుల్లో ఒకరైన డాక్టర్ రాజశేఖర్ రెడ్డి తీసుకువచ్చిన 'ఫీజు రీయింబర్స్మెంట్' పథకం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఒక అమోఘమైన చరిత్రను సృష్టించింది. పేద, మధ్యతరగతి యువత చదువుకి డబ్బులే అడ్డుగా మారకూడదనే సంకల్పమే ఈ పథకానికి కారణం. ఆ సమయంలో వేలాది కుటుంబాలు పిల్లల ఉన్నత విద్యకోసం అప్పులు తీసుకుని, ఆర్థిక ఒత్తిడితో ఉన్నారు. ప్రైవేట్ కళాశాలల్లో చదవడం సామాన్యుడికి అంత సులభంకాదు. అటువంటి సమయంలో ఆనాటి ప్రభుత్వ నిర్ణయం ఒక సామాజిక విప్లవంలా మారింది. ఇంజినీరింగ్, మెడిసిన్, డిగ్రీ, పీజీలు ఏ కోర్సు అయినా ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులు ధైర్యంగా చేరగలిగారు. చదువు మాత్రమే జీవితాన్ని మార్చగలదన్న నమ్మకాన్ని ఈ పథకం బలపరచింది.వేలాది మంది మొదటి తరం గ్రాడ్యుయేట్లు, ఇంజినీర్లు, వైద్యులు ఈ పథకం వల్ల సమాజంలో వెలుగు చూసారు. ఒక కుటుంబాన్ని మాత్రమే కాదు, ఆ కుటుంబం వెనుక ఉన్న తరాల భవిష్యత్తును ఈ పథకం మారుస్తుందని అనుభవం చూపింది. ఇక విద్య అనేది ప్రతి సమాజానికీ భవిష్యత్తును నిర్మించే మహత్తర సాధనం. ఒక పేద కుటుంబంపిల్లవాడు చదువుకుంటే కేవలం అతని వ్యక్తిగత జీవితం మాత్రమే మారదు, అతడి కుటుంబం, అతడి వంశం, అతడిగ్రామం, చివరకు సమాజమే ఒక మెట్టు ముందుకు చేరుతుంది. అందుకే విద్యపై ప్రభుత్వం పెట్టే పెట్టుబడి అనేది సాధారణ ఖర్చుగా చూడకూడదు. అది భవిష్యత్తుపై చేసేఅత్యంత విలువైన పెట్టుబడి. కానీ ఇటీవలి సంవత్సరాల్లో పరిస్థితి పూర్తిగా మారిపోయింది.ప్రభుత్వం రీయింబర్స్మెంట్‌ను సమయానికి విడుదల చేయకపోవడం, బడ్జెట్ కేటాయింపులను తగ్గించడం, కొత్త నియమాలు పెట్టడం, కాలేజీలను ఆర్థిక సంక్షోభంలోకి నెట్టడం. విద్యార్థుల భవిష్యత్తును నేరుగా ప్రభావితం చేస్తున్నాయి. ఇప్పటి పరిస్థితి ఏమిటంటే, పేద కుటుంబాల్లో చదువుతున్న చాలామంది విద్యార్థులు రీయింబర్స్మెంట్ ఆలస్యం వల్ల ప్రమాదకరమైన స్థితిలో నిలిచిపోయారు. కాలేజీలు ఫీజులు రాలేని కారణంగా వారిపై ఒత్తిడి పెడుతున్నాయి. 'రీయింబర్స్మెంట్ రాకపోతే మేము క్లాసుల్లోకి అనుమతించలేం' 'సెమిస్టర్ పరీక్షలకు మీరుఫీజు చెల్లించాలి' రీయింబర్స్మెంట్ వచ్చినప్పుడు మేము రీఫండ్ చేస్తాం' వంటి మాటలు విని విద్యార్థులు, వారి తల్లిదండ్రులురోజూ భయాందోళనల్లో ఉన్నారు. దీనివల్ల పేద పిల్లలు,ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలకు చెందిన అభ్యుదయ ఆశతో చదువుతున్న యువకులు, తమ చదువును కొనసాగించాలా? లేక ఇంటికి వెళ్లి ఏదైనా కార్మిక పని చేసి కుటుంబాన్ని ఆదుకోవాలా? అనే రెండు మార్గాల మధ్య చిక్కుకుపోతున్నారు.వాస్తవానికి ప్రైవేట్ కాలేజీల పరిస్థితి కూడా అంతే దారుణంగా ఉంది. రీయింబర్స్మెంట్ బకాయిలు 6 నెలలు, 1 సంవత్సరం, కొన్నిసార్లు 2 సంవత్సరాల వరకూ పెండింగ్‌లో ఉండటం వలన కాలేజీలు తమ సిబ్బందికి జీతాలు చెల్లించలేని స్థితికి చేరాయి.ల్యాబ్ పరికరాల నిర్వహణ, హాస్టల్ సదుపాయాలు, విద్యార్థుల సేవా కార్యక్రమాలు అన్నీ బలహీనపడ్డాయి. ఉపాధ్యాయులు స్థిరమైన జీతం రాకపోవడంతో నిరుత్సాహానికి గురవుతున్నారు. కొన్ని కాలేజీలు తాళాలు వేసిన ఉదాహరణలు కూడా ఉన్నాయి. కాలేజీలు మూసివేయబడడం అంటేవాటిలో చదువుతున్న వేలాది విద్యార్థులు అకస్మాత్తుగా వీధుల్లోకి రావడం. ఇవన్నీ చూస్తే రీయింబర్స్మెంట్ వ్యవస్థను నిలబెట్టడంలో ప్రభుత్వం ఎంత వైఫల్యం చెందిందో స్పష్టంగా తెలుస్తోంది. ఇంకా



అత్యంత బాధాకరమైన విషయం ఏమిటంటే ఫీజు రీయింబర్స్మెంట్ పంపకాల్లో తీవ్ర గందరగోళం, నిబంధనలలో మార్పులు, సకాలంలో క్లియరెన్స్ లేకపోవడం వంటి వాటి వలన విద్యార్థులలో పెద్ద సంఖ్యలో డ్రాప్ అవడం ప్రారంభమైంది.ఒక విద్యార్థి మధ్యలో చదువు మానేస్తే అది వ్యక్తిగత పరాజయం కాదు, అది ఒక సామాజిక నష్టం. అతని కుటుంబం చేసిన త్యాగాలన్నీ వృధా అవుతాయి.అతని భవిష్యత్తు అనిశ్చితిలో పడుతుంది. ఉద్యోగాల్లో పోటీ భారీగా ఉన్న ఈ కాలంలో, ఒక డిగ్రీ ఆపేయడం అంటే అతని జీవితం పూర్తిగా వెనుకబడిపోవడం. కాని దురదృష్టకరం ఏమిటంటే, ఈ డ్రాప్ అవుతున్న యువతపై ఎవరు దృష్టి పెట్టడం లేదు.కనీసం ప్రభుత్వంతో పాటు,రాజకీయ నాయకులు కూడా స్పందించాల్సిన అవసరం ఉంది.ఇక విద్యార్థులు మానసిక ఒత్తిడితో బాధపడుతున్నారు."రీయింబర్స్మెంట్ డబ్బులు ఎప్పుడు వస్తాయి?" అనే ప్రశ్నకు ఎవరు సమాధానం చెప్పడం లేదు. అధికారులు ఒకరికి ఒకరు బదిలీ ఉంటూ, పత్రాలు ఒక టేబుల్ నుంచి మరో టేబుల్‌కి మాత్రమే కదిలిపోతున్నాయి.కానీ ప్రభుత్వం పథకాన్ని కొనసాగిస్తున్నామని చెప్పినా, వాస్తవంలో ఆ పథకం ప్రాణాంతక స్థితిలోకి వెళ్లింది. విద్యార్థుల అభ్యాసం క్రమశిక్షణగా సాగాలంటే ఆర్థిక భారం ప్రభుత్వం భుజాన వేసుకోవాలి. కానీ ప్రభుత్వం కాలం గడుస్తున్న కొద్దీ విద్యపై పెట్టుబడిని తగ్గిస్తూ, పథకాలను బలహీనపరుస్తూ ఉంటే, ఎలా పేదలు ఉన్నత విద్య సాధిస్తారు? పైగా, ప్రతి సంవత్సరం వేలాది మంది విద్యార్థులు రీయింబర్స్మెంట్ ఆలస్యం వల్ల పరీక్షలు రాయకపోవడం, ఇంటికి వెళ్లిపోవడం, హాస్టల్‌లో బకాయిలతో అవమానకర పరిస్థితులు ఎదుర్కోవడం వంటి సంఘటనలు పెరుగుతున్నాయి. ఒక ప్రభుత్వం విద్యార్థుల సమస్యలను పట్టించుకోకపోతే, ఆ ప్రభుత్వం భవిష్యత్తును పట్టించుకోకుండా ఉన్నట్టే. కాలేజీలు కూడా నేటి పరిస్థితుల్లో బలహీనపడ్డాయి. ఒక్కో విద్యార్థి ఫీజు రీయింబర్స్మెంట్ 35,000 నుంచి 70,000 వరకు ఉన్నప్పటికీ, కాలేజీలు సంవత్సరాల తరబడి ఆ డబ్బుల కోసం ఎదురు చూస్తున్నాయి. ప్రైవేట్ కాలేజీలు వాణిజ్య వ్యాపారాలుగాకనిపించినా, వాటిలో నడుస్తున్న అధ్యాపకులు, సిబ్బంది కూడా కుటుంబాలు ఉన్న మనుషులే. వారికి వేతనాలు రాకపోతే ఆ కుటుంబాల పరిస్థితి కూడా అలాగే దెబ్బతింటుంది. ఈ మొత్తం సంక్షోభానికి మూలం ప్రభుత్వ నిర్లక్ష్యం, బాధ్యత లేకపోవడం. విద్యార్థులు ఇంతటి ఆర్థిక ఒత్తిడిలో చదువుతుంటే వారి విద్యా నాణ్యత ఎలా మెరుగుపడుతుంది? ఒక విద్యార్థి ఆలోచన మొత్తం రేపటి ఫీజుగురించి ఉంటే,అతని దృష్టి చదువుపై ఎలా ఉంటుంది? విద్యార్థులు అనిశ్చితిలో ఉన్న సమాజం అభివృద్ధి చెందదు. మన దేశం బలంగా ఎదగాలంటే మన యువతకు బలోపేతమైన విద్య,ఆర్థిక భద్రత అవసరం. కానీ ప్రస్తుతం జరుగుతున్నది దీని పూర్తిగా విరుద్ధం. ప్రభుత్వం ఏవైనా పథకాలు ప్రారంభించవచ్చు, ఏవైనా నూతన కార్యక్రమాలు ప్రకటించవచ్చు. కాని విద్యపై ఉండే పథకాల విషయంలో రాజకీయాలు చేయకూడదు.విద్యకు సంబంధించిన పథకాలు ప్రభుత్వాలు మారినా, పార్టీలు మారినా, నిరంతరంగా కొనసాగాలి. ఒక విద్యార్థి చదువును మధ్యలో ఆపడం అంటే సమాజానికే నష్టం. విద్యార్థి తన సమయాన్ని కోల్పోతాడు, కుటుంబం తన ఆశను కోల్పోతుంది, రాష్ట్రం తన నైపుణ్యాన్ని కోల్పోతుంది. అయినప్పటికీ ఈ దశలో రాజకీయ నాయకుల నిశ్శబ్దం ఎంతో బాధాకరం. ప్రస్తుతం అత్యవసరం ఏమిటంటే రీయింబర్స్మెంట్ బకాయిలన్నిటినీ వెంటనే క్లియర్ చేయటం. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్‌షిప్ పథకాలను మరింత పారదర్శకంగా అమలు చేస్తామని హామీ ఇచ్చారు. కానీ, ప్రస్తుతం తీవ్ర నిర్లక్ష్యం జరుగుతున్నది. రాష్ట్రంలో 1,800 ప్రైవేట్ కాలేజీల్లో చదువుతున్న 14 లక్షల మంది విద్యార్థులకు రూ.8,042 కోట్ల ఫీజు రీయింబర్స్మెంట్, రూ.1,924 కోట్ల స్కాలర్షిప్లు పెండింగ్లో ఉన్నాయి. ఈ నిధులు చెల్లించకపోవడంతో విద్యార్థులతో పాటు కళాశాల యాజమాన్యాలు, వాటిలో పనిచేస్తున్న 2.5 లక్షల మంది ఉద్యోగులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యా సంస్థల్లో అక్రమాలు ఉంటే చర్యలు తీసుకోవాలి కానీ బకాయిలను ఆపడం సరికాదు. ఇక తెలంగాణ ప్రభుత్వం అప్పుల్లోఉంది అని ముఖ్యమంత్రి ఒక వేదికపై చెప్పారు కానీ నాయకులు తమ జీతాలు పెంచుకున్నారు. ఒక పథకం బలహీనపడితే అది పదివేల భవిష్యత్తులను దెబ్బతీస్తుంది. అందుకే విద్యార్థుల కోసం, సమాజం కోసం, రాబోయే తరాల కోసం, ప్రభుత్వం ఇప్పటికైనా తన బాధ్యతను గ్రహించి, ఫీజు రీయింబర్స్మెంట్ పథకాన్ని పునర్జీవితం చేయాలి. ●

# పంటలకు ధరల స్థిరీకరణ నిధి అవసరం

బొల్లిముంత సాంబశివరావు

ఆంధ్రప్రదేశ్లో నేడు మొక్కజొన్న రైతులు తీవ్రమైన సంక్షోభంలో ఉన్నారు. సేద్యపు ఖర్చులు పెరగడం, పండించిన పంటకు న్యాయమైన ధర లభించక, మద్దతుధర అలంకార ప్రాయంగా మారడం,దళారుల దోపిడీకి గురై అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. ప్రపంచంలో మొక్కజొన్ననుఅత్యధికంగా ఉత్పత్తి చేసే దేశాలు అమెరికా,మెక్సికో, బ్రెజిల్, చైనాలు. అమెరికా 9కోట్ల,60లక్షల ఎకరాల సాగు ద్వారా 360 మిలియన్ టన్నుల మొక్కజొన్న ఉత్పత్తి చేస్తూ మొదటి స్థానంలో ఉంది. అమెరికా ఆర్థికవ్యవస్థలో మొక్కజొన్న ఉత్పత్తి ముఖ్యమైన పాత్రపోషిస్తున్నది.ప్రపంచ ఎగుమతుల్లో అమెరికా వాటానే 50శాతంగా ఉంది. అమెరికా పాలకులు 1930 నుంచి మొక్కజొన్న ఉత్పత్తికి మద్దతు ఇస్తున్నారు. గత 20 సంవత్సరాల్లో సబ్సిడీ సగటు వార్షిక వ్యయం 47లక్షల డాలర్లు. ప్రతిసంవత్సరం అమెరికా రైతు 61 వేల డాలర్ల సబ్సిడీ పొందుతున్నాడు. భారత రైతులకు కేవలం 282 డాలర్లు మాత్రమే సబ్సిడీ లభిస్తున్నది. అమెరికాలో మొక్కజొన్న దిగుబడి హెక్టార్‌కు 11 టన్నులు కాగా, భారత్‌లో 2 టన్నుల 540 కిలోలు మాత్రమే. నేడు భారత దేశంలో 9.89 మిలియన్లహెక్టార్ల మొక్కజొన్న సాగు ద్వారా ప్రపంచ విస్తీర్ణంలో 4వ స్థానంలోఉంది. ఉత్పత్తి42.3 మిలియన్ టన్నులు. సగటు దిగుబడి ఎకరాకు 20క్వింటాళ్లు. దిగుబడుల్లో చాలా వెనుకబడి ఉంది. అందుకు కారణం దేశ వాతావరణానికి అనుకూలమైన నాణ్యమైన విత్తనాలు దేశ రైతులకు అందకపోవడమే. ఆంధ్రప్రదేశ్‌లో ఈసంవత్సరం 1.42 లక్షల ఎకరాల్లో రైతులు మొక్కజొన్న సాగు చేశారు. దేశంలో మొక్కజొన్న సాగులో తెలంగాణ5వ, ఆంధ్రప్రదేశ్7వస్థానంలోఉన్నాయి. ఏపీ ఎకరా సేద్యప ఖర్చు30 నుండి 35 వేలు. కౌలు రైతులు అదనంగా మరో 13వేలు కౌలు చెల్లించాలి. సగటు దిగుబడి 25 క్వింటాళ్లు. కొందరి రైతులకు 35 క్వింటాళ్ల దాకా దిగుబడి వస్తున్నది. కేంద్రం ప్రకటించిన మద్దతుధర 2,400 రూపాయలు. ఈ ధర రైతులకు అంతప్రయోజనం



గాలేదు. ఏపీ రైతులకు మద్దతు ధర లభించక నష్టపోతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇంతవరకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. ప్రభుత్వ కొనుగోళ్ల కేంద్రాలు లేకపోవడంవల్ల ప్రైవేట్ మార్కెట్‌లో లభిస్తున్న ధర 1600 రూపాయలు మాత్రమే. కొన్నిప్రాంతాల్లో 1450 మాత్రమే ధర దక్కుతున్నది. ఫలితంగా రైతులకు పెట్టిన పెట్టుబడి కూడా రాకనష్టపోతున్నాడు. రైతాంగం గిట్టుబాటు ధర లభించక నష్టపోయి అప్పుల పాలౌతుంటే, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగాన్ని ఆదుకునే చర్యలు తీసుకోవాల్సి ఉండగా, అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయి. దేశ రైతుల వద్ద ఉన్న మొక్కజొన్నను కొనుగోళ్లు చేయకుండా 5 లక్షల టన్నుల మొక్కజొన్నను మోడీప్రభుత్వం అమెరికా నుండి దిగుమతి చేసుకుంటూ భారత రైతాంగాన్ని మరింత సంక్షోభంలోకి నెట్టింది. అమెరికా మొక్కజొన్నను భారత్ దిగుమతి చేసుకోవాలని మోడీని ట్రంప్ బెదిరించడం, ఇటీవల న్యూఢిల్లీలో జరిగిన చర్చల్లో మా మొక్కజొన్న కొనరా అని అమెరికా వాణిజ్య మంత్రి హొవార్డ్లుట్నిక్ భారత ప్రభుత్వాన్ని ప్రశ్నించడం, అందుకు తలొగ్గిన మోడీ ప్రభుత్వం మొక్కజొన్న దిగుమతిపై15శాతంగా ఉన్న సుంకాన్ని కూడా తొలగించి మరీ దిగుమతి ఒప్పందం చేసుకోవడం భారత ప్రభుత్వంపై అమెరికా ఆధిపత్యానికి నిదర్శనం.కేంద్ర ప్రభుత్వంతో పాటు రాష్ట్రప్రభుత్వానికి పంటల కొనుగోళ్ల బాధ్యత ఉంది. గిట్టుబాటు ధర పంటలకు లభించనప్పుడు, రాష్ట్ర ప్రభుత్వం కూడా కొనుగోళ్లు చేపట్టి రైతులను ఆదుకోవాలి. అందుకు ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేయాలి. దాని ద్వారా పంటలు కొనుగోళ్లు చేయాలి. నేడు పత్తిరైతులను ఆ విధంగా ఆదుకోవాలి. అలాంటి చర్యలు చంద్రబాబు ప్రభుత్వం చేపట్టలేదు. వైసీపీ ప్రభుత్వం ధరల స్థిరీకరణ నిధికి 3వేల కోట్లు కేటాయిస్తే, కూటమి ప్రభుత్వం 300 కోట్లు మాత్రమే కేటాయించింది. ఈ మొత్తంతో పంటల కొనుగోళ్లు ఎలా సాధ్యం. కూటమి ప్రభుత్వం మొక్కజొన్న రైతులనే కాదు, ఏ పంట రైతులను ఆదుకోవటం లేదు. ఏ పంటకు గిట్టుబాటు ధరల భించడంలేదు. మొక్కజొన్న కొనుగోళ్లలో కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల వైఫల్యాలను నిరసిస్తూ, మద్దతు ధర చెల్లించి ప్రభుత్వసంస్థలే రైతులవద్ద ఉన్న మొక్కజొన్నను కొనుగోళ్లు చేయాలని, దళారుల, ప్రైవేట్ వ్యాపారుల దోపిడీని అరికట్టాలని,మొక్కజొన్న దిగుమతులను ఆపాలని ఉద్యమించడమే మొక్కజొన్న నేటిరైతుల తక్షణ కర్తవ్యం. ●

# ఇచ్చిన హామీలను నెరవేర్చేదెప్పుడు?

కైలసాని శివప్రసాద్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరిగిన సాధారణ ఎన్నికల సమయంలో రాజంపేటను జిల్లా కేంద్రం చేస్తామని 2024 సంవత్సరం, ఏప్రిల్ 25వతేదీన తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్‌లు ఉమ్మడిగా పాల్గొన్న రాజంపేట బహిరంగ సభలో ఒకే వేదిక నుండి ఉమ్మడిగా హామీ ఇవ్వడం గమనార్హం.అత్యంత క్లిష్టమైన సూపర్ సిక్స్ హామీలనే స్వల్ప వ్యవధిలో నెరవేర్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లు గతంలో తాము ఇరువురూ ఒకే వేదిక నుండి రాజంపేటను జిల్లా కేంద్రం చేస్తామని ఇచ్చిన పాలనా పరమైన హామీని కూడా కచ్చితంగా నెరవేరుస్తారని రాజంపేట, రైల్వే కోడూరు నియోజక వర్గ ప్రజలలో గంపెడు ఆశలు రేకెత్తాయి. కానీ ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు పరిశీలిస్తే రాజంపేట, కోడూరు ప్రజలకు మళ్లీ ఆశాభంగం కలిగేటట్లు కనిపిస్తూ ఉంది. చారిత్రాత్మకంగా, మౌలికవసతులపరంగా, నైసర్గికంగా జిల్లా కేంద్రానికి అన్ని అర్హతలు కలిగిన రాజంపేట గత పాలకుల నిర్లక్ష్యానికి గురైంది. ఒకవిధంగా చెప్పాలంటే రాజంపేటను జిల్లా కేంద్రం చేయకుండా గత పాలకులు ప్రజలకు తీవ్ర అన్యాయం చేశారనడంలో ఎటువంటి సందేహం లేదు. గతంలో వై.యస్.జగన్ మోహన్ రెడ్డి రాజంపేటకు ప్రభుత్వ మెడికల్ కాలేజీ మంజూరు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి హోదాలో స్వయంగా ప్రకటించి,అందుకు సంబంధించిన జి.ఓ కూడా విడుదల చేశారు. కానీ కొద్ది రోజులకే ఆ మెడికల్ కాలేజీని మదనపల్లికి తరలించడం ఆశ్చర్యకరం. దానికి ప్రతిగా రాజంపేటను జిల్లా కేంద్రం చేస్తామని ఆసమయంలో వై.సి.పి ప్రజా ప్రతినిధులు రాజంపేట. రైల్వే కోడూరు ప్రజలకు కంటి తుడుపు మాటలు చెప్పారు. కానీ జిల్లా కేంద్రం కూడా అప్పట్లో సుదూర ప్రాంతమైన రాయచోటిని జిల్లా కేంద్రం చేసి అప్పటి వై.సి.పి ప్రభుత్వం రాజంపేట, రైల్వే కోడూరు ప్రజలను తీవ్ర అసౌకర్యానికి గురిచేసింది. రాజంపేట మండలంలో చెయ్యేరు నదిపై 2.26 టి.యం.సి ల సామర్థ్యంతో 10




వేల ఎకరాలకు పైగా సాగునీరు, రాజంపేట మున్సిపాలిటీతో పాటూ 18 గ్రామాలకు త్రాగునీరు ఇచ్చే అన్నమయ్య ప్రాజెక్టు 1976లో అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావుచేత శంఖుస్థాపన చేయబడి 2001లో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హయాంలో పూర్తి చేయబడింది. 2020సంవత్సరం, నవంబరులో అకస్మాత్తుగా అన్నమయ్య ప్రాజెక్టు అప్పటి వర్షాలకు కొట్టుకుపోయింది. కానీ దానిని పునః నిర్మించేందుకు గత ప్రభుత్వంనామమాత్రపు ప్రయత్నం కూడా చేయకపోవడం దురదృష్టకరం. వాస్తవంగా రాజంపేట నియోజక వర్గం అన్ని విధాలుగా ఎంతో ప్రాముఖ్యత కలిగిన ప్రాంతమనడంలో ఎటువంటి సందేహం లేదు. బ్రిటీషు వారి కాలం నుంచే రాజంపేటలో సబ్ కలెక్టర్ కార్యాలయం నెలకొని ఉంది. రాజంపేట నియోజక వర్గంలోని పెన్నా నది ఒడ్డున ఉన్న సిద్దవటంలో గతంలోనే నవాబుల పాలనలో 1807 నుంచి 1812 వరకు జిల్లా కేంద్రం ఉండేది. వర్షాలు వచ్చినప్పుడు పెన్నా నది పొంగుతూ ఉండడంతో సిద్దవటం నుంచి జిల్లా కేంద్రాన్ని అప్పట్లో కడపకు మార్చడం జరిగింది. క్రీ.శ 1303 లో రాజులు సిద్దవటంలో బలమైన కోటను నిర్మించుకుని అక్కడి నుంచి సుదీర్ఘ కాలం పరిపాలించినట్లు చరిత్ర తేటతెల్లం చేస్తూఉంది. సిద్దవటాన్ని దక్షిణ కాశీ ముఖ ద్వారం అని కూడా పిలుస్తారు. రాజంపేట నియోజక వర్గంలోని ఒంటిమిట్ట కూడా ఎంతో చారిత్రాత్మక, ఆధ్యాత్మిక నేపథ్యాన్ని కలిగి ఉండడం గమనార్హం. 1408 నుంచి 1503 వరకు అన్నమయ్య తిరగాడిన రాజంపేటను కాదని అదే అన్న మయ్య పేరుతో గత పాలకులు రాయచోటిని జిల్లా కేంద్రం చేయడం రాజకీయ విశ్లేషకులను, మేధావులను, చరిత్రకారు లను విస్మయానికి గురిచేసింది. రాజంపేటలో ఇప్పటికి ప్పుడు జిల్లా కేంద్రం నెలకొల్పేందుకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు పుష్కలంగా ఉన్నాయి.చరిత్రను, సదుపాయాలను, నైసర్గికతను విస్మరించి సుదూర ప్రాంతా న్ని జిల్లా కేంద్రం చేసిన గత పాలకుల తప్పును సరిదిద్ది గత ఎన్నికల సమయంలో తాము ఒకే వేదికపై నుంచి రాజంపేటను జిల్లా కేంద్రం చేస్తామని ఇచ్చిన ఉమ్మడిహామీని నిలబెట్టుకోవలసిన బాధ్యత కచ్చితంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లపై ఉందనేది నిర్వివాద అంశం. ●

# ప్రజావాక్కు



### సామాన్యులకే కష్టాలు

నేరాలు, ఘోరాలు చేసినవారు పట్టుబడినప్పుడు వారిని విచారించే సిబిఐ వారుగాని సిఐడిలేదా ఇతర పరిశోధనా సంస్థల వారిప్రశ్నలకు తెలియదు,గుర్తులేదు, మరచిపోయా అనే సమాధానాలు ఇస్తూ కాలం గుడిపేస్తున్నారు. ఇవి పచ్చి అబద్ధాలని అందరకు తెలుసు. వారికెంత ఆస్తి ఉన్నదో, కుటుంబ సభ్యుల పేర్లమీద ఎన్ని బ్యాంకుల్లో ఎంత సొమ్ము ఉన్నదో వారికి తెలియదా? ఏళ్ళ క్రితం ఎంత చదువు చదివారో,ఏ కాలేజిలలో, ఎంతవరకు చదివారో, ఏ హోదాలను అలంకరించారో, భార్య, పిల్లల బంధువుల స్నేహితుల పేర్లన్నీ గుర్తు ఉండవా? నేరాలు చేసినవవి మాత్రమే గుర్తుండవా? మన దేశంలో కోర్టులు చట్టాలు ఇటువంటి వారిని ఎందుకు శిక్షించలేవు? వీరు కార్లలోనూవారి వందిమాగధులమధ్య ఏభయమూ లేకుండాహుందాగా తలఎత్తుకుని తిరుగుతారు. సామాన్యులకే అన్ని కష్టాలు, భయాలు, అవమానాలు, శిక్షలు.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### పేదరికం లేని రాష్ట్రం

కేరళరాష్ట్రం దుర్భర పేదరికం లేని రాష్ట్రంగా మారడంలో సమిష్టి కృషి ఫలితం,వికేంద్రీకృత ప్రణాళికలు రూపకల్పన చేసింది. ముందు ప్రమాణాలు సెట్ చేసి ఆ ప్రమాణాలు అందుకోలేని కుటుంబాలను గుర్తించి కనీస అవసరాలు అందుకోలేని కుటుంబాలను ఫోకస్ చేసి వాళ్లకు ప్రభుత్వ పరమయిన సహాయం అందేలా చేయడం మూలంగా జీవన ప్రమాణ స్థాయిని అందుకునేల చేశారు. తద్వారా పేదరికం స్థాయిలను తగ్గించుకుంటు వచ్చి పేదరికం లేకుండా చేశారు. కేరళ రాష్ట్రాన్ని అన్ని రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకొని ఆ దిశగా కృషి చేయాలి.

- భారత అవినాష్, జనగామ

### వెనిజులాకు రష్యా అండ

అమెరికా పనామా నుండి మెక్సికో, కెనడా,ఉత్తర ధృవం వరకు భూభాగాలను ఆక్రమించి టెక్నెట్ సామ్రాజ్యాన్ని నిర్మించాలని చూస్తోంది. టెక్నెట్ సామ్రాజ్యం లో ప్రజాప్రతినిధులు సాంకేతిక నైపుణ్యం ఆధారంగా నియమించబడతారు. ఈఆశయం కోసం వెనిజులా మీద దాడి చేయడానికి సన్నాహాలు చేస్తోంది. వెనిజులాకు రష్యా అండగా ఉండే అవకాశం ఉంది.

- పుట్లూరి రాం నర్సింహారెడ్డి, నల్లగొండ జిల్లా

### అభివృద్ధితో సంక్షేమం

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించిన తెలంగాణ ఉదయ మార్గదర్శిని - అభివృద్ధి ద్వారా సంక్షేమానికి నిధులు రాష్ట్ర భవిష్యత్తు దిశను స్పష్టంగా చిత్రించే ఆలోచనగా నిలుస్తోంది. సంక్షేమకార్యక్రమాలను నిలకడగా కొనసాగించాలంటే రాష్ట్ర ఆదాయం పెరిగి,ఆర్థికవ్యవస్థ బలోపేతం కావాలన్న స్పష్టమైన భావన ఈ మార్గదర్శినిలో ప్రతిధ్వనిస్తోంది. గత కొన్నేళ్లుగా సంక్షేమ పథకాల విస్తరణతో రాష్ట్రంపై పడిన ఆర్థిక భారాన్ని దృష్టిలో పెట్టుకుని, అభివృద్ధిని ప్రధానబలంగా మార్చుకోవాలన్న నిర్ణయం సమయోచితంగాభావించవచ్చు.ఈ మార్గదర్శిని రూపుదిద్దడంలో జాతీయ విధానసంస్థ,భారత నిర్వహణ పాఠశాల నిపుణులు పాల్గొనడం దీనికి శాస్త్రీయతను, ప్రామాణికతను జోడించింది. అభివృద్ధి ప్రణాళికలో వ్యవసాయం-పరిశ్రమలఅనుసంధానం,పెట్టుబడుల పెంపు,నైపుణ్యాభివృద్ధి, గ్రామీణప్రాంతాల ప్రగతి వంటి అంశాలు కీలకంగా పొందుపరిచారు.

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

### సరదా వెనుక దాగిన సవాళ్లు

ఆధునిక డిజిటల్ యుగంలో ఆన్‌లైన్ గేమ్స్ అనేవి కోట్లాది యువతను ఆకర్షిస్తున్న వినోద వేదికలుగా మారాయి. పబ్జ్, ఫైర్,మిన్ క్రాఫ్ట్, వంటి గేమ్స్ కేవలం ఆటలు మాత్రమే కాదు, అంతర్జాతీయ స్థాయిలో మల్టీబిలియన్ డాలర్ల పరిశ్రమగా ఎదిగాయి. ఆధునిక గ్రాఫిక్స్, శబ్ద ప్రభావాలు, రివార్డ్స్, లీడర్ బోర్డ్స్ వంటిఅంశాలు యువతను మరింతగా ఆకట్టుకుంటున్నాయి.కానీవినోదం వెనుకదాగిఉన్న మానసిక,శారీరక, సామాజిక ప్రమాదాలను సమాజం సీరియస్‌గా పరిగణించాల్సిన అవసరం ఉంది. ఆన్‌లైన్ గేమ్స్ ప్రారంభంలో వినోదం కోసం ఆడినా, తరువాత అవి వ్యసనంగా మారుతున్నాయి.

-వెంకటరమణ, గిలకత్తుల

### తగ్గిన పేదరికం

భారత్‌లో పేదరికం భారీగా తగ్గిపోయిందని ప్రపంచ బ్యాంకు గణాంకాలు పేర్కొన్నాయి.ఈ లెక్కలు చెప్పిన వారు పట్టణాల్లో గ్రామాల్లో సర్వేలు చేసే చెప్పారా అని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఏ ప్రభుత్వ పథకానికి నోచుకోలేనివారు గంజి నీళ్లకు కష్టపడుతున్నారు. మన దేశం చాలా పేద దేశమని పూర్వ రిజర్వ్‌బ్యాంకు గవర్నరు రఘురామ్ రాజన్ ఈ మధ్య నేలన్నారు. ఈ పేదరికంలో రిటైరైన వారు కూడా ఉన్నారు.

- ఎం. రామారావు, హైదరాబాద్

మన వి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

ong-5_ong-5.qxd 12/4/2025 12:51 AM Page 1



## జగన్,సజ్జలలను కలిసిన అద్దంకి నియోజకవర్గ కన్వీనర్,మండల కన్వీనర్‌లు

**అద్దంకి, డిసెంబరు 3, ప్రభాతవార్త :**
రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధినేత వైయస్ జగన్‌మోహన్‌రెడ్డిని అద్దంకి నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్, నియోజకవర్గంలోని 5మండలాలు, అద్దంకి పట్టణ కన్వీనర్‌తో కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పార్టీ స్థితిని, పరిస్దితిని





వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వివరించారు. అదే విధంగా పార్టీ సీనియర్ నాయకులు సజ్జల రామకృష్ణారెడ్డిని కూడ ఈ నేతలు కలిశారు. నియోజకవర్గంలో పార్టీ పరిస్ధితిని ఆయనకు వివరించగా రాబోయే రోజుల్లో వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ కార్యకర్తలకు అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు ఆయన వెల్లడించినట్లు సమాచారం. గత వైసిపి ప్రభుత్వంలో వాలంటీర్ల ప్రభావం పార్టీ మీద పడినట్లు ఈ సారి నేరుగా అన్నీ విషయాలలో పార్టీ కార్యకర్తలకే అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు సజ్జల వీరికి హామీ ఇచ్చినట్లు తెలుస్తుంది. అశోక్ కుమార్ వెంట కాకాని రాధాకృష్ణమూర్తి, గుజ్జుల జగన్‌మోహన్ రెడ్డి, క్రిష్ణతోపాటు పలువురు నేతలు వున్నారు.

## దివ్యాంగులకు సమాజంలో సమాన గౌరవమివ్వాలి

**కొండపి, ప్రభాతవార్త**
విభిన్న ప్రతిభావంతులకు సమాజంలో అందరితోపాటు సమాన గౌరవం అందించాలని కొండపి పంచాయతీ ఉప సర్పంచ్ కూనం నేని వాసంతి సూచించారు.ప్రపంచ దివ్యాంగుల దినోత్సవ వేడుకలు పంచాయతీలోని దాసిరెడ్డి పాలెం ఎంపీపీ, పాఠశాలలో బుధవారం ఘనంగానిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంఈఓ సురేఖ ఎంఈఓ 2 రామారావు పాల్గొని మాట్లాడుతూ. దివ్యాంగులు



లను వేరుగా చూడకుండా సమాజంలో కలుపుకొని అందరితో పాటు అభివృద్ధిలో ముందుకు తీసుకువెళ్లాలి . అన్నారు అలాగే ప్రభుత్వం నుంచి అందుతున్న వివిధ రకాల అలవెన్స్ ఉపకార వేతనాలు సక్రమంగా అదేవిధంగా ప్రత్యేక ఉపాధ్యాయులు చూడాలి అని సూచించారు .ఈ కార్యక్రమానికి శంకర్ రెస్టారెంట్ యజమాని శంకర్ దివ్యాంగులకు స్వీట్స్ ఫ్రూట్స్ సమకూర్చారు కార్యక్రమానికి ముందు ఉపసర్పంచ్ చేతుల మీదుగా పళ్ళు పలకలు ,బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో, శంకర్ రెస్టారెంట్ యజమాని శంకర్ పాఠశాల హెచ్ఎం ఎంపీపీ స్కూల్ హెచ్ఎం, మండల భవిత కేంద్ర జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

## క్విస్ కళాశాల ఎన్ఎస్ కేసీ ట్రస్ట్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం

**- హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, రిమ్స్ సంయుక్త సహకారంతో... రక్తదానం చేసిన 70 మంది విద్యార్థులు**

**ఒంగోలు, ప్రభాతవార్త**
ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్ ఎస్ ఎస్, డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి వికసిత్ భారత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. హెచ్ డీ ఎఫ్ సీ బ్యాంక్, రిమ్స్ బ్లడ్ సెంటర్ సంయుక్త సహకారంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.



కళాశాలకు చెందిన 70 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. రక్తదానం ప్రాణదాణంతో సమానం అని, రక్తం దొరకక ఎంతోమంది ప్రాణాలు కోల్పోయిన పరిస్థితులు ఏర్పాడ్డాయని క్విస్ విద్యాంసంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి అన్నారు. అలాంటి పరిస్థితులు తలెత్తకుండా విద్యార్థులకు అవగాహన కల్పించి, రక్తదానం ప్రాధాన్యత వివరించి, స్వచ్ఛందంగా విద్యార్థులు ముందుకు వచ్చి రక్తదానం చేసేలా ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. కళాశాల ఎన్ ఎస్ ఎస్ యూనిట్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, విద్యార్థుల్లో సేవా భావం పెంపొందించేందుకు ఇవి ఎంతగానో దోహదపడతాయని విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ డాక్టర్ నిడమానూరి శ్రీ గాయత్రి దేవి అన్నారు. ఈ రక్తదాన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై.వి. హనుమంతరావు, హెచ్ డీ ఎఫ్ సీ క్లస్టర్ హెడ్స్ శ్రీకాంత్ సుకుబోయిన, రేగుల గిరిబాబు, బీఎం మండవ రాధారాణి, బీవోఎమ్ మల్లికార్జున జాజుల, బ్యాంక్ సిబ్బంది, రిమ్స్ రక్తదాన కేంద్రం సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని కళాశాల ఎన్ ఎస్ ఎస్ డీన్ డాక్టర్ నవనీత కృష్ణన్ పర్యవేక్షించారు.

## బీఆర్ ఆక్స్‌ఫర్డ్ కళాశాలకు జాతీయ గౌరవం

**- ఏఐఎస్‌ఎఫ్ సెట్- 2026లో తొలి బ్యాచ్ నుంచే అద్భుత విజయాలు**

**కనిగిరి, డిసెంబర్3, ప్రభాతవార్త**
కనిగిరి బీఆర్ ఎక్స్‌ఫర్డ్ కళాశాల విద్యార్థులు ఏఐఎస్‌ఎఫ్ సెట్-2026(ఆల్ ఇండియా ఫోరెన్సిక్ సైన్స్ ఎంట్రెన్స్ టెస్ట్)లో విశేష ప్రతిభ కనపరిచి కళాశాల ప్రతిష్టను జాతీయ స్థాయికి చేర్చారు. కళాశాల నుంచి 9 మంది విద్యార్థులు డి.నాగగంగ, ఎం.గౌతమీ, చంద్రలీల లేఖ, అపూర్వ, భావనాప్రశాంతి, ఇలియాజ్, సూర్య తేజ, ఇస్మాయిల్ పరీక్షకు హాజరు కాగా వారిలో 8 మంది అర్హత సాధించడం గర్వకారణమని కళాశాల డైరక్టర్ పగడాల రాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో బీఆర్ ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థల చైర్మన్ ఉన్నం భాస్కర్‌రావు విద్యార్ధులను అభినందిస్తూ గ్రామీణ ప్రాంత విద్యార్థులను ఐఐటీ, నెట్ వంటి జాతీయ స్థాయి పరీక్షలకు సిద్దం చేయడం తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ పరీక్షలలో డి.నాగ గంగ 69/100 మార్కులు సాధించి అఖల భారత ర్యాంక్(ఏఐఆర్) సాధించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. బైపీసీ మొదటి బ్యాచ్ నుంచే ఇలాంటి ర్యాంకులు రావడం సంస్థకు మైలురాయిగా నిర్వహణ మండలి వెల్లడించింది. అభినందన కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ బండి వెంకటేశ్వర్లు, డైరక్టర్లు షేక్ షియాజ్, బాల భాస్కర్, నరేంద్రబాబు, బాయ్స్ క్యాంపెస్ ప్రిన్సిపాల్ బి.ప్రవీణ్ కుమార్, గర్ల్స్ క్యాంపస్ ఇన్‌చార్జి స్రామాజ్యం, వైస్ ప్రిన్సిపాల్ బెల్లంకొండ రంగా పాల్గొని విద్యార్థులను అభినందించారు.





## ఘనంగా అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ వేడుకలు

**కనిగిరి, డిసెంబర్ 3, ప్రభాతవార్త**
అంతర్జాతీయదివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం స్థానిక ఎస్‌కేఆర్ బదిరుల పాఠశాలలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మానవతా సెంట్రల్ కమిటీ కన్వీనర్, సక్ష్యం దివ్యాంగుల సేవా కేంద్రం రాష్ట్ర ఎగ్జిక్యూటీవ్ సభ్యులు శ్రీనివాసులు, సాయి కృష్ణ దివ్యాంగుల వయోవృద్దుల ఆశ్రమం డైరక్టర్ డి.నరసయ్య, పాఠశాల డైరక్టర్ సుబ్బారెడ్డి, ప్రిన్సిపాల్ సునీతరెడ్డి, ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. భారతమాత చిత్రపటానికి పుష్పార్చనతో కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా మాట్లాడిన శ్రీనివాసులు విద్యార్థులకు అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ సక్ష్యం ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు గల దివ్యాంగుల కోసం అమలు చేస్తున్న సేవా కార్యక్రమాలను వివరించారు. తరువాత విద్యార్ధులు నేర్చుకున్న నృత్యాలు, సాంస్కృతి ప్రదర్శనలు ప్రేక్షకులను అలరించాయి. వివిధ పోటీల్లో విజయాలు సాధించిన విద్యార్ధులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రూ.1000 నగదు బహుమతి, అలాగే విద్యార్ధుల ఆరోగ్య అవసరాల కోసం రూ.5వేలు విలువైన మెడికల్ కిట్‌ను కనిగిరి సెక్షన్ కార్యదర్శి ఎలికే హరిబాబు అందించారు.

## న్యాయసేవా సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగుల దినోత్సవం

**అద్దంకి, డిసెంబరు 3, ప్రభాతవార్త :**
అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ఉన్నత న్యాయస్థానాల ఆదేశాల మేరకు అద్దంకి మండల న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో స్ధానిక బదిరుల ఆశ్రమ పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సదస్సులో దివ్యాంగుల హక్కులు, చట్ట పరంగా లభించే సౌకర్యాలను పలువురు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ పూనూరి ఆరోగ్యం, ఉచిత న్యాయ సహాయకులు టిఎం శ్రీను, షేక్ మహ్మద్ రఫీ, ధనుంజయరావు, స్వప్న తదితరులు పాల్గొన్నారు.







## కొత్త డ్రైనేజీ పనుల పరిశీలించిన ఎమ్మెల్యే ఉగ్ర

**కనిగిరి, డిసెంబర్ 3, ప్రభాతవార్త**
కనిగిరి పట్టణంలో 11వ వార్డు దేవాంగనగర్‌లో ఇటీవల మంజూరైన కొత్త డ్రైనేజీ పనులకు శాసన సభ్యులు ఉగ్ర నరసింహారెడ్డి బుధవారం ప్రత్యక్షంగా పరిశీలించారు. స్థానికంగా జరుగుతున్న అభివృద్ధి పనుల నాణ్యత, పురోగతిని తెలుసుకుని సంబంధిత అధికారులకు సూచనలు ఇచ్చారు. ఈ పరిశీలన కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు షేక్ ఫిరోజ్, ఓసేయ్ ఇస్మాయిల్, మోహన మురళి, చీర నాగార్జున యాదవ్, మున్సిపల్ కమీషనర్ పిల్లి కిరణ్ కుమార్‌రెడ్డి, ఏఈ మాధవరావు, కోటేశ్వరరావు పాల్గొన్నారు. ఎమ్మెల్యే స్థానిక ప్రజల నుండి సమస్యలను స్వీకరించి డ్రైనేజీ పనులు త్వరితగతిన నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు సమాచారం.



# ప్రతి ఇంటికి త్రాగునీరు..ప్రతి ఎకరాకు సాగునీరు

**- ముంపు గ్రామాలకు మౌళిక వసతులే ప్రధాన లక్ష్యం - యర్రబాలెంలో విద్యుత్ మంత్రి గొట్టిపాటి వెల్లడి**

**కొరిశపాడు, డిసెంబరు 3, ప్రభాతవార్త**
గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలన్న మహాత్మగాంధీ మాటలను అదర్శంగా తీసుకొని అద్దంకి నియోజకవర్గంలోని అన్నీ గ్రామాలను అభివృద్ధి చేస్తున్నట్లు రాష్ట్ర విద్యుత్‌శాఖమంత్రి గొట్టిపాటి రవికుమార్ వెల్లడించారు. బుధవారం నియోజకవర్గంలోని కొరిశపాడు మండలం యర్రబాలెంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవ సభలో మంత్రి పాల్గొన్ని మాట్లాడారు. అదే విధంగా అధికారులతో ప్రత్యేక సమీక్షా సమావేశాన్ని కూడ నిర్వహించారు. ఈ సందర్భంగా ముంపు గ్రామాలతోపాటు పలు గ్రామాలలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై వాటి పురోగతిపై మంత్రి గొట్టిపాటి రవికుమార్ పలు శాఖల అధికారులపై సమీక్షించారు. కూటమి ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందాలని ఆయన అదేశించారు. ఆర్‌డబ్యూఎస్ పథకం ద్వారా 57.50లక్షలతో యర్రబాలెం గ్రామంలో ప్రతి ఇంటికి రక్షిత మంచినీరు అందాలని మంత్రి సూచించారు. పనుల నాణ్యత ఎక్కడా రాజీపడవద్దని సూచించారు. తిమ్మనపాలెం నుండి యర్రబాలెం వరకు 1.20కోట్లతో పునర్‌నిర్మించిన బిటి రోడ్డును మంత్రి ప్రారంభించారు. ముంపు గ్రామాలకు సంబంధించి పనుల వేగవంతంగా జరగాలని అధికారులను అదేశించారు. గుండ్లకమ్మ ప్రాజెక్టు నిర్వహణలో అప్రమత్తంగా అధికారులు వుండాలని సూచించారు. త్రాగు నీటి వ ధ కాలు, ఆర్ అండ్ బి రోడ్లు, ఇళ్ళస్థలాలు, తదితర పనులను త్వరగా పూర్తిచేసి లబ్దిదారులకు అందేలా చూడాలని అధికారులను మంత్రి అదేశించారు. విద్యుత్‌శాఖపంగా బిసిలకు 98వేలు, ఇతరులకు 78వేలు సోలార్ సబ్సిడీని అందిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. ప్రభుత్వ భవనాలు, పాఠశాలలతోపాటు, ప్రభుత్వ కార్యాలయాలపై సోలార్ ఏర్పాటు చేసి విద్యుత్ చార్జీలను తగ్గే చర్యలను తీసుకుంటున్నట్లు మంత్రి వెల్లడించారు. అద్దంకి నియోజకవర్గాన్ని రోల్ మోడల్‌గా తీర్చిదిద్దను న్నట్లు మంత్రి ప్రకటించారు. రోడ్ల కొరకు కోట్లాది రూపాయల నిధులను తెచ్చినట్లు మంత్రి వివరించారు. ముంపు గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికను రూపోదించినట్లు ఇప్పటికే లో ఒల్టేజి సమస్య పరిష్కార దిశగా అద్దంకి నియోజకవర్గంలో 5సబ్‌స్టేషన్‌ల నిర్మాణం జరుగుతుందని ఆయన వివరించారు. గ్రామంలో దేవాలయ ప్రహరీ గోడను 30లక్షలతో నిర్మించే అందుకు శంఖస్థాపన కార్యక్రమాన్ని మంత్రి నిర్వహించారు. గ్రామంలో నిర్వహించిన మీకోసం కార్యక్రమంతోపాటు, ప్రజల కొరకు ప్రత్యేకంగా నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో పలు శాఖల అధికారులతో మంత్రి ప్రత్యేక సమీక్షను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులతోపాటు కూటమి నేతలు ఆర్‌డిఓ తుమాటి చంద్రశేఖర్ నాయుడు, ఎస్‌డిసి శివజ్యోతి, ఎంపిపి సాధినేని ప్రసన్నకుమారి, ఈఈ మస్తాన్‌రావు, తహశీల్దార్ జివి సుబ్బారెడ్డి, ఎఇ ప్రసాద్, బల్లికురవ తహశీల్దార్ రవినాయక్, ఎఓ రాంమోహన్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు సత్యనారాయణ, శ్రీనివాసరావు, చెన్నుపాటి హరి బాబు, కారుసాల బాబు, కోట శ్రీనివాసరావు, భవానీ ప్రసాద్‌రెడ్డి, పిఎసిఎస్ అధ్యక్షులు రాంబాబు, మొరవనేని ప్రభాకరరావు, సాధినేని మస్తాన్‌రావు, సాధినేనని శ్రీనివాసరావుతోపాటు పలు గ్రామాల సర్పంచ్‌లు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





## కష్టపడి పని చేసే కార్యకర్తకు అందలం

***- జిల్లా ఏర్పాటుతో పశ్చిమ ప్రకాశం అభివృద్ధికి నాంది***
***- భవిష్యత్తులో మరిన్ని పరిశ్రమలు: ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి***

**మార్కాపురం, డిసెంబరు 3,ప్రభాతవార్త**
పార్టీ అభివృద్ధికి కృషిసే ప్రతి కార్య కర్తకు సముచిత స్థానం కల్పిస్తామని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి స్వస్థం చేశారు మార్కాపురం పట్టణంలోని 8వ వార్డులో ప్రత్యేక మార్కాపురం జిల్లా ప్రకటించడం పట్ల శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్రపటానికి నిర్వహించిన పాలాభిషేక కార్యక్రమం లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందుల మాట్లాడుతూ, "పని చేసేవారిని దేవుడు కూడా ఆశీర్వదిస్తాడు" అని పేర్కొన్నారు. ప్రత్యేక జిల్లా కోసం 63 రోజుల పాటు పోరాడిన సందర్భాలను గుర్తు చేస్తూ, అప్పట్లో నిరాహార దీక్షలు, సైకిల్ యాత్రలు చేసిన సమయంలో పోలీసులు అరెస్టు చేసి బలవంతంగా ఆస్పత్రికి తరలించడం జరిగిందని గుర్తుచేశారు. ఆ పోరాటానికి ప్రతి స్పందనగా నారా చంద్రబాబు నాయుడు జన్మదినానే ప్రత్యేక మార్కాపురం జిల్లా ప్రకటించారని, ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నరలో వాగ్దానం అమలు చేసిందన్నారు. వైసీపీ నాయకులు ప్రత్యేక జిల్లాను అర్థం చేసుకోలేక అవాకులు, చవాకులు పేలుస్తున్నారని విమర్శించారు. మార్కాపురం జిల్లా ద్వారా నిరుద్యోగులకు ఉద్యోగాలు, కేంద్ర నిధులు, అన్ని రంగాల్లో అభివృద్ధి సాధ్యమవుతుందని, పట్టణం సీతనాగులవరం, దేవరాజుగట్టు, హనుమాన్‌కుంట, గనుల రోడ్ దాకా విస్తరిస్తుందని పేర్కొన్నారు. భవిష్యత్తులో భూముల విలువలు రెండింతలు, మూడింతలు పెరిగే అవకాశముందన్నారు. వెలుగొండ ప్రాజెక్టు, జిల్లా ఆసుపత్రి వంటి అనేక అంశాలను తానే సాధించానని గుర్తు చేస్తూ త్వరలో మార్కాపురంకు మిర్చి యార్డు కూడా తీసుకురానున్నట్లు తెలియజేశారు. వైసీపీ నాయకులు ఏం చేశారో చెప్పాలని సవాల్ విసిరారు. మొన్నటి మొందా తుఫాన్ సమయంలో తమ ప్రజా ప్రతినిధులు, అధికారులు కష్టపడి పనిచేసి ప్రాణ–ఆస్తి నష్టం ఏమీ లేకుండా చూసారని వివరించారు. మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణ పేరుతో వైసీపీ నాయకులు రోడ్లపై డప్పులు కొట్టించుకుంటూ ప్రజా డబ్బు ఖర్చు చేస్తున్నారని, దీనివల్ల ప్రజలకు ఏమి లాభమో అర్థం కావడం లేదని వ్యాఖ్యానించారు. తరువాత మహిళలు ప్రత్యేక మార్కాపురం జిల్లా ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపుతూ చంద్రబాబు నాయుడు చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు, 8వ వార్డు కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





## అభ్యర్థిపై స్పష్టత ఉండాలి

***- తరచూ ఇన్‌చార్జిలను మార్చవద్దు***
***- జగనకు విన్నవించిన అద్దంకి నియోజకవర్గ మండల కన్వీనర్‌లు***
***- బస్సుయాత్రలో స్పష్టత ఇస్తా జగన్ హామీ***
***- అద్దంకి అభ్యర్థి అశోకే అని మర్మగర్భంగా జగన్ వెల్లడి***

**అద్దంకి, డిసెంబరు 3, ప్రభాతవార్త**
రాష్ట్ర మాజీ ముఖ్య మంత్రి, వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అద్దంకి నియోజకవర్గంలోని పలు మండలాల కన్వీనర్‌లు కలిసారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పార్టీ పరిస్ధితిని కన్వీనర్‌లు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వివరించారు. అయితే తరచూ నియోజకవర్గ ఇన్‌చార్జిని మార్చడం, ప్రతి ఎన్నికకు ఒక క్రొత్త అభ్యర్థి పోటీ వుండటం వలన పార్టీలోని కేడర్ ఆయోమయంలో పడిపోతుందని, ఎవరూ పట్టుదలగా పనిచేయలేని స్థితి అద్దంకి నియోజకవర్గంలో నెలకొని వుందని, ఆయా నేతలు జగన్‌మోహన్‌రెడ్డికి వివరించినట్లు తెలుస్తుంది. ఒకసారి పోటీచేసిన అభ్యర్థి తిరిగి పోటీ చేయకపోవడం, మరో క్రొత్త అభ్యర్థి రావడం, కార్యకర్తలతో కాని, నేతలతోకాని, సంబంధాలు ఏర్పడే లోపే ఎన్నికల అయిపోవడం, ఆ అభ్యర్థి తిరిగి వెళ్ళిపోవడం, మరో క్రొత్త ఇన్‌చార్జి రావడం అద్దంకి నియోజకవర్గంలో పరిపాటిగా జరుగుతుందని, ఈ పరిస్దితి లేకుండా ముందుగానే అభ్యర్థిని ప్రకటిస్తే అటు కేడర్‌లోగాని, నేతలలోకాని, ఒక బరోసా ఏర్పడి పార్టీ కోసం పనిచేస్తారని ఆనేతలు జగన్‌దృష్టికి తీసుకెళ్ళినట్లు తెలుస్తుంది. వైవి సుబ్బారెడ్డితోమాట్లాడి త్వరలో మీకు అభ్యర్థి విషయంలో స్పష్టత ఇప్పిస్తానని, లేకపోతే బస్సు యాత్రలో స్వయంగా తానే ప్రకటిస్తానని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అద్దంకి నియోజకవర్గ నేతలకు స్పష్టం చేసినట్లు తెలుస్తుంది. ఏది ఏమైనా అద్దంకిలో ప్రస్తుతం వున్నా నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్ అభ్యర్థిత్వాన్నే ప్రకటించనున్నట్లు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతలతో మర్మగర్భంగా వెల్లడించినట్లు సమాచారం. ఏది ఏమైనా ప్రస్తుత నియోజకవర్గ ఇన్‌చార్జి పనితీరుపై పార్టీ సంతృప్తిగా వున్నట్లు సమాచారం.



## బైక్‌ల దొంగలు అరెస్టు

**- 11 బైకులు పోలీసులు స్వాధీనం - మార్కాపురం డీఎస్పీ నాగరాజు**

**పుల్లలచెరువు, డిసెంబర్ 3, ప్రభాతవార్త**
మండలంలో వరుసగా జరుగుతున్న బైక్ దొంగతనాలతో బెంబేలెత్తిన ప్రజలకు పుల్లలచెరువు పోలీసులు పెద్ద ఊరట కలిగించారు. ఏ బైక్ ఎప్పుడెప్పుడు కనిపించకుండా పోతుందో అన్న భయబ్రాంతులకు తెరదీస్తూ దర్యాప్తు ద్వారా దొంగలను చాకచక్యంగా పట్టుకుని 10 లక్షల విలువైన 11 మోటార్ బైకులను స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ నాగరాజు బుధవారం స్థానిక స్టేషన్‌లో విలేకర్ల సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల పాత చెరువు తండాకు చెందిన మూడవత్ లక్ష్మానాయక్ మోటార్ సైకిల్ బస్టాండ్‌లో దొంగిలించబడిన స్ప్లెండర్ ప్లస్ కేసును పోలీసులు సీరియస్‌గా తీసుకోవడం జరిగిందన్నారు. దీంతో వరుస దొంగతనాల గుట్టు రట్టు చేసేందుకు దారి తీసింది. సీసీ కెమెరా ఫుటేజ్, నేరస్తుల కదలికలు, కాల్ డేటా మూడు అంశాలు కలిసి పోలీసులు దొంగల వరకు చేరుకునేలా చేశాయని మార్కాపురం డీఎస్పీ నాగరాజు తలెఇపారు. మంగళవారం తెల్లవారుజామున ముటుకుల శివారులో పోలీసులు నిర్వహించిన ఆపరేషన్‌లో పల్నాడు జిల్లా గణేష్‌పాలెంకు చెందిన ఇద్దరు సోదరులు చొప్పరపు వేణు(20) చొప్పరపు సన్నీ(25) అదుపులోకి వచ్చారు. రాత్రి వేళ నిర్మానుష్య ప్రాంతాలు, గ్రామాల ధ్య రహదారులు, బస్టాండ్లను టార్గెట్ చేస్తూ బైక్‌లు ఎత్తుకెళ్లడం వీరి పద్ధతిని పోలీసులు తెలిపారు. దొంగతనం చేసిన తర్వాత నంబర్ ప్లేట్ మార్చడం, కొన్ని బైక్‌లను విడి భాగాలుగా అమ్మడం, మరికొన్నింటిని మొబైల్ ఫోన్లకు ఎక్స్ఛేంజ్ చేయడం వంటి పద్ధతులు వీరి వని విచారణలో వెల్లడైందన్నారు. పోలీసులు రికవరీలో పల్సర్, షైన్, గ్లామర్, స్ప్లెండర్, హెచ్‌ఎఫ్‌డీలక్స్ మోడళ్ల బైక్‌లు ఎక్కువగా ఉండడం గమనార్హం. పుల్లలచెరువు, యర్రగొండపాలెం, దొనకొండ, మార్కాపురం రూరల్‌తో పాటు పిడుగురాళ్ల, నాగార్జున సాగర్, కారంపూడి, పాత గుంటూరు నుంచి ఈ వాహనాలు దొంగతనానికి గురయ్యాయని ఆయన తెలిపారు. ఈ దర్యాప్తు మొత్తం యర్రగొండపాలెం సీఐ కే.అజయ్ కుమార్ పర్యవేక్షణలో సాగగా, ఎస్సై సంపత్ కుమార్ నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ రమేష్, కానిస్టేబుల్స్ అరుణ్ కుమార్, వీరాంజనేయులు, వేణు, కాశిబాబు, సత్యనారాయణ బృందం దర్యాప్తును చురుకుగా పూర్తి చేసింది. ప్రకాశం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, మార్కాపురం డీఎస్పీ నాగరాజు బృందాన్ని అభినందిస్తూ ఇటువంటి నేరాలను పూర్తిగా అణచివేయాలనే దిశగా మరింత కృషి చేయాలని సూచించారు. గ్రామాలలో గత కొంత కాలంగా రాత్రిళ్ల బైక్‌ల భద్రతపై ఉన్న భయాలు ఈ అరెస్టుతో తగ్గిపోయాయని స్థానికులు వెల్లడించారు. పోలీసుల చురుకుదనంతో ప్రభుత్వ యంత్రాంగంపై విశ్వాసం మరింత పెరిగిందని వారు అభిప్రాయపడ్డారు. ఇప్పుడు వాహనదారులు నిర్భయంగా ఉండవచ్చన్న భావన గ్రామాల్లో కనిపిస్తోంది.









## రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం

**- జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు**

**ఒంగోలు, ప్రభాతవార్త**
రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు చెప్పారు. రైతన్నా మీకోసం కార్యక్రమంలో భాగంగా బుధవారం మద్దిపాడు మండలం దొడ్డవరంలో నిర్వహించిన జిల్లా స్థాయి కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పంట ఉత్పత్తులకు అవసరమైన గిట్టుబాటు ధరలు కల్పించడంతోపాటు సాగులో నూతన పరిజ్ఞానాన్ని రైతులకు ప్రభుత్వం అందుబాటులోకి తెస్తున్నట్లు చెప్పారు. వినూత్న విధానాలతో రాబడి పెంచుకునేలా రైతులు కూడా ముందుకు రావాలని కలెక్టర్ సూచించారు. ఆయా విషయాలపై అవగాహన కల్పించేందుకే ఇలాంటి ప్రత్యేక వారోత్సవ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సాగులో రైతులకు అవసరమైన సూచనలు, సలహాలు ఇచ్చేందుకు క్షేత్రస్థాయిలో వ్యవసాయ సిబ్బంది అందుబాటులో ఉంటున్నట్లు చెప్పారు. భూమి రకం, వాతావరణ పరిస్థితులు, మార్కెటింగ్ అవకాశాలపై రైతులకు వారు అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. రైతులు, వ్యవసాయ అధికారులు సమిష్టిగా పనిచేస్తేనే ఈ రంగం మరింత అభివృద్ధి వైపు సాగుతుందని కలెక్టర్ చెప్పారు. అందుకే స్థానిక వనరులను సమర్ధంగా రైతులు వినియోగించుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, ఒంగోలు ఆర్డిఓ లక్ష్మీ ప్రసన్న, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మీనాయక్, బీసీ సంక్షేమ అధికారి నిర్మల జ్యోతి, తహసిల్దార్ ఆదిలక్ష్మి, ఇతర అధికారులు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు. ముందుగా తూర్పుగోదావరి జిల్లా నల్లజర్లలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కార్యక్రమంలో పాల్గొని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేసిన ప్రసంగాన్ని వీరంతా వీక్షించారు.



## మెగా పీటీఎంకి సిద్ధం కావాలి

**సీఎస్‌పురం, డిసెంబర్ 3, ప్రభాతవార్త**



మండలంలోని అన్ని పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు మెగా పీటీఎం కార్యక్రమం శుక్రవారం నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని మండల విద్యాశాఖ అధికారులు జే.ప్రసాద్‌రావు, రాజాల కొండారెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని ప్రధానోపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. తల్లిదండ్రులకు ఆహ్వాన పత్రికలు పంపించడం ప్రోగ్రెస్ కార్డులు నమోదు అసెస్మెంట్ పుస్తకాల మూల్యాంకనం మధ్యాహ్న భోజనం ఏర్పాట్లు వంటి అన్ని అంశాలలో సంసిద్దులుగా ఉండాలని కోరారు. ఎఫ్ఎల్ఎన్ సర్వే వెంటనే పూర్తి చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఎఫ్ఎల్ఎన్ అమలు పదో తరగతి విద్యార్థుల కోసం వంద రోజుల ప్రణాళిక తప్పకుండా అన్ని పాఠశాలల్లో ఆచరించాలన్నారు. సమావేశంలో ఎంఈఓలు జే.ప్రసాదరావు, రాజాల కొండారెడ్డి, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## సీఎం ప్రసంగాన్ని లైవ్‌లో వీక్షించిన శ్రీనివాస వర్మ

**సీఎస్‌పురం, డిసెంబర్ 3, ప్రభాతవార్త**

మండలంలోని చింతలపూడి రైతు సేవ కేంద్రంలో బుధవారం నిర్వహించిన రైతన్న మీ కోసం కార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రసంగాన్ని రైతులు, అధికారులు, కదిరి బాబురావు వ్యవసాయ ఉద్యాన కళాశాల విద్యార్థులతో కలిసి మండల సింగిల్ విండో అధ్యక్షులు చెరుకుపల్లి వెంకటరెడ్డి, ప్రముఖ పారిశ్రామిక వేత్త టీడీపీ నాయకులు శ్రీనివాస వర్మ లైవ్‌లో వీక్షించారు. కార్యక్రమంలో కదిరి బాబురావు వ్యవసాయ, ఉద్యాన కళాశాల విద్యార్థులు రైతులతో అనుభవాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా చెరుకుపల్లి వెంకటరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి తీసుకుంటున్న చర్యలను వివరించారు. ముఖ్యమంత్రి ప్రకటించిన పథకాలు, రైతు సమస్యల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. రైతు రంగాన్ని బలోపేతం చేయడంలో ప్రభుత్వ లక్ష్యాలను వివరించి ఇటువంటి కార్యక్రమాలు రైతులకు ఉపయోగకరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి పి.మధుబాబు, గ్రామ, ఉద్యాన సహాయకులు పి.రమ్య, స్థానిక రైతులు పాల్గొన్నారు.

## సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కందుల సతీమణి


**కొనకనమిట్ల, డిసెంబర్ 3, ప్రభాతవార్త**



గతంలో వివిధ ఆసుపత్రిలలో చికిత్స చేయించుకుని ఆరోగ్యం మెరుగుపడిన మండలంలోని 10 మంది లబ్దిదారులకు మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సతీమణి వసంత లక్ష్మీ, మండల టీడీపీ నాయకులతో కలిసి సీఎం సహాయనిధి కింద మంజూరైన నగదు చెక్కులను బుధవారం పంపిణీ చేశారు. నాగిరెడ్డిపల్లిలో ఇరువురికి, వద్దిమడుగులో ఇరువురికి తువ్వపాడు, వాగుమడుగు, చిన్నారికట్ల, కొనకనమిట్ల, కొత్తపల్లి, మునగపాడు, గ్రామాలకు చెందిన లబ్దిదారులకు ఒక్కొక్కరికి ఈ చెక్కులు అందజేశారు. మొత్తం రూ.5,91,554ల నగదు చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ మూరబోయిన బాబురావు, వెలుగొండ ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ కుందురు కాశిరెడ్డి, మాజీ మండల టీడీపీఅధ్యక్షులు తాతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, కనకం నరసింహారావు, నాయకులు జవ్వాజి భాషాపతి నాయుడు, బీమాంజనేయరెడ్డి, భయ్యా నాగేశ్వరరావు, పెరికే గిరి కుమార్, తెలుగు యువత కార్యదర్శి మువ్వా కాటంరాజు, పొదిలి ఏఎంసీ వైస్ చైర్మన్ పి.తిమోతి, తువ్వపాడు, అంబాపురం నీటి సంఘాల చైర్మన్లు ఎం.లక్ష్మయ్య, డి.కృష్ణారెడ్డి, రమణయ్య, పి.యల్లయ్య, త్రిపురాంతకుడు, కాశీరావు, ఆయా గ్రామాల తెలుగుదేశం కార్యకర్తలు, నాయకులు లబ్దిదారులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ

**రాచర్ల, డిసెంబర్ 3 ప్రభాతవార్త :**



అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం పురస్కరించుకుని గిద్దలూరు పట్టణానికి చెందిన భవాని మార్కెట్ షాపు యజమానులు బాలకోటయ్య, సురేష్ కుమార్ విద్యార్థులకు నోట్ పుస్తకాలు బహుకరించగా బుధవారం ప్రధానోపాధ్యాయులు విజయభాస్కర్ రెడ్డి విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాతల సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులు అధిక ఆదాయం వచ్చే పంటలు సాగు చేయాలి

**రాచర్ల డిసెంబర్ 3 ప్రభాతవార్త :**



రైతులు డిమాండ్ ఉన్న అధిక ఆదాయం వచ్చే పంటలను వేసుకోవాలని ఖరీఫ్ రబీ సీజన్ కి సంబంధించి పంటల సాగుపై ముందే ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి షేక్ మహబూబ్ బాషా తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పంటల సరళి అధిక దిగుబడిపై రైతన్న మీకోసంలో భాగంగా నిర్వహించిన లైవ్ ప్రోగ్రాంలో సంబంధిత అధికారులతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రైతు సేవ కేంద్రాల పరిధిలో పంటల సాగుపై అవగాహన కలిగి జీవిప పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాచర్ల పశువైద్యాధికారి డి హరిబాబు సంబంధిత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విభిన్న ప్రతిభావంతులలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించాలి

**కంభం, డిసెంబరు 3 ప్రభాతవార్త :**



ప్రత్యేక అవసరాలు గల పిల్లలపై జాలి చూపడంకన్నా జాగృతిపరచడం ద్వారా చిన్నారుల్లో అంతర్లీనమైవున్న ఆత్మవిశ్వాసాన్ని తట్టి లేపవచ్చని ఎంపీడీవో వీరభద్రాచారి అన్నారు. స్థానిక బోర్డు స్కూల్ భవిత కేంద్రంలో బుధవారం అంతర్జాతీయ విభిన్న ప్రతిభవంతుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వీరభద్రాచారి, ఎంఈవోలు అబ్దుల్ సత్తార్, శ్రీనివాసులు మాట్లాడుతూ సమస్యలు, సహనము, సవాళ్ళు సామాజిక సర్దుబాటు తదితర అంశాలను ఉదహరిస్తూ విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అవగాహన కలిగించారు. విభిన్న ప్రతిభావంతులైన చిన్నారులను బడి బాట పట్టించి వారి భవితకు బాసటగా నిలవాలని, సాధనతో సత్ఫలితాలను సాధించవచ్చని తెలిపారు. అనంతరం విద్యార్థులకు పలు పోటీలను నిర్వహించి విద్యార్థులకు బహుమతులను అందించారు. అనంతరం విద్యార్థులతో బారీ ర్యాలీ నిర్వహించి అందరికీ అవగాహన కలిగించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వరికుంట్ల వెంకటేశ్వర్లు, ప్రత్యేక ఉపాధ్యాయులు క్రాంతి కుమార్, అరుణ్ కుమార్, ఫిజియోథెరపిస్ట్ సంధ్య, ఖుర్షీద్ తహ్మీన్ విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## రైతును రాజును చేసేందుకే రైతన్నా మీ కోసం కార్యక్రమం

**పొన్నలూరు, డిసెంబరు 3, ప్రభాతవార్త**



రైతును రాజును చేసేందుకే రైతన్నా మీ కోసం కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిందని మండల వ్యవసాయాధికారి వి రాము అన్నారు. మండలంలోని రైతు సేవా కేంద్రాలలో బుధవారం రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. పొన్నలూరు, చెన్నిపాడు గ్రామాలలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయాధికారి రాము మాట్లాడుతూ రానున్న 5 సంవత్సరాలలో రైతును రాజుగా చేసేందుకు 5అంశాల మీద నేటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వం నుండి మద్దతు మరియు పాడి రైతులకు, ఉద్యాన పంటలకు అండగా కార్యాచరణ రూపొందించారన్నారు. గ్రామాల వారిగా, పంటల వారిగా తలసరి ఆదాయం పెంచే విధంగా ప్రణాళికలు అన్ని శాఖల అధికారులు వ్యవసాయ మరియు అనుబంధ శాఖలు రూపొందించాలని కోరారు. ఈ సందర్భంగా అన్ని రైతు సేవా కేంద్రాలలో టెలివిజన్ బ్రాడ్ కాస్ట్ ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సందేశాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా చూసే అవకాశాన్ని రైతులకు కల్పించారు. ఈ కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ అధికారి జె శివరామక్రిష్ణ, ప్రకృతి వ్యవసాయాధికారి పి మందాకిని, గ్రామ సహాయకులు షేక్ మస్తాన్, టి వెంకట నారాయణ, ప్రజా ప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమానికి కృషి చేసే ప్రభుత్వం మాది

### - వైసీపీ నాయకులు వక్రబుద్ధి మార్చుకోండి - ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి


**కొనకనమిట్ల, డిసెంబర్ 3, ప్రభాతవార్త**



రైతు సంక్షేమానికి అహర్నిశలు పాటుపడేది కూటమి ప్రభుత్వం అని వైసీపీ నాయకులు వక్రబుద్ధి మార్చుకోవాలని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. బుధవారం పొదిలి మండలంలోని ఆముదాలపల్లిలో ఏర్పాటు చేసిన రైతన్న మీ కోసం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వైసీపీ నాయకులు ప్రజల్లో కనుమరుగైపోతామన్న ఆలోచనతో సంబంధం లేని విషయాలను మాట్లాడుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం చేస్తున్న మంచి పనులు ఓర్వలేక విమర్శలు చేస్తున్నారన్నారు. రాజకీయాన్ని అడ్డం పెట్టుకుని ప్రతి చొన్న విషయాన్ని రాజకీయం చేయడం సమంజసం కాదన్నారు. గత ఐదేళ్లవైసీపీ నాయకులు ఏమైనా అభివృద్ధి చేశారా అని ప్రశ్నించారు. రైతుల ఇళ్ల ముందుకే వెళ్లి కావాల్సిన పనిముట్లు విత్తనాలు, ఎరువులు సరఫరా చేస్తున్నారని తెలిపారు. 2014లో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రైతులకు 90 శాతం సబ్సిడీపై డ్రిప్ అందజేస్తే వైసీపీ పాలనలో దాన్ని పూర్తిగా విస్మరించి పథకాన్ని తీసేశారని గుర్తు చేశారు. అదేవిధంగా పశుసంవర్ధకశాఖలో 2014, 2019 మధ్యలో 14టన్నుల గడ్డిని రైతులకు అందజేస్తే 2019, 2024 లో టన్ను కూడా అందజేయకపోవడం వారి అసమర్థ పాలనకు నిదర్శనం అన్నారు. సీఎం చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ మార్కాపురం జిల్లా చేస్తే వైసీపీ నాయకులు జిల్లా కదా అని హేళన చేయడం సరికాదన్నారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు 63రోజులు జిల్లా కోసం ఉద్యమం చేస్తుంటే అప్పుడు మాట్లాడని నాయకులు ఇప్పుడు మాట్లాడటం దొంగే దొంగ అన్నట్లుగా ఉందన్నారు. జిల్లా ప్రకటన చేసినందుకు వైసీపీ నాయకులతో సహా చంద్రబాబు నాయుడు ఫోటో ఇంట్లో పెట్టుకుని పూజించాలని ఆయన సూచించారు. తప్పుడు ప్రచారం చేసుకోవడంలో వైసీపీ ప్రభుత్వం ముందుంటుందని అందుకు నిదర్శనం వెలుగొండ ప్రాజెక్టు పూర్తి కాకుండానే జాతికి అంకితం చేశారని ప్రగల్భాలు పలకడం చూస్తే అర్ధమవుతుందని అన్నారు. కార్యక్రమంలో దర్శి ఏడీఏ బాలాజీ నాయక్, ఏవో శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ కృష్ణారెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసరావు, పశుసంవర్ధకశాఖ ఏడీఏ వేణు, ఉద్యాన అధికారి ధనలక్ష్మి, వివిధ శాఖల అధికారులు, పొదిలి ఏఎంసీ చైర్మన్ ఇమాంస, టీడీపీ నాయకులు గునుపూడి భాస్కర్, పట్టణ అధ్యక్షులు ముల్లా కుద్దూస్, మాజీ సర్పంచ్ స్వర్ణ గీత, నాయకులు మీగడ ఓబుల్‌రెడ్డి, ఎర్రంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

## తక్కెళ్ళపాడులో రైతన్న మీ కోసం వర్క్‌షాప్

**సంతనూతలపాడు, డిసెంబర్ 3, ప్రభాతవార్త**



సంతనూతలపాడు మండలంలోని పి.తక్కెళ్ళపాడు గ్రామంలో బుధవారం నాడు రైతన్న మీ కోసం వర్క్ షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంతనూతలపాడు మండల వ్యవసాయ అధికారిణి పి.పావని పాల్గొని రైతులకు పలు రంగాలపై వివరించారు. ఈ రైతన్న మీ కోసం వర్క్ షాప్‌లో భాగంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లైవ్ ఫోగ్రాంను రైతులతో కలిసి వీక్షించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి పావని మాట్లాడుతూ రైతులకు సాగు ఖర్చు తగ్గించి, ఆదాయాన్ని పెంచే విధంగా తద్వారా గ్రామ జీవీఏ(స్థూల విలువ జోడింపు) పెంచే దిశగా కార్యచరణ ప్రణాళిక గ్రామ వ్యవసాయ సహాయకులు తయారు చేయాలని ఆదేశించారు. రసాయనిక ఎరువులు వాడకం తగ్గించి, ప్రకృతి వ్యవసాయం చేసినట్లయితే వాతావరణ భూ కాలుష్యం తగ్గించవచ్చని అలాంటి ఉత్పత్తులు అధిక ధరలకు అమ్ముడయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని రైతులు సేంద్రియ వ్యవసాయం వైపు దృష్టి మరల్చాలని తెలియజేశారు. మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాలలో కూడా సీఎం లైవ్ టెలికాస్ట్ ఫోగ్రాంను రైతులకు చూపించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారిణ వివి శేషమ్మ రైతులతో మాట్లాడుతూ భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా పంటలు సాగు చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి కేవీ సుబ్బారెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకురాలు డి.వెంకట సుమ, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## దివ్యాంగ విద్యార్థులకు పోటీలు

**సంతనూతలపాడు, డిసెంబర్ 3, ప్రభాతవార్త**



సంతనూతలపాడులోని ఆంధ్ర ప్రదేశ్ గురుకుల పాఠశాల నందు బుధవారం నాడు ఘనంగా విభిన్న ప్రతిభావంతుల దినోత్సవ వేడుకల్లో భాగంగా వివిధ పోటీలున నిర్వహించారు. ముఖ్యంగా దివ్యాంగ విద్యార్థులకు క్యారమ్స్, బ్రాయింగ్ రన్నింగ్ నృత్యం పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను మాజీ జడ్పీటీసీ తన్నీరు శ్రీనివాసరావు, ఎంఈఓ డి.వెంకారెడ్డిలు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి గురుకుల పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ విక్టర్ అధ్యక్షత వహించారు. తదుపరి దివ్యాంగ విద్యార్థులను ఉద్దేశించి ఎంఈఓ వెంకారెడ్డి ప్రసంగిస్తూ దివ్యాంగులలో వివిధ రకాలైన ప్రతిభ ఉంటుందని ఆ ప్రతిభను గుర్తించి వాళ్లకు తగినటువంటి ప్రోత్సాహాన్ని ఇస్తే వారు చరిత్రలో నిలిచిపోయినటువంటి లూయిస్ బ్రెయిలీ సుధా చంద్రన్ లాగా గొప్ప వారు అవుతారని తెలియజేశారు. మాజీ జడ్పీటీసీ తన్నీరు శ్రీనివాసరావు మాట్లాడుతూ క్రికెట్లో బ్లైండ్ క్రికెటర్ కిరణ్ కుమారి గురించి చెప్తూ ఆమె తల్లిదండ్రుల ప్రోత్సాహం వల్లే మహిళా ఛాంపియన్‌షిప్ సాధించిందని గుర్తు చేశారు. గురుకుల పాఠశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ విక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు గవర్నమెంట్ ఇచ్చేటువంటి ప్రోత్సాహాలను గురించి సదుపాయాల గురించి తెలియజేస్తూ విద్యార్థులను క్రమం తప్పకుండా పాఠశాలకు పంపాల్సిందిగా తెలియజేశారు. ఎండ్లూరు వాసి ఉపాధ్యాయులు అట్లూరి రామారావు దివ్యాంగ విద్యార్ధలను ప్రోత్సహిస్తూ ఆటల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రధానం చేశారు. సంతనూతలపాడు మండల విద్యాశాఖాధికారి వారి కార్యాలయంలో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పని చేస్తున్న రమాదేవి స్వచ్ఛందంగా దివ్యాంగులకు భోజనాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్‌కే సీఎం జడ్పీ హెచ్ ఎస్ సంతనూతలపాడులో స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ ఎం.షారోన్ రాణి, ఐఆర్‌పీజీ అరుణ కుమారి, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పందిళ్ళపల్లి అయ్యప్ప పడి సేవా మహోత్సవం

**చీరాల(వేటపాలెం), డిసెంబర్ 3, ప్రభాతవార్త**



మండలంలోని పందిళ్ళపల్లి గ్రామంలో శ్రీ మణికంఠ సేవా సమితి ఆధ్వర్యంలో అయ్యప్ప పడి సేవా మహోత్సవం అత్యంత ఘనంగా జరిగింది. బుధవారం సందర్భంగా అయ్యప్ప స్వామి దేవాలయంలో గుత్తి బాల నందం(గురుస్వామి), కొండపల్లి స్థానిక నిరంజన్, గౌరబత్తిని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పడి మహోత్సవాన్ని నిర్వహించారు. ప్రత్యేకంగా తెప్పించిన పుష్పాలతో పడిని సుందరంగా అలంకరణ చేసి పూజ కార్యక్రమాలు నిర్వహించారు. యారాసు బసవేశ్వరరావు భక్త బృందం చే భక్తిశ్రద్ధలతో భజన క్యాక్రమాన్ని నిర్వహించారు. అయ్యప్ప స్వాములు అధిక సంఖ్యలో పాల్గొని శరణు ఘోషలు మధ్య ఉత్సవ మూర్తులకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి పరవశించారు. గుత్తి బాలనందం(గురుస్వామి), వీరి ధర్మపత్ని విజయ్ గౌరీ, పెద్ద కోడలు పద్మజ, మనుమరాలు కృషిత, మనుమడు శశ్రుక్ అభినవ్ అయ్యప్ప స్వాములకు బిక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రొండా శ్రీనివాసరెడ్డి, గురుస్వామి, ఎడవల్లి కోటయ్య గురుస్వామి, పసుమర్తి ఆదినారాయణ, గురుస్వామి, పులి సురేంద్ర, గురు స్వామి, కడెం జయ శంకర్, గురు స్వామి, మాచర్ల ప్రసాద్, గురుస్వామి, మెట్ల శ్రీనివాసరావు, గురుస్వామి, కోలా సాయి స్వామి, పోలకం సాంబశివ నాయుడు స్వామి, గోవన దిలీప్ స్వామి, కోలా రంజిత్ స్వామి, మామిడాల శ్రీనివాసరావు ,స్వామి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు చేయూత

**సింగరాయకొండ, డిసెంబర్ 3, ప్రభాత వార్త :**



గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల విద్యాభివృద్ధికి సమాజం చేయూత కీలకమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రీనింగ్అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ వేల్పుల సింగయ్య అన్నారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి పుట్టినరోజు సందర్భంగా బుధవారం సోమరాజుపల్లి పంచాయతీ పరిధిలోని ఐదు ప్రభుత్వ పాఠశాలల్లో ఆయన ఆధ్వర్యంలో నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మొత్తం వెయ్యి నోట్‌బుక్స్ విద్యార్థులకు అందించడంతో పాటు 300మంది విద్యార్థులకు ఆహారం పంపిణి చేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ సింగయ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్ఫూర్తిగా, మంత్రి స్వామి, దామచర్ల సత్య నాయకత్వంలో ఇటువంటి సేవా కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు. కేక్ కట్‌చేసి అందరికి అందజేశారు. కార్యక్రమంలో నాయకులు వేల్పుల వెంకట్రావు, నర్రా రాంబాబు, శీలం చంటి, వేల్పుల సుధాకర్, షేక్ నసీర్, రఫీ, ఉపాధ్యాయులు అర్రిబోయిన రాంబాబు, న్యాయవాది పంతగాని వెంకటేశ్వర్లు, అన్వర్, రాజగోపాల్, వలి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం

**బల్లికురవ, డిసెంబర్ 3, ప్రభాతవార్త**



అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం వేడుకలు బుధవారం మండలంలో ఘనంగా నిర్వహించారు. విభిన్న ప్రతిభావంతులకు పలు అంశాలపై పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారులు శ్రీనివాసరావు రమేష్‌బాబులు మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులు తమ అసమాన ప్రతిభలో అన్ని రంగాలలోనూ తమ నైపుణ్యాన్ని చాటుతున్నారని వివరించారు. ఇందుకు ఉదాహరణగా ఇటీవల భారతదేశం మహిళల అంధుల క్రికెట్ ప్రపంచ కప్ సాధించిన అంశాన్ని ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు హనుమంతరావు, స్థానిక వ్యాయామ ఉపాధ్యాయులు ఇందిరా ప్రియ తదితరులు మాట్లాడారు.

## సత్ప్రవర్తనతో మెలగాలి



**మార్టూరు, డిసెంబర్ 3, ప్రభాతవార్త**

సత్ప్రవర్తనతో మెలగాలని మార్టూరు ఎస్సై ఎం.శేషగిరిరావు తెలిపారు. బుధవారం మార్టూరులోని కళాశాలలను బాపట్ల సబ్ డివిజన్ శక్తి టీం సందర్శించింది. ఈ సందర్భంగా ఎస్సై శేషగిరిరావు మాట్లాడుతూ విద్యార్థినీ, విద్యార్థులు సైబర్ నేరాలు పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న నేరాలు, అఘాయిత్యాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై సైదా, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## రైతులకు లాభసాటి వ్యవసాయంపై అవగాహన

**పెద్దదోర్నాల, డిసెంబర్ 3, ప్రభాతవార్త**




పెద్దదోర్నాల మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాలలో రైతన్న మీ కోసం ప్రజా వేదిక నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అన్ని రైతు సేవా కేంద్రాలలో ముందుగా ముఖ్యమంత్రి సందేశాన్ని రైతులకు టీవీల ద్వారా చూపించి, రైతులకు వ్యవసాయం లాభసాటిగా కావాలంటే పంచ సూత్రాల లక్ష్యం నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వం మద్దతు గురించి రైతులకు తెలియజేయడం జరిగింది. అలాగే ప్రస్తుతం అవలంబిస్తున్న పంటల సరళి, పంటల వివరాలు, గిట్టుబాటు ధరలు, భూసార పరీక్షలు ద్వారా పంటల సాగు వివరాలు, సూక్ష్మ పోషకాల ప్రాముఖ్యత, ప్రకృతి వ్యవసాయం గురించి రైతులకు మండల వ్యవసాయాధికారి డి.జవహర్ లాల్ నాయక్ రైతులకు తెలియజేశారు. ప్రతి రైతు సేవా కేంద్రం నందు రబీ 2025-26, ఖరీఫ్ 2026 -2027 సమగ్ర కార్యచరణ ప్రణాళిక, జీవీఏ గురించి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, పశుసంవర్ధకశాఖ సహాయకులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## రైతన్న మీ కోసం వర్క్‌షాపు

**చీరాల, డిసెంబర్ 3, ప్రభాతవార్త**



చీరాల మండలంలో రైతన్న మీ కోసం వర్క్‌షాప్ అన్ని రైతు సేవా కేంద్రాల్లో జరిగింది. గనివానిపాలెం గ్రామంలో జరిగిన ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి పి.నిర్మలాదేవి మాట్లాడుతూ స్వర్ణాంధ్ర -2047 కు ఆంధ్రప్రదేశ్‌లో ప్రగతి పథంలో ముందుకు నడిపించి రైతుల తలసరి ఆదాయాన్ని పెంపొందించాలన్న లక్ష్యంతో ప్రతి ఎకరాకు సాగునీరు అందించి డిమాండ్ ఆధారిత పంటలను రైతులతో సాగు చేయించి అన్ని విధాలుగా రైతులకు భరోసా కల్పించడమే ప్రభుత్వ ఉద్దేశమని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ గోపికృష్ణ మాట్లాడుతూ పంటల విలువ పెరగాలంటే జరగాలని తెలిపారు. కాఫీ కోకోనట్, కోకోవా వంటి పంటలకు ప్రాధాన్యతనిస్తూ ఉత్పత్తులకు వాల్యూషన్ ఇస్తూ ప్రపంచ స్థాయి డిమాండ్‌ను క్రియేట్ చేస్తూ ఫుడ్ ప్రాసెసింగ్‌కు ప్రభుత్వం ప్రోత్సాహం ఇస్తుందని తెలిపారు. తోటవారిపాలెం గ్రామంలో రైతు సేవ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో చీరాల ఎంపీడీవో పాల్గొన్నారు.

## దివ్యాంగులకు ర్యాంపు ఏర్పాటు చేసిన ఎస్సై జనార్ధన్

**చీరాల(వేటపాలెం, ) డిసెంబర్ 3, ప్రభాతవార్త**



వేటపాలెం పోలీసు స్టేషన్‌లో దివ్యాంగుల కోసం ఎస్సై జనార్ధన్ ర్యాంపు ఏర్పాటు చేశారు. దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా దివ్యాంగుల సౌకర్యార్ధం ర్యాంపును బుధవారం ప్రారంభించారు. అనంతరం దివ్యాంగులకు నిత్యవసర వస్తువులను ఎస్సై అందజేశారు. మండలంలో దివ్యాంగులు ఏమైనా సమస్యలు ఎదుర్కొంటున్నా తమ దృష్టికి తీసుకురావాలని, పోలీసు శాఖ నిత్యం అందుబాటులో ఉంటుందని ఎస్సై జనార్ధన్ తెలిపారు. దివ్యాంగుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపించిన ఎస్సై జనార్ధన్‌ను పలువురు సామాజిక కార్యకర్తలు అభినందించారు. ప్రజల నుండి హర్షం వ్యక్తం అవుతుంది.

## టీడీపీ విస్తృత స్థాయిల సమావేశం

**చీరాల, డిసెంబర్ 3, ప్రభాతవార్త**



చీరాల క్యాంపు కార్యాలయంలో పట్టణ తెలుగుదేశం పార్టీ నాయకులతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించి చీరాల శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్య ఈ కార్యక్రమంలో యువ నాయకులు మద్దులూరి గౌరీ అమర్నాథ్ ఏఎంసీ చైర్మన్ కౌతరపు జనార్ధన్, చీరాల మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావు, చీరాల మున్సిపల్ వైస్ చైర్మన్ సుబ్బయ్య, మున్సిపల్ కౌన్సిలర్లు చీరాల పట్టణ అధ్యక్షులుదోగుపర్తి వెంకట సురేష్, చీరాల పట్టణ మహిళ అధ్యక్షులు దోగుపర్తి వెంకట సురేష్, చీరాల పట్టణ మహిళ అధ్యక్షురాలు దర్శి నాగేంద్రమణి, చీరాల పట్టణ బీసీ సెల్ అధ్యక్షులు వల్లెపు వేణు, యువత అధ్యక్షులు వంశీ, మైనార్టీ సెల్ అధ్యక్షులు రియాజ్, వివిధ విభాగాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## బాపట్ల - మార్కాపురం రైల్వే లైన్ సర్వే కోసం

## కేంద్ర మంత్రిని కలిసిన ఎంపీ తెన్నేటి

**చీరాల, డిసెంబర్ 3, ప్రభాతవార్త**



బాపట్ల పార్లమెంట్ సభ్యులు తెన్నేటి కృష్ణ ప్రసాద్ కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కి వినతిపత్రం సమర్పించారు. బాపట్ల- మార్కాపురం మధ్య కొత్త బ్రాడ్ - గేజ్ రైల్వే లైన్ నిర్మాణానికి సాధ్యతా అధ్యయనం, తుది స్థానం సర్వే ను తక్షణమే చేయలని ఆయన కోరారు. ఈ ప్రతిపాదిత రైల్వే లైన్ బాపట్ల, పర్చూరు, అద్దంకి, సంతనూతలపాడు మీదుగా మార్కాపురం వరకు పయనిస్తుంది. ఇది బాట్ల, ప్రకాశం జిల్లాల ప్రజల చిరకాల ఆకాంక్ష అని ఎంపీ పేర్కొన్నారు. అనేక గ్రామీణ, సెమీ అర్బన ప్రాంతాలలో ముఖ్యంగా విద్యార్థులు, రైతులు కార్మికులకు ఇది ఎంతో ఉయోగపడుతుంది. ఈ ప్రాంతం వరి, మిరప, పత్తి, పొగాకు పంటలకు ప్రధాన కేంద్రం అద్దంకి పరిసరాలలో సమృద్ధిగా ఉన్న సున్నపురాయి, ఎగుమతి స్థాయి గ్రానైట్ నిక్షేపాల భారీ రవాణాకు రైలు మార్గం ఎంతగానో దోహదపడుతుంది. రవాణా ఖర్చులను తగ్గిస్తుంది. అలాగే, తూర్పు తీరానికి, మార్కాపూర్, నంద్యాల, కర్ణాటకు మధ్య సరుకు రవాణా కోసం ఇది సమర్ధవంతమైన మార్గాన్ని సృష్టిస్తుంది. ఈ ప్రాజెక్టు ఖర్చు ప్రయోజన దృక్పథం అత్యంత అనుకూలంగా ఉందని పేర్కొంటూ ప్రజల దీర్ఘకాలిక డిమాండ్‌ను నెరవేర్చడానికి మంత్రిత్వ శాఖ తక్షణమే స్పందించాలని తెన్నేటి కృష్ణ ప్రసాద్ విజ్ఞప్తి చేశారు.

## రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తికి గాయాలు

**సంతనూతలపాడు, డిసెంబర్ 3, ప్రభాతవార్త**

సంతనూతలపాడు కేంద్రానికి సమీపంలో ఒంగోలు- కర్నూలు రహదారి పెట్రోల్ బంకు ప్రాంతంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మోటార్ సైకిలిస్టు సత్యనారాయణకు తీవ్ర గాయాలు అయ్యాయి. ఒంగోలు నుంచి చిలకపాడుకు మినీ వ్యాన్ వెళ్తుండగా ఎదురుగా సంతనూతలపాడు నుండి ఒంగోలు వైపు వెళ్తున్న మోటారు సైకిలిస్టు గుద్దుకొనితీవ్ర గాయాలు అయ్యాయి. తీవ్ర గాయాలైన సింగరాయకొండకు చెందిన మోటారు సైకిలిస్టు సత్యనారాయణను సంతనూతలపాడు పోలీసులు 108 అంబులెన్స్‌లో ఒంగోలు హాస్పిటల్‌కు తలరించారు. ఏఎస్సై వెంకటరావు, పోలీసు సిబ్బంది ప్రమాద సంఘటన ప్రాంతాన్ని పరిశీలించి తీవ్ర గాయాలకు లోనైనా సత్యనారాయణను ఒంగోలు హాస్పిటల్‌కు 108లో తరలించారు.

## కేజీబీవీలో మాక్ మెగా పీటీఎం 3.0

**దర్శి, డిసెంబర్ 3, ప్రభాతవార్త**



దర్శిలోని కేజీబీవీ పాఠశాలలో మాక్ మెగా పీటీఎం 3.0ని బుధవారం విద్యార్థినులతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ హాజరయ్యారు. మాక్ పీటీఎం జరుగుతున్న తీరును పరిశీలించారు. ఎండీఎం స్టోర్ రూమ్, కిచెన్ ఏరియా, డ్రింకింగ్ వాటర్‌ని పరిశీలించడం జరిగింది. విద్యార్థినులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకుని మంచి భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా సమగ్ర శిక్షా ఆఫీసర్ నుండి జీసీడీఓ కే.హేమలత, సెక్టోరియల్ అధికారులు ఏఎంఓ నాగేంద్ర నాయక్, ప్లానింగ్ కోఆర్డినేటర్ జ్వాలా రత్నం, ఎంఈఓ-1 కే.మాలకొండయ్య, ఎంఈఓ-2 బి.రమాదేవి, ప్రిన్సిపాల్ వై.అరుణ, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

## పట్టణంలో జలసురక్ష కార్యక్రమం

**దర్శి, డిసెంబర్ 3, ప్రభాతవార్త**




దర్శిలోని 12వ వార్డులో గల పుట్టబజార్ నందు జలసురక్ష కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నగర పాలక సంస్థ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, మార్కెట్ యార్డు చైర్మన్ దారం సుబ్బారావు నాగవేణి, టౌన్ పార్టీ అధ్యక్షులు చిన్న, వార్డు కౌన్సిలర్లు, కార్యాలయ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నారపుశెట్టి పిచ్చయ్య మాట్లాడారు. దర్శి పురపాలక సంఘ పరిధిలో జల్ సురక్ష మాసం కార్యక్రమంలో భాగంగా పర్యటిస్తున్నట్లు చెప్పారు. వార్డు నందు ప్రజల సమస్యలు తెలుసుకున్నారు.

## భవితలో విభిన్న ప్రతిభావంతుల దినోత్సవ వేడుకలు

**దర్శి, డిసెంబర్ 3, ప్రభాతవార్త**



స్థానిక మండల భవిత కేంద్రంలో ఘనంగా విభిన్న ప్రతిభావంతుల దినోత్సవ వేడుకలు బుధవారం జరిగాయి. ఈ కార్యక్రమంలో జిల్లా ఐఈ కోఆర్డినేటర్ పి.నాగేంద్ర నాయక్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ దివ్యాంగులకు ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలు, వసతుల గురించి అదే విధంగా మండల విద్యాశాఖ అధికారులు కే.మాలకొండయ్య, వి.రమాదేవిలు మాట్లాడుతూ భవిత కేంద్రంలో ఉన్న అవకాశాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆటపాటల్లో గెలిచినటువంటి విద్యార్థులకు సాంస్కృతి కార్యక్రమాల్లో గెలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల స్పెషల్ ఎడ్యుకేటర్ యాదగిరి ఆంజనేయులు, ఐఆర్పీ ఉల్లి గురువర్ధన్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## నేడు విద్యాసంస్థలు బంద్ - ఎస్ఎఫ్ఐ పిలుపు

**దర్శి, డిసెంబర్ 3, ప్రభాతవార్త**



మార్కాపురం మెడికల్ కాలేజీ ప్రభుత్వం ఆధ్వర్యంలోనే నిర్మించాలని, జిల్లా యూనివర్సిటీ, ట్రిబుల్ ఐటీ నిర్మాణాలు తక్షణమే ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ జిల్లా వ్యాప్తంగా విద్యాసంస్థలు బంద్‌కు పిలుపునివ్వడం జరిగింది. ప్రకాశం జిల్లాకు కేటాయించిన యూనివర్సిటీ, ట్రిబుల్ ఐటీ, దర్శి, యర్రగొండపాలెం మోడల్ డిగ్రీ కాలేజీల నిర్మాణం చేపట్టాలి. అర్హులైన విద్యార్థులందరికి షరతులు లేకుండా తల్లికి వందనం ఇవ్వాలి. పెండింగ్లో ఉన్న ఫీజు బకాయిలు విడుదల చేయాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ నాయకులు దర్శిలోని విద్యాసంస్థలకు బంద్ నోటీసులు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కే.విజయ్, దర్శి ఎస్ఎఫ్ఐ నాయకులు అభిజిత్, నాని తదితరులు పాల్గొన్నారు.

## త్యాగాల పుట్ట దర్శి గడ్డ

**దర్శి, డిసెంబర్ 3, ప్రభాతవార్త**



వేరే ప్రాంతాల నుంచి వచ్చిన నాయకులను కూడా ఆదరిస్తాం, మాకు సమస్యలు తీర్చలేకపోయినా గాని అధికార పార్టీ ప్రతిపక్ష పార్టీకి కేవలం ఓట్ల రాజకీయాలు తప్పితే ప్రజల సమస్యల మీద ఏ మాత్రం ఆలోచన లేదు. కాంగ్రెస్ పార్టీ కైపు వెంకటకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో తాళ్లూరు, ముండ్లమూరు, దర్శి మండలాలను ప్రకాశం జిల్లాలో కొనసాగించాలని చేసిన సంతకాల సేకరణ అధికారులు కలవడం కలెక్టర్లను కలవడం మా వంతు అయింది. కానీ నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం సంబరాలు దేని కోసం. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మరో ముందడుగు దొనకొండ, కురిచేడు మండలాలలో సంతకాల సేకరణ ప్రజల అభిప్రాయాలు తెలుసుకొని కలెక్టర్‌కి అందజేయబోతున్నామని అన్నారు. నియోజకవర్గంలో దొనకొండ, కురిచేడు మండలాల కోసం పోరాటాలు చేస్తామన్నారు.

## జగతిశ్రీ తపస్విగా నామకరణం చేసిన వైఎస్ జగన్

**దర్శి, డిసెంబర్ 3, ప్రభాతవార్త**



దర్శి పట్టణానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం జోనల్ ప్రెసిడెంట్ దుగ్గిరెడ్డి నారాయణ రెడ్డి సౌమ్య దంపతుల కుమార్తెకు చిన్నారికి జగతిశ్రీ తపస్విగా నామకరణ చేసిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. ఈ సందర్భంగా జగన్ తోటి దుగ్గిరెడ్డి కుటుంబ సభ్యులు సెల్ఫీ దిగారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ నాయకులువ ఆల్గొన్నారు.

## 50 పడకల కమ్యూనిటీ ప్రభుత్వ వైద్యశాల నిర్మాణం చేయండి

**నాగులుప్పలపాడు, డిసెంబర్ 3, ప్రభాతవార్త**



మండలంలోని ఉప్పుగుండూరులో కమ్యూనిటీ ప్రభుత్వ 50 పడకల వైద్యశాలను సత్వరమే మంజూరు చేయించి నిర్మాణ పనులను త్వరితగతిన చేపట్టాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లుకి బుధవారం ఒంగోలులో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఉప్పుగుండూరు గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కనగాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆయనకు వినతిపత్రాన్ని అందజేశారు. కమ్యూనిటీ ప్రభుత్వ వైద్యశాల నిర్మాణం చేపట్టాలని ఉప్పుగుండూరు గ్రామ ప్రజలతో పాటు పరిసర ప్రాంత గ్రామాల ప్రజలు చిరకాల కోరిక స్థానిక శాసనసభ్యులు బీఎన్ విజయ్ కుమార్ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని దీనిపై ఎమ్మెల్యే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి లెటర్ పంపించడం దీని ఆధారంగా జిల్లా వైద్య శాఖ అధికారి ఆధ్వర్యంలో గత వారం ఆ స్థలం పరిశీలన చేపట్టడం, ఇప్పటి వరకు వైద్యశాల కొరకు జరిగిన అంశాలను ఆయనకు తెలియజేశారు. కమ్యూనిటీ వైద్యశాల నిర్మాణం వేగవంతంగా జరిగేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ హెల్త్ సూపర్‌వైజర్ ఏఎల్ నాగేశ్వరరావు, సొసైటీ డైరెక్టర్ ముసిముక్కు భాస్కరరావు, టీడీపీ నేతలు జంజనం వెంకట సుబ్బయ్య, ఉప్పుగుండూరు లక్ష్మీనారాయణ, తెలుగతోటి సుబ్బయ్య పాల్గొన్నారు.

## రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**తాళ్లూరు, డిసెంబర్ 3, ప్రభాతవార్త :**



రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా పనిచేస్తుందని వ్యవసాయ శాఖ ఇన్‌చార్జ్ విస్తరణ అధికారి దుద్దుకూరి శ్రీను అన్నారు. బుధవారం మండలంలోని బొద్దికూరపాడు రైతు సేవా కేంద్రంలో రైతన్న మీకోసం వర్క్ షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వ్యవసాయం కోసం ఇచ్చిన సందేశాన్ని టెలివిజన్లో వినిపించారు. ఈ సందర్భంగా నేడు రైతుల భద్రత, పంట డిమాండ్, ఆధారిత పంటలను సాగు చేయడం, వ్యవసాయంలో యాంత్రీకరణ విధానం, పండించిన పంటకు విలువ జత చేయడం, ప్రభుత్వం ద్వారా వివిధ పథకాల ద్వారా రైతులకు లబ్ది చేకూర్చడం, పంచ సూత్రాలను వివరించారు. అలాగే మూడు సీజన్లకు సంబంధించి ప్రణాళికలను సిద్ధం చేశారు. అన్ని రకాల పంటలకు అవసరమైన సూచనలు సలహాలు రైతులకు అందజేశారు. ఉప సర్పంచ్ పులి ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ 2019 సంవత్సరములో పొలం ఆన్‌లైన్‌లో నమోదైన రైతులకు పీఎం కిసాన్ పథకం గుర్తింపు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మందా శ్యాంసన్, నాయకులు పోలం రెడ్డి రమణారెడ్డి, చిన్న నాగిరెడ్డి, వెటర్నరీ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే ఉగ్రని కలిసిన శ్రీ చైతన్య సంస్థ ప్రతినిధులు

**కనిగిరి, డిసెంబర్ 3, ప్రభాతవార్త**



కనిగిరి అమరావతి ఆఫీస్‌లో బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డిని శ్రీ చైతన్య టెక్నో స్కూల్ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. గుంటూరు నుంచి వచ్చిన సంస్థ ఏజీఎం అంజయ్య, ఆర్ఐ అనిల్ కుమార్ ఎమ్మెల్యేతో భేటీ అయ్యారు. ఈ సందర్భంలో పీఏసీఎస్ చైర్మన్ అద్దంకి రంగబాబు, ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయ బృందం, స్థానిక మిత్రులు చినబాబు, మునీర్ తదితరులు పాల్గొని ఎమ్మెల్యేతో శుభాకాంక్షలు పంచుకున్నారు. భేటీ సందర్భంగా విద్యా అభివృద్ధి, పాఠశాలల పనితీరు, భవిష్యత్తు కార్యక్రమాలపై ప్రతినిధులతో ఎమ్మెల్యేతో చర్చించినట్లు తెలిసింది.

## ఆరోగ్యం ముఖ్యం.. బ్రహ్మారెడ్డికి దద్దాల పరామర్శ

**కనిగిరి, డిసెంబర్ 3, ప్రభాతవార్త**



మాచవరం 6వ వార్డులో షుగర్, బీపీ కారణంగా అనారోగ్యంతో ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న కాసు బ్రహ్మారెడ్డిని బుధవారం వైఎస్సార్‌సీపీ కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ పరామర్శించారు. బ్రహ్మారెడ్డి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న దద్దాల, వైద్యుల సూచనలు పాటించాలని, ఆహార నియమాలు, విశ్రాంతికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్, సూరసాని నరసారెడ్డి, సూరసాని రాజబాబు, సూరసాని చంద్రశేఖర్‌రెడ్డి, బాపట్ల కొండలరావు, కాసుల బాల గురవయ్య, యనమల గోవిందరెడ్డి, కాసు సుబ్బారెడ్డి, సిరుప గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు మేలు చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

### - ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి

**పామూరు, డిసెంబర్ 3, ప్రభాతవార్త**



పామూరు మండలం వగ్గంపల్లి గ్రామంలో బుధవారం రైతన్న మీ కోసం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాల ద్వారా నగదు లబ్ధి పొందిన రైతులను కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి నేరుగా కలుసుకుని వారి పరిస్థితులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి తీసుకొస్తున్న పథకాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. రైతులు ఏ పథకాన్ని ఎలా వినియోగించుకోవాలి, అందుబాటులో ఉన్న సౌకర్యాలు ఏమిటన్న విషయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కనిగిరి వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ పాలపర్తి వెంకటేశ్వర్లు కూడా రైతులకు పథకాల ప్రాముఖ్యతను వివరించారు. రైతుల అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అన్నదాతలకు తోడుగా ప్రభుత్వం ఎల్లప్పుడు నిలుస్తుందని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి ఏడీఏ షేక్ జైనులాబ్దిన్, కనిగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పాలపర్తి వెంకటేశ్వర్లు, గ్రామ సర్పంచ్ సుబ్బయ్య, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు బొల్లా నరసింహారావు, సింగిల్ విండో చైర్మన్ ఉప్పలపాటి హరిబాబు, పామూరు టౌన్ ఉపాధ్యక్షులు ఇర్రి కోటిరెడ్డి, కనిగిరి నియోజకవర్గ మాజీ యువత అధ్యక్షులు తడికమళ్ళ సుబ్బారావు, బీజేపీ పార్టీ నాయకులు కొండిశెట్టి రమణయ్య, అధికారులు, మండల తహసీల్దార్ రామచంద్రుని వాసుదేవరావు, ఎంపీడీవో ఎల్.బ్రహ్మయ్య, తెలుగుదేశం పార్టీ మహిళా నేతలు రజియా సయ్యద్, షేక్ మస్తాన్ బి, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, స్థానిక రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ దివ్యాంగుల దినోత్సవ వేడుకలు

**పుల్లలచెరువు, డిసెంబర్ 3, ప్రభాతవార్త**



మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రం నందు బుధవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడకలు మండల విద్యాశాఖ అధికారుల ఆధ్వర్యంలో భవిత కేంద్రం ఐఈఆర్‌పీ రంజిత్ నిర్వహించారు. అనంతపురం దివ్యాంగ విద్యార్థులకు ఆటల పోటీలు డ్రాయింగ్ వంటి పోటీలు నిర్వహించి బహుమతులు ప్రధానం చేశారు. ఈ సమావేశంలో ఎంఈఓ ఎవీ భాస్కర్ మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థుల హక్కులు ప్రభుత్వ సదుపాయాలను గురించి వివరించారు. అదే విధంగా దివ్యాంగ విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు ప్రభుత్వం కల్పిస్తున్న వివిధ రాయితీలు సౌకర్యాలు వినియోగించుకోవాలని ఆయన తెలిపారు. అలాగే దివ్యాంగ విద్యార్థులను క్రమం తప్పకుండా భవిత కేంద్రానికి హాజరయ్యే విధంగా చూడాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడివరం ఎంపీయుపీఎస్ స్కూల్ అసిస్టెంట్ రూపుల్ నాయక్ దివ్యాంగ విద్యార్థులకు, తల్లిదండ్రులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. అలాగే పుల్లలచెరువు ఎంఆర్సీ సిబ్బంది డేటా ఎంట్రీ ఆపరేటర్ సుబ్బారెడ్డి సహకారంతో దివ్యాంగ విద్యార్థులకు పలు బహుమతులు స్పాన్సర్ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంజే ఇందిరా ప్రసాద్, ఐఈఆర్‌పీ రంజిత్, స్పెషల్ సోమ్లా నాయక్, నరసింహారావు, ఎంఆర్సీ సిబ్బంది సత్యం, సుబ్బారెడ్డి, ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ అంకారావు, దివ్యాంగ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించాలి: ఎంఈఓ-2 రమణయ్య

**హనుమంతునిపాడు, డిసెంబర్ 3, ప్రభాతవార్త**



మండల కేంద్రమైన హనుమంతునిపాడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నందు భవిత కేంద్రంలో బుధవారం ఎంఈఓ-2 ఎస్.రమణయ్య అధ్యక్షతన ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. అదే విధంగా భవిత కేంద్రం నందు జరుగు సేవల గురించి వివరించారు. అనంతరం దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీలో విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాలి వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, పాఠశాల సిబ్బంది, భవిత కేంద్రం సిబ్బంది, పిల్లల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## అనకర్లపూడిలో రైతన్న మీకోసం గ్రామసభ

**కొండపి, ప్రభాతవార్త**



ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రైతన్న మీకోసం కార్యక్రమం మండలంలోని అనకార్లపూడి గ్రామం రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయ అధికారి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి సింగరాయకొండ ఏ డి ఏ నిర్మల కుమారి హాజరై రైతన్న ఉద్దేశించి మాట్లాడారు. నీటిభద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ప్రాసెసింగ్, ప్రభుత్వపథలు అదేవిధంగా ప్రత్యమన్యాయ పంటలు గురించి తెలియజేశారు . తెల్ల బర్లి పొగాకు సాగు చేసే రైతులు ఎవరైనా ఉన్న యెడల కంపెనీ వాళ్ళతో ఒప్పధం ఉన్న వాళ్ళు మాత్రమే సాగు చేసుకోవాలని తెలియజేశారు. వ్యవసాయ అధికారి మాట్లాడుతూ ప్రతి గ్రామంలో రైతులు వ్యవసాయ మరియు అనుబంధ శాఖల నుంచి ప్రభుత్వం వారు అందించే అన్ని పథకాలను వినియోగించుకొని రైతులు తమ తలసరి ఆదాయాన్ని పెంచుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమం తాసిల్దార్ శ్రీనివాసరావు ఎంపీడీవో రామాంజనేయుల ఏ ఈ ఓ పి . కుమార గ్రామ రైతులు పాల్గొన్నారు.

## ఈ నెల 9న ద్విచక్ర వాహనం బహిరంగ వేలం

**సింగరాయకొండ, డిసెంబర్ 3, ప్రభాతవార్త :**

సింగరాయకొండ ప్రోహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని కేసులో జప్తు చేసిన హీరో హోండా సీబీజెడ్ ఎక్స్‌ట్రీమ్ (ఏపి 07 బిఏఫ్ 5660) ద్విచక్ర వాహనాన్ని ఈ నెల 9న బహిరంగ వేలం ద్వారా విక్రయించనున్నట్లు ఎక్సైజ్ సీఐ ఎం శివకుమారి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఒంగోలు ప్రోహిబిషన్ మరియు ఎక్సైజ్ ఆఫీసర్ ఆధ్వర్యంలో వేలం పాట జరగనుందని ఆమె అన్నారు. ఈ వేలంలో పాల్గొనదలచిన వారు ప్రభుత్వం నిర్ణయించిన ధరలో 10 శాతం దరావత్తుగా చెల్లించాలి. మిగతా వివరాల కోసం ఎక్సైజ్ ప్రోహిబిషన్ స్టేషన్ నోటిస్‌బోర్డును సంప్రదించాలని సూచించారు. ఆసక్తి ఉన్న వారు వేలంలో పాల్గొనవచ్చని సీఐ తెలిపారు.

## సీఎం సందేశాన్ని వీక్షించిన మండల పార్టీ అధ్యక్షులు సానికొమ్ము

**హనుమంతునిపాడు, డిసెంబర్ 3, ప్రభాతవార్త**



హనుమంతునిపాడు మండలం తిమ్మారెడ్డిపల్లి రైతు సేవా కేంద్రంలో రైతన్న మీ కోసం కార్యక్రమంలో భాగంగా బుధవారం ఎమ్మెల్యే డ్టార్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశానుసారం రైతులతో కలిసి సీఎం చంద్రబాబు లైవ్ ఫోగ్రాంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు సానికొమ్ము తిరుపతిరెడ్డి పాల్గొని సీఎం సందేశాన్ని వీక్షించారు. ఆయనతో పాటు సర్పంచ్ కూడలి అరుణ దశరథ, మండల యూనిట్ ఇన్‌చార్జి దేవిరెడ్డి రాజారారెడ్డి, నీటి సంఘం అధ్యక్షులు ముక్కు శ్రీనివాసరెడ్డి, మండల కార్యనిర్వాహకకార్యదర్శి చీకటి వెంకట సుబ్బయ్య, మండల వ్యవసాయ శాఖ అధికారి వి.రవికుమార్, వీఏఓ నవ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచ్ వెంకటేశ్వరరెడ్డి పెద్దకర్మకు హాజరైన ఎమ్మెల్యే తాటిపర్తి

**యర్రగొండపాలెం, డిసెంబర్ 3, ప్రభాతవార్త**



యర్రగొండపాలెం మండలం మొగళ్ళపల్లి గ్రామ సర్పంచ్, వైసీపీ నాయకులు కర్నాటి వెంకటేశ్వరరెడ్డి ఇటీవలే మరణించిన విషయం తెలిసిందే. కర్నాటి వెంకటేశ్వరరెడ్డి పెద్దకర్మ మంగళవారం రోజు మొగళ్ళపల్లె గ్రామంలో జరిగింది. యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ పార్టీ శ్రేణులతో కలిసి హాజరయ్యారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు ఏకుల ముసలారెడ్డి, గంజీవారిపల్లె సర్పంచ్ సుబ్బారెడ్డి, తమ్మడపల్లె సర్పంచ్ గంగపాలెం సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

## రైతన్న నీ కోసం గ్రామ సభలో పాల్గొన్న ఎరిక్షన్‌బాబు

**యర్రగొండపాలెం, డిసెంబర్ 3, ప్రభాతవార్త**



యర్రగొండపాలెం పట్టణంలోని రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయాధికారులు నిర్వహించిన రైతన్న నీ కోసం గ్రామ సభ కార్యక్రమంలో యర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాల్గొన్న ప్రత్యక్ష ప్రసారాన్ని పార్టీ శ్రేణులతో కలిసి వీక్షించారు. అనంతరం ఎరిక్షన్ బాబు మాట్లాడుతూ రైతులకు పంటల గిట్టుబాటు విషయంలో కూటమి ప్రభుత్వం ఎప్పుడు రైతులకు అండగా ఉంటుందని అన్నారు. నూతన ఒరవడికలతో టెక్నాలజీని కూటమి ప్రభుత్వం రైతులకు పరిచయం చేసి అధిక లాభార్జనకు సాయపడుతుందని తెలిపారు. తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన రైతులను కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ ఏడీ, ఏవో, ఎంపీడీవోలతో పాటు మార్కెట్ యార్డు చైర్మన్ చేకూరి సుబ్బారావు, టీడీపీ మండల అధ్యక్షులు చిట్యాల వెంగళ్‌రెడ్డి, తెలుగు యువత నాయకులు వేగినాటి శ్రీనివాస్, వ్యవసాయ శాఖ సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## డీఆర్‌డీఏ, వెలుగు సిబ్బంది సమీక్ష సమావేశంలో పాల్గొన్న ఎరిక్షన్‌బాబు

**యర్రగొండపాలెం, డిసెంబర్ 3, ప్రభాతవార్త**



యర్రగొండపాలెం పట్టణంలోని అంబేద్కర్ ఆడిటోరియంలో డీఆర్‌డీఏ-వెలుగు శాఖల ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశానికి యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. డీఆర్‌డీఏ పీడీ నారాయణ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఐదు మండలాల సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ నియోజకవర్గంలోని పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు వెలుగు పరిధిలో అందించే వడ్డీ లేని రుణాలను అందజేసి వారి అభివృద్ధికి పాటు పడాలని కోరారు. ప్రతి ఒక్కరికి రుణాలు అందేలా చూడాలని వెలుగు సిబ్బందిని ఆదేశించారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వం పథకాలను ప్రజలకు తెలియజేసేలా గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా డీఆర్‌డీఏ పీడీ టి.నారాయణ, వెలుగు అధికారులతో పాటు ఏఎంసీ చైర్మన్ చేకూరి సుబ్బారావు, మండల పార్టీ అధ్యక్షులు చిట్యాల వెంకటేశ్వరరెడ్డి, తెలుగు యువత నాయకులు వేగినాటి శ్రీనివాస్, మాజీ ఎంపీపీ మంత్రు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## వికలాంగులకు నిత్యవసర సరుకులు పంపిణీ

**యర్రగొండపాలెం, డిసెంబర్ 3, ప్రభాతవార్త**



యర్రగొండపాలెం పట్టణంలోని ముస్లిం యూత్ సొసైటీ ఆధ్వర్యంలో అంకారావు జ్ఞాపకార్థం వారి కుమారుల సహకారంతో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకుని ఉచిత నిత్యవసర సరుకుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ ఇస్మాయిల్ వికలాంగుల హక్కుల పోరాట సమితిలోని పలువురు వికలాంగులకు నిత్యవసర సరుకులను అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఇస్మాయిల్ మాట్లాడుతూ సమాజంలో తోటి వారికి సహాయం చేయడంలో అంకారావు కుమారులు ముందు ఉంటారని కొనియాడారు. ఈనాటి కార్యక్రమం వారి సహకారంతో నిర్వహించడం చాలా అభినందనీయమని కొనియాడారు. అలాగే దివ్యాంగులు శారీరకంగా వికలాంగులే కానీ మానసికంగా కాదు అని అన్నారు. ఎంతో మంది వికలాంగులు అధైర్యం చెందకుండా మానసిక ధైర్యంతో జీవిస్తున్నారని అలాంటి వారికి మన వంతుగా కూసింత సహాయ సహకారాలు అందజేయాలని పిలుపునిచ్చారు. ముస్లిం యూత్ సొసైటీ తరుపున తమ వంతుగా పేదలకు సహాయం చేయూత అందిస్తునే ఉన్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి నియోజకవర్గ అధ్యక్షులు పాలంకయ్య, సొసైటీ సభ్యులు షేక్ సత్తార్, షేక్ చోటు, పిచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భవిత కేంద్రంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవ వేడుకలు

**జరుగుమల్లి, డిసెంబర్ 3, ప్రభాతవార్త**



ప్రపంచ దివ్యాంగుల దినోత్సవ వేడుకలు జరుగుమల్లిలో భవిత కేంద్రం నందు ప్రపంచ దివ్యాంగుల దినోత్సవ వేడుకలు ఎంతో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలు మండల విద్యాశాఖాధికారి ఆధ్వర్యంలో భవిత కేంద్రం ఐఆర్‌పీ నరసయ్య, స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ బి.నర్సింగరావు నిర్వహించారు. దివ్యాంగ దివ్యాంగ విద్యార్థులకు ఆట పోటీలు నిర్వహించి బహుమతులు ప్రధానం చేశారు. ఈ సమావేశంలో జరుగుమల్లి ఉన్నత పాఠశాలకు చెందిన ప్రత్యేక ఉపాధ్యాయులు పాల్గొని దివ్యాంగ విద్యార్థులకు గల హక్కులు ప్రభుత్వ సదుపాయాలను గురించి వివరించారు. అలాగే దివ్యాంగ విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు ప్రభుత్వం కల్పిస్తున్న వివిధ రాయితీలు సౌకర్యాల గురించి వివరించారు. ఎంఈఓ నాగేంద్ర వధన్ భవిత సెంటర్ నందు ప్రభుత్వం కల్పిస్తున్న ఫిజియోథెరపి స్పీచ్ థెరపీ వంటి సౌకర్యాలను ఉపయోగించుకుని విద్యార్థుల ఉన్నతి కోసం తల్లిదండ్రులు ఉపాధ్యాయులు సహకరించాల్సిందిగా కోరారు. అలాగే విద్యార్థులను క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యే విధంగా చూడాలని సూచించారు. సమావేశానికి ఐఈఆర్‌పీ నరసయ్య, ఎ్పషల్ ఎడ్యుకేషన్ టీచర్ అయినటువంటి బి.నర్సింగరావు, మండల విద్యాశాఖ అధికారి నాగేంద్ర వదన్, శ్రీనివాసరావు హాజరయ్యారు.

## ఇంటి పన్ను ఆన్‌లైన్ విధానం ద్వారా చెల్లింపుపై అవగాహన

**జరుగుమల్లి, డిసెంబర్ 3, ప్రభాతవార్త**



మండల పరిధిలోని చింతలపాలెం గ్రామంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం జిల్లా పంచాయతీ అధికారి ఎం.వెంకటేశ్వరరావు గురువారం సందర్శించారు. ఈ సంద్భంగా ఆయన పంచాయతీ సిబ్బందికి ముఖ్య సూచనలు ప్రతి ఇంటి పన్ను ఆన్‌లైన్ విధానం ద్వారా, ముఖ్యంగా క్యూఆర్ కోడ్ ద్వారా చెల్లించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పారదర్శక వసూళ్లతో గ్రామ పంచాయతీ ఆదాయ వనరులు పెరిగి, అభివృద్ధి వేగవంతమవుతుందన్నారు. ఇంటి పన్ను వసూళ్ల ప్రచారంలో భాగంగా ప్రధాన వీధుల్లో స్టిక్కర్లు అతికించడం ద్వారా ఇంటి పన్ను వసూళ్లు పురోగతి వేగవంతం అవుతాయని అధికారులను ఆదేశించారు. పన్ను వసూళ్ల పురోగతిని ప్రతి రోజు నివేదిక సమర్పించాల్సిందిగా ఆదేశించారు.

ong-8_ong-8.qxd 12/4/2025 12:52 AM Page 1



## ఘనంగా హనుమత్ పూర్ణాహుతి హోమం

### - ఘనంగా మాలధారుల విరమణ కార్యక్రమం

**అద్దంకి, డిసెంబరు 3, ప్రభాతవార్త**



ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన సింగరకొండలోని శ్రీ ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో హనుమత్ వ్రతం పూర్ణాహుతి హోమం జరిగింది. ఈ సందర్భంగా మాల ధారణ చేసిన 250మంది భక్తులు మాల వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. వేయ్యిమందికి అన్నదాన కార్యక్రమం కూడ నిర్వహించారు. బల్లికురవ మండలం కొండాయపాలెం గ్రామానికి చెందిన ధూళిపాళ్ళ గోవిందు భక్తులకు అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పాలకమండలి చైర్మన్ చుండూరి మురళీ సుధాకరరావు ఆధ్వర్యంలో అంగరంగవైభవంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాలలో పాలకమండలి చైర్మన్ దంపతులు, పాలకమండలి సభ్యులు నూతి ప్రసాద్, బత్తుల చంద్రశేఖర్, నాగమ్మ, వెంటకనారాయణమ్మ, ఆకుల కోటేశ్వరమ్మతోపాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## గోశాలకు దాణా వితరణ

**అద్దంకి, డిసెంబరు 3, ప్రభాతవార్త :**



రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ అద్దంకి వారి ఆధ్వర్యంలో రోటరీ సభ్యులు, మిత్రుల సౌజన్యంతో హరిహర గోశాలకు 9వేల విలువ కలిగిన దానాను వితరణగా అందజేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్ష, కార్యదర్శులు బాచిన శివధర పూర్ణచంద్రరావు, అళహరి హరిబాబు, యు. రామకోటేశ్వరరావు, పి.రామకోటేశ్వరరావు, చుండూరి మురళీ సుధాకరరావు, సుబ్రమణ్యం, ఆంజనేయులు, చప్పిడి వీరయ్య, చిన్ని మురళీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం

**అద్దంకి, డిసెంబరు 3, ప్రభాతవార్త :**



స్థానిక బంగ్లారోడ్డులో అద్దంకి నియోజకవర్గంలోని దివ్యాంగ సోదరుల మధ్య అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా కేక్ కట్‌చేశారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం దివ్యాంగులకు 6వేలు పెన్షన్ అందజేయడం పట్ల, రాష్ట్ర విద్యుత్‌శాఖమంత్రి గొట్టిపాటి రవికుమార్ 130మంది దివ్యాంగులకు మూడు చక్రాల మోటార్ సైకిళ్ళను ఉచితంగా అందజేయడం పట్ల వీరు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బదిరుల పాఠవాల ప్రిన్సిపాల్ సురేంద్రబాబు, రమేష్, రామకృష్ణారెడ్డి, ఉస్మాన్, శ్రీనివాసరావు, శేషారావు, రాంబాబు, భద్రయ్య, ధనలక్ష్మి,జి.శ్రీనివాస రావుతోపాటు దివ్యాంగుల అధికసంఖ్యలో పాల్గొన్నారు.

## మణికేశ్వరం ముంపు వాసులకు ఇళ్ళస్థలాలు కేటాయించాలి

### - మంత్రికి గ్రామస్థులు వినతి

**అద్దంకి, డిసెంబరు 3, ప్రభాతవార్త :**



గుండ్లకమ్మ ప్రాజెక్టు ముంపు గ్రామమైన మణికేశ్వరం గ్రామంలోని ఎస్.సి. కాలనీకి చెందిన 400మంది, 70మంది ముస్లింలకు నివేశన స్థలాల పంపిణీ కొరకు భూసేకరణ పనులను వేగవంతం చేయాలని ఆ గ్రామానికి చెందిన పలువురు మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు విజ్ఞప్తి చేశారు. యర్రబాలెంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో పలువురు మంత్రికి వినతి పత్రం అందజేశారు. మంత్రిని కలిసిన వారిలో కరిముల్లా, రవీంద్ర, ప్రసాద్ తదితరులు వున్నారు.

## పలు ఆలయాలకు సిజిఎఫ్ నిధులు మంజూరు

**అద్దంకి, డిసెంబరు 3, ప్రభాతవార్త :**

నియోజకవర్గంలోని పలు ఆలయాలకు సిజిఎఫ్ నిధులు మంజూరైనట్లు రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ వెల్లడించారు. అద్దంకి మండలం ధర్మవరం గ్రామంలో శ్రీభీమేశ్వరస్వామి దేవస్థానానికి 53.33లక్షలు, రాళ్ళపల్లి శ్రీవీరాంజనేయ స్వామి దేవస్థానానికి 33.33లక్షలు, నాగులపాడు వేణుగోపాల స్వామి దేవస్థానానికి 26.67లక్షలు, బల్లికురవ గ్రామం శ్రీరాములవారి, శ్రీఆంజనేయస్వామి దేవస్థానానికి కోటి రూపాయలు, జె.పంగులూరు రేణింగవరం శ్రీమూలస్థానేశ్వర స్వామి దేవస్థానానికి 72లక్షలు, సంతమాగులూరు మండలం కుందుర్రు శ్రీభ్రమరాంభ మల్లేశ్వరస్వామి దేవస్థానానికి 116.67కోట్లు, సిజిఎఫ్ నిధులు మంజూరు అయినట్లు వీటికి గ్రామస్థులు విరాళం అదనమని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

**రెండు ఆలయాలకు దూప,దీప నైవేద్యలకు నిధులు మంజూరు ::**

జె.పంగులూరు మండలం, తక్కెళ్ళపాడు శ్రీపోలేరమ్మ అమ్మవారు దేవస్థానానికి, అద్దంకి మండలం ఉప్పలపాడులోని శ్రీరేణుకాదేవి దేవస్థానంలకు ధూప,దీప నైవేద్య కార్యక్రమాల నిర్వహణ కొరకు, రచక సేవలు నిర్వహిస్తున్న అర్చకులకు ఆర్ధిక స్వావలంభన కొరకు 10వేల రూపాయలను ఒక్కొక్క ఆలయానికి మంజూరు చేసినట్లు వెల్లడించారు.

## భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా పంటలు సాగు చేయాలి

**దొనకొండ, డిసెంబరు 3 ప్రభాతవార్త :**



రైతులు భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా పంటలు సాగు చేయాలని దర్శి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త రమేష్ సూచించారు. దొనకొండ మండలంలోని చందవరం గ్రామంలో బుధవారం జరిగిన రైతన్న మీకోసం వర్క్ షాప్‌లో ఆయనతో పాటు దర్శి సబ్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు కే బాలాజీ నాయక్ పాల్గొని రైతన్న మీకోసం వర్క్ షాప్‌లో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లైవ్ ప్రోగ్రాంను రైతులతో కలసి వీక్షి ంచారు. ఈ సందర్భంగా ఏడిఏ బాలాజీ నాయక్, దర్శి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త రమేష్‌లు మాట్లాడుతూ రైతులకు సాగు ఖర్చు తగ్గించి, ఆదాయాన్ని పెంచే విధంగా తద్వారా గ్రామ జివిఏ (స్థూల విలువ జోడింపు) పెంచే దిశగా కార్యాచరణ ప్రణాళిక గ్రామ వ్యవసాయ సహాయకులు తయారుచేయాలని ఆదేశించారు. రసాయనిక ఎరువులు వాడకం తగ్గించాలన్నారు. మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాలలో కూడా ముఖ్యమంత్రి లైవ్ టెలికాస్ట్ ప్రోగ్రాంను రైతులకు చూపించడం జరిగిందని అన్నారు. కార్యక్రమంలో దొనకొండ మండల వ్యవసాయ అధికారి వి బాలకృష్ణ మాట్లాడుతూ రైతన్న మీకోసం సర్వేను రైతులందరూ పూర్తి చేసుకున్నారని దానికి అనుబంధంగా కార్యచరణ ప్రణాళిక జరుగుతుందని రైతులకు ఏమైతే అవసరాలు ఉన్నాయో గమనించి వాటిని పై అధికారులకు తెలియజేసి ప్రణాళిక రూపొందించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి ఎస్‌వెంకట రావు, గ్రామ వ్యవసాయ సహాయకులు రమణయ్య, బహుళార్థ ప్రయోజన విస్తరణ అధికారి విన్నిబాబు, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్నేషనల్ కార్డియాలజిస్టు అవార్డు పొందిన కృష్ణ చైతన్యనకు ఘన సన్మానం

**కనిగిరి, డిసెంబర్ 3, ప్రభాతవార్త**



ఆంధ్రప్రదేశ్- తెలంగాణ రాష్ట్రాలకు సంబంధించిన 6వ ఎడిషనల్ టైమ్ ఎక్స్‌లెన్స్ అవార్డు-2025 కార్యక్రమం హైదరాబాద్‌లో వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఒంగోలుకు చెందిన ప్రముఖ గుండె వైద్య నిపుణులు, చైతన్య కార్డియాక్ హాస్పిటల్ అధినేత డాక్టర్ బీఎంవీ కృష్ణ చైతన్యకు మాజీ మంత్రి హరీష్ రావు చేతుల మీదుగా ఇంటర్నేషనల్ కార్డియాలజిస్ట్ అవార్డు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా బుధవారం కనిగిరి పట్టణంలోని ఏబీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌కు విచ్చేసిన డాక్టర్ కృష్ణ చైతన్యను మదర్ సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ప్రత్యేక అతిధిగా పాల్గొన్న కనిగిరి మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్, సమితి సభ్యుల సమక్షంలో శాలువా కప్పి సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మదర్ సేవా సమితి అధ్యక్షులు ఎస్ఎన్ నాయబ్ రసూల్, హాస్పిటల్ నిర్వాహకులు ఎస్కే నాయబ్ రసూల్, ఈర్ల విజయ రామరాజు, టీచర్ మస్తాన్, సమితి సభ్యులు సహా పలువురు పాల్గొన్నారు.

## మార్కాపురంలో మాక్ మెగా పేరెంట్-టీచర్స్ మీటింగ్ వినూత్న ప్రయత్నం

### విజయవంతమైన మాక్ మెగా పేరెంట్-టీచర్స్ ఆత్మీయ సమావేశం

**మార్కాపురం, డిసెంబరు 3, ప్రభాతవార్త :**



ప్రకాశం జిల్లా కలెక్టర్, విద్యాశాఖాధికారి ఆదేశాల మేరకు జిల్లాలో అత్యధిక విద్యార్థులు చదువుతున్న ఆరు పాఠశాలల్లో మాత్రమే నిర్వహించబడుతున్న మాక్ మెగా పేరెంట్-టీచర్స్ మీటింగ్ కార్యక్రమానికి మార్కాపురం బాలుర ఉన్నత పాఠశాల ఎంపికైందని ఇది పాఠశాలకే గర్వకారణమని ప్రధానోపాధ్యాయులు మునగాల చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులే ఉపాధ్యాయులు, అధికారులు, తల్లిదండ్రుల పాత్రలు పోషిస్తూ మొత్తం కార్యక్రమాన్ని ముందుండి ప్రత్యేకంగా నిర్వహించారు. దీనిద్వారా విద్యార్థుల్లోనాయకత్వ లక్షణాలు పెంపొందడమే కాకుండా బోధనా ప్రక్రియపై అవగాహన, లోతైన విషయాలు తెలుసుకోవడం, సృజనాత్మకత వికాసం వంటి లక్ష్యాలు విజయవంతం అయ్యాయని ప్రధానోపాధ్యాయులు వెల్లడించారు. అదేవిధంగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తమ భవిష్యత్తుపై ఎంతగా శ్రద్ధ చూపుతున్నారో విద్యార్థులు స్వయంగా గ్రహించే అవకాశమిదని పేర్కొన్నారు. కార్యక్రమంలో పదో తరగతి విద్యార్థులు కీలక పాత్రలు వహించారు. ప్రధానోపాధ్యాయులుగా లోహిత్, కలెక్టర్‌గా అబ్దుల్ కరీం, స్థానిక శాసనసభ్యులుగా కార్తీక్, మార్కాపురం సబ్ కలెక్టర్‌గా నరసింహ వ్యవహరించారు. అలాగే 9వ, 10వ తరగతి విద్యార్థులు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులుగా పాల్గొని కార్యక్రమాన్ని ఉత్సాహ భరితంగా నిర్వహించారు. ఈ ఆత్మీయ సమావేశంలో ఉపాధ్యాయులు,సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.

## రైతన్నా మీ కోసం వర్క్‌షాప్ నిర్వహణ

**పెద్దారవీడు, డిసెంబర్ 3, ప్రభాతవార్త :**



వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చేందుకు ప్రభుత్వం రూపొందించిన పంచ సూత్రాలపై అవగాహన కల్పించే రాష్ట్రవ్యాప్త కార్యక్రమం రైతున్న మీ కోసంలో భాగంగా పెద్దారవీడు గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు యొక్క ప్రత్యక్ష ప్రసారాన్ని రైతులు పెద్ద ఎత్తున వీక్షి ంచారు. కార్యక్రమంలో మండల టిడిపి సీనియర్ నాయకులు గొట్టం రామ నారాయణరెడ్డి, కూటమి నాయకులు, వ్యవసాయ శాఖ సిబ్బంది, వ్యవసాయ కళాశాల ప్రిన్సిపాల్, విద్యార్థులు పాల్గొన్నారు.

## వైసిపి నాయకులు వక్రబుద్ధి మార్చుకోవాలి

### - జిల్లా సాధించినందుకు చంద్రబాబు ఫోటోకు పూజ చేయాలి

### - ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

**మార్కాపురం, డిసెంబరు 3 ప్రభాతవార్త :**



మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి బుధవారం నియోజకవర్గంలోని పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పొదిలి మండలం ఆముదాలపల్లి పంచాయతీలో నిర్వహించిన రైతన్న మీకోసం కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసీపీ నాయకులు సంబంధం లేని విషయాలతో ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం రైతుల కోసం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. గత వైసీపీ పాలన సమయంలో అభివృద్ధి లేకపోవడాన్ని తప్పుబట్టారు. మార్కాపురం జిల్లాపై వైసీపీ నేతల వ్యాఖ్యలు అనర్ధకమని, జిల్లాను సాధించినందుకు చంద్రబాబు నాయుడు ఫోటో పెట్టుకొని పూజించాలన్న వ్యాఖ్య చేశారు. వెలుగొండ ప్రాజెక్టు పూర్తి కాకుండా అంకితం చేసినట్లు ప్రకటించడం వైసీపీ పాలన తప్పుడు ప్రచారానికి నిదర్శనమన్నారు. పొదిలిలో ఎమ్మెల్యే ప్రెస్ మీట్ పొదిలి కొండ విషయంలో వైసీపీ వాదులు చేస్తున్న విమర్శలను ఆయన ఖండించారు. గతంలో ట్రస్ట్ బోర్డు నియామకాల్లో వైసీపీనే కీలకంగా వ్యవహరించిందని గుర్తుచేశారు. మార్కాపురం జిల్లా సాధన, జిల్లా ఆసుపత్రి, వెలుగొండ రెండో టన్నెల్ వంటి అభివృద్ధి పనులు తన హయాంలో జరిగాయని తెలిపారు. మూడువేల కోట్ల పెట్టుబడితో రిలయన్స్ ఇండస్ట్రీని నియోజకవర్గానికి తీసుకొస్తున్నట్లు పేర్కొన్నారు. అదేవిదంగా కంబాలపాడు గ్రామంలో తెలుగుదేశం సీనియర్ నాయకులు ఆవులూరి కోటేశ్వరరావు దశదిన కర్మలో పాల్గొని నివాళులర్పించారు. మార్కాపురం పట్టణంలో మాజీ కౌన్సిలర్ చెప్పలి ఆంజనేయులు కుటుంబాన్ని పరామర్శించి ధైర్యంగా ఉండాలని సూచించారు.

## విద్యార్థుల త్రాగునీటి సమస్యకు ముగింపు

### ఐటిఐ కళాశాలలో జీసస్ లవ్స్ మినిస్ట్రీస్ డీప్ బోర్ ఏర్పాటు

**మార్కాపురం, డిసెంబరు 3, ప్రభాతవార్త :**




మార్కాపురం ఐటిఐ కళాశాలలో నెలకొన్న త్రాగునీటి సమస్యకు జీసస్ లవ్స్ మినిస్ట్రీస్ ముందుకు వచ్చి శాశ్వత పరిష్కారం తీసుకువచ్చింది. విద్యార్థులు నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నట్టు ఐటిఐ ప్రిన్సిపాల్ బి వాసు బాబు, స్టాఫ్ సంయుక్తంగా జీసస్ లవ్స్ మినిస్ట్రీస్ డైరెక్టర్ బిషప్ రెవరెండ్ డాక్టర్ గుర్రం శేఖర్‌కు తెలియజేయడంతో, వెంటనే స్పందించిన శేఖర్ కాలేజీ ప్రాంగణంలో డీప్ బోర్ వేయించే కార్యక్రమాన్ని చేపట్టారు. బోరు బండి కళాశాలకు చేరుకున్న వెంటనే, ప్రిన్సిపాల్ వాసు బాబు ప్రారంభోత్సవం నిర్వహించారు. అనంతరం డీప్ బోర్ త్రవ్వకాలతో సమృద్ధిగా నీరు లభించడం విద్యార్థులు, అధ్యాపకులు, మినిస్ట్రీస్ యాజమాన్యాన్ని ఆనందపరిచింది. డీప్ బోర్‌కు కావలసిన మోటార్, ప్యానెల్ బోర్డు, పైపుల ఏర్పాటును తక్షణమే పూర్తి చేస్తామని జీసస్ లవ్స్ మినిస్ట్రీస్ ట్రెజరర్ సునీత రూత్ బెన్ని తెలిపారు. విద్యార్థుల త్రాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించి సహకారం అందించిన డైరెక్టర్ గుర్రం శేఖర్ కు కళాశాల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలేజీ స్టాఫ్, విద్యార్థులు, మినిస్ట్రీస్ కోఆర్డినేటర్ ఎం.ఎస్. విజయ్ కుమార్, సూపర్‌వైజర్లు దిలీప్ కుమార్, ఓబులేసు, వెంకటస్వామి, ఆఫీస్ స్టాఫ్ దివ్య జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## విభిన్న ప్రతిభావంతులందరికీ కూటమి ప్రభుత్వం భరోసా కల్పిస్తుంది

### - ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి

**గిద్దలూరు, డిసెంబరు 3 ప్రభాతవార్త :**



రాష్ట్రంలోని విభిన్న ప్రతిభా వంతులందరికీ కూటమి ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా పింఛన్‌ను రూ.3 వేల నుండి రూ.6వేలకు పెంచి అందజేస్తూ వారి జీవితాలకు భరోసా కల్పిస్తుందని గిద్దలూరు శాసన సభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి అన్నారు. జాతీ య విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ దివ్యాంగుల సమస్యలపై అవగాహన పెంపొందించడానికి, వారి గౌరవం, హక్కులు, శ్రేయస్సు కోసం ప్రణాళికలు రూపొందించడానికి అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని జరుపు కుంటున్నామన్నారు. ఆత్మవిశ్వాసంతో ఎవరికీ తీసిపోమంటూ దివ్యాంగులు సాధిస్తున్న విజయాలకు ఇటీవల అంధుల మహిళల టీ20 ప్రపంచకప్ లో మన్యం ప్రాంతానికి చెందిన యువ క్రికెటర్ కరుణకుమారి చూపిన ప్రతిభ నిదర్శనమన్నారు. దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో అన్ని రంగాల్లో ముందుకు దూసుకెళ్లేందుకు, దివ్యాంగులు ఇతరులతో సమానంగా జీవించే హక్కును, భద్రతను, గౌరవాన్ని అందుకునేలా అండగా నిలబడేందుకు మనందరం ప్రతిజ్ఞ తీసుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమం కోసమే రైతన్న మీకోసం కార్యక్రమం

**తాళ్లూరు, డిసెంబర్ 3, ప్రభాతవార్త :**

వ్యవసాయంలో సాంకేతికను అనుసంధానం చేయడం ద్వారా మేలైన దిగుబడులను సాదించడం, నాణ్యమైన ఉత్పత్తులను పొందడం సాధ్యమని మన్నేపల్లి సొసైటీ చైర్మన్ గొంది రమణారెడ్డి (సమర) అన్నారు. మండలంలో మన్నే పల్లి రైతుసేవా కేంద్రంలో రైతన్నా మీకోసం వర్క్ షాపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సమర మాట్లాడుతూ డిమాండు ఆధారిత పంటలు సాగు, ప్రజల ఆహారపు అలవాట్లకు అనుగుణంగా పంటల సాగు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా దివ్యాంగుల దినోత్సవం

**సంతమాగులూరు డిశంబర్ 3 ప్రభాతవార్త,**



అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా సంతమాగులూరు మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల (కాలనీ)లో ప్రత్యేకంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మండల విద్యాధికారి 2 డి. దినేష్ కుమార్ మాట్లాడుతూ దివ్యాంగులు లోపాలు కలిగిన వారు కాదని, ప్రత్యేక ప్రతిభ కలిగినవారని సమాజం గుర్తించి ప్రేమతో అండగా నిలవాలని సూచించారు. పాఠశాల ముఖ ఉపాధ్యాయురాలు అరవింద మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు ఆత్మవిశ్వాసం పెంచే కార్యక్రమాలు పాఠశాలలో నిరంతరం కొనసాగుతున్నాయని తెలియజేశారు. ప్రత్యేక విద్య ఉపాధ్యాయులు మునియమ్మ, ఉదయ్ చంద్ర, పునరావాస సమన్వయకర్త భవానీ శంకర మాట్లాడుతూ ప్రభుత్వం దివ్యాంగుల కోసం అమలు చేస్తున్న సేవలు, సౌకర్యాలు, పథకాల ద్వారా చాలా పిల్లలు విద్యా రంగంలో ముందుకు వస్తున్నారని తెలిపారు. తల్లిదండ్రులు ఈ అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం అతిథులు చిన్నారులకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శిక్షకులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## లారీ ఢీకొని వ్యక్తి మృతి

**సంతమాగులూరు డిశంబర్ 3 ప్రభాతవార్త,**



సంతమాగులూరు మండలం పుట్ట వారి పాలెం జంక్షన్ లో బుధవారం అశోక్ లైలాండ్ ఐజాక్స్ వాహనం ఢీకొని ఎక్సెల్‌పై వెళుతున్న వ్యక్తి మృతి చెందాడు. మృతుడు రొంపిచర్ల మండలం అచ్చయ్య పాలెం గ్రామానికి చెందిన జాస్టి నాగయ్య అలియాస్ నాగేశ్వరరావు (55) గా పోలీసులు గుర్తించారు. తన ఎక్సెల్ వాహనాన్ని రిపేరు చేయించేందుకు అడ్డ రోడ్డు వచ్చినట్లు తెలుస్తుంది. బాధ్యత కుటుంబ సభ్యుల ప్రియతమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పట్టాభిరామయ్య తెలిపారు. కాగా మృతునికి భార్య ఇద్దరుపిల్లలు ఉన్నారు.

## హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసిన అద్దంకి జనసేన నేతలు

**అద్దంకి రూరల్, డిశంబర్ 3, ప్రభాతవార్త**



అద్దంకి నియోజకవర్గ జనసేన నేతలు బుధవారం పార్టీ మంగళగిరి పార్టీ ఆఫీసులో ఆంధ్రప్రదేశ్ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గా నియమితులైన కల్యాణం శ్రీనివాసరావు ( కేకే) గారిని కలిసి అభినందనలు తెలియజేయడం జరిగింది ఇందులో జనసేన పార్టీ అద్దంకి నియోజకవర్గ నాయకులు జిల్లా కార్యదర్శి చల్లా వెంకట కృష్ణారావు, అద్దంకి జనసేన నాయకులు పూర్ణచంద్రరావు, సంతమాగులూరు మండల జనసైనికులు కరుణాకరణ్, షేక్ మీరావాలి ఉన్నారు

## రైతు సేవా కేంద్రాల్లో రైతన్న మీకోసం వర్క్ షాప్

**కొమరోలు, డిసెంబర్ 3 ప్రభాతవార్త :**



మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాలలో రైతన్న మీకోసం వర్క్ షాపులు నిర్వహించినట్లు మండల వ్యవసాయ అధికారి కే రాజశ్రీ తెలిపారు. గత వారంలో ఇంటింటికి రైతులు వద్దకు వెళ్లి తెలుసుకున్న సమస్యలు, వారు అవలంబిస్తున్న సాగు పద్ధతులు తెలుసుకొని వ్యవసాయంలో రైతులు ఆధునిక పద్ధతులు వైపు మారాలని సూచించినట్లు ఆమె తెలిపారు. రైతులు ఏ విధంగా నూతన పద్ధతులు అవలంబిస్తే ఆర్థికంగా ముందుకు పురోగతి చెందగలరు అనే వాటి మీద విపులంగా రైతులతో చర్చించి తరువాత వచ్చే 3సీజన్లలకు సంబందించిన సాగు ప్రణాళిక తయారుచేయడం జరిగిందని ఆమె తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నల్లజర్ల రైతు సేవా కేంద్ర పరిధిలో రైతులతో చర్చించి వివిధ సాగు యాజమాన్య పద్ధతులు, వ్యవసాయంలో నూతన ఒరవడి ఏ విధంగా తేవాలనేది రైతులను ఉద్దేశించి మాట్లాడే లైవ్ ప్రోగ్రాం అన్ని రైతు సేవా కేంద్రాల్లోని ప్రత్యక్ష ప్రసారం రైతులకు చూపించడం జరిగిందని తెలిపారు. వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## నీటి ట్యాంకుల క్లోరినేషన్

**కొమరోలు, డిసెంబర్ 3 ప్రభాతవార్త :**



మండలంలోని పలు నీటి ట్యాంకులను బుధవారం క్లోరినేషన్ నిర్వహించారు. ఎంపీడీవో సానికొమ్ము సత్యం మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డిసెంబర్ మాసమును జల సురక్ష మాసంగా ప్రకటించి ఉన్నందున, మండలంలోని కొమరోలు గ్రామపంచాయతీ నందు ఓవర్ హెడ్ సర్వీస్ రిజర్వాయర్ ట్యాంకులు క్లీనింగ్ చేయించి, నీరు నింపిన తర్వాత క్లోరినేషన్, వాటర్ టెస్టింగ్ చేయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి జనార్దన్ రెడ్డి, గ్రామపంచాయతీ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## రైతన్న మీకోసంపై సీఎం లైవ్ కార్యక్రమం

**త్రిపురాంతకం, డిసెంబర్ 3,ప్రభాతావార్త:**



మండల కేంద్రంలోని ఎండూరివారిపాలెంలో ఏర్పాటు చేసిన కార్యక్రమం సంగమేశ్వరరెడ్డి వ్యవసాయ అధికారి ఆధ్వర్యంలో రైతు సేవ కేంద్రం నందు ఏర్పాటు చేయడం జరిగింది. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పిన అంశాలన్నీ క్లుప్తంగా చేరవచ్చిన రైతులు అందరు విక్షి ంచే విధంగా కార్యక్రమన్ని ఏర్పాటు చేసి విజయవంతం చెయ్యటం జరిగింది. ఈ కార్యక్రమములో మండల తహశిల్దార్ కృష్ణమోహన్ పాల్గొని ముఖ్యమంత్రి చెప్పిన అంశాలను రైతులకు వివరంగా తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రైతులకు కొన్ని సలహాలు, సూచనలు అవి అన్ని రైతులకి చేరవేసి రైతులను లాభసాటిగా వ్యవసాయం చేసుకునే విధంగా మారుస్తామని రైతులకు దిశానిర్దేశం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు వల రాజు, ఎంపీటీసీ, అధికారులు, గ్రామ రైతులు ప్రజలు పాల్గొనడం జరిగింది.

## నాగార్జునసాగర్ కాలువలో యువకుడు గల్లంతు

### - ముమ్మరంగా గాలింపు కానరాని ఆచూకీ

**త్రిపురాంతకం, డిసెంబర్ 3, ప్రభాతావార్త:**



మండలంలోని రాజుపాలెం గ్రామానికి చెందిన పెద్దపూడి సురేంద్ర ప్రమాదశాత్తు సాగర ప్రధాన కాలువలో పడి గల్లంతయ్యాడు. విషయం తెలుసుకున్న వెంటనే స్థానిక యువకులు ప్రధాన కాలువలో దిగి ఎంత వెతకిన యువకుడి జాడ కనబడలేదు. గల్లంతయిన పెద్దపూడి సురేంద్ర కోసం అతని బంధువులు, గ్రామస్తులు, పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

## సర్వసభ్య సమావేశంలో డాక్టర్ ముక్కు ఉగ్ర

**పామూరు, డిసెంబర్ 3, ప్రభాతవార్త**



మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల అధ్యక్షులు గంగసాని హుస్సేన్‌రెడ్డి లక్ష్మీరెడ్డి అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిధిగా పాల్గొన్న కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలకు అందించే సంక్షేమ పథకాలు వివక్షత లేకుండా అందరికి అందేలా చూడాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ రామచంద్రుని వాసుదేవరావు, ఎంపీడీవో ఎల్.బ్రహ్మయ్య, పలు సంబంధిత అధికారులు, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు బొల్లా నరసింహారావు, పామూరు మండల సింగిల్ విండో చైర్మన్ ఉప్పలపాటి హరిబాబు, మా కోఆప్షన్ సభ్యులు షేక్ నాయబ్ రసూల్, ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు ఆకుపాటి వెంకటేష్, సర్పంచ్‌లు, మండల ఎంపీటీసీలు పాల్గొన్నారు.

**CHANGE OF NAME**

I SEELAM ANJALI(OLD NAME )W/O RAMIREDDY, RESODENT OF D. no. 1-11,PATAMAGULURU, SANTHAMAGULURU, BAPATLA, 523302,A. P, I HAVE CHANGED MY NAME as SEELAM ANJANI (NEW NAME )W/O RAMIREDDY, Here ofter My Name Is Know as SEELAM ANJANI (New name )W/O RAMIREDDY,

4-12Pg5 9_4-12Pg5.qxd 03/Dec/25 10:07 PM Page 1



# అమెరికాలో హెల్త్‌కేర్ స్కామ్..

## భారతీయుడికి రెండేళ్లు జైలు

**వాషింగ్టన్, డిసెంబర్ 3:** అమెరికాలో భారత సంతతికి చెందిన వ్యక్తి రూ.10 కోట్లకు పైగా హెల్త్‌కేర్ కుంభకోణానికి పాల్పడ్డాడు. ఒక డయాగ్నస్టిక్ ల్యాబ్ ద్వారా జరిగిన ఈ మోసానికి గాను కోర్టు నిందితుడికి రెండేళ్ల జైలు శిక్ష విధించింది. ఈ మేరకు యూఎస్ అటార్నీ చార్లెస్ నైల్ ఫ్లోయిడ్ తీర్పు వెలువరించారు. ఈ సందర్భంగా అటార్నీ మాట్లాడుతూ ఈ మెడికేర్ నిధులు ముఖ్యమైన వైద్య సంరక్షణ కోసం వినియోగించాల్సి ఉండగా, వాటిని పక్కదారి పట్టిస్తున్నారన్నారు. దీనివల్ల ప్రభుత్వంతో పాటు పన్ను చెల్లించేవారికి ఎక్కువ నష్టం కలిగిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మహ్మద్ ఆసిఫ్ ఈ యేడాది ఏప్రిల్‌లో చికాగో ఓహేర్ ఎయిర్‌పోర్టులో విమానం ఎక్కుతుండగా అధికారులు అదుపులోకి తీసుకున్నారు. అతడు వాషింగ్టన్‌లో ఓ డయాగ్నస్టిక్ టెస్టింగ్ లాబోరేటరీ ద్వారా ఈ మోసానికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. వృద్ధులు, పేదలకు చికిత్స అందించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన మెడికేర్ వ్యవస్థను అతడు పక్కదారి పట్టించినట్లు తెలుస్తోంది. ఆసిఫ్ మరికొందరితో కలిసి కొవిడ్ నిర్ధారణతో సహా ఇతర శ్వాసకోశ సమస్యలకు పరీక్షలు చేయకుండానే నకిలీ బిల్లులు తయారుచేసినట్లు ప్రాసిక్యూటర్లు తెలిపారు. కోర్టు వివరాల ప్రకారం ఓ ల్యాబ్‌ను 2021లో ఏర్పాటు చేశారు. దీని మెడికల్ లైసెన్స్ 2023లో పూర్తవగా ఫిర్యాదుల నేపథ్యంలో 2025లో దీన్ని మూసివేశారు. ఈ ల్యాబ్‌కు మెడికేర్ డైరెక్టర్‌గా ఆసిఫ్ ఉన్నాడు. అనేకమంది తాము ఎన్నడూ చేయించుకోని పరీక్షలకు కూడా ఛార్జీలు విధించినట్లు ఆరోపణలు చేశారు. కొన్నిసార్లు చనిపోయిన వ్యక్తుల పేర్ల మీద కూడా ఛార్జీలు విధించినట్లు ఆరోపణలు చేశారు. చనిపోయిన వ్యక్తుల పేర్ల మీద కూడా పరీక్షలు నిర్వహించినట్లు బిల్లులు రూపొందించినట్లు వెల్లడైంది. ఈ కంపెనీ ఆర్థిక లావాదేవీలను ఆసిఫ్ నిర్వహించేవాడని అధికారులు గుర్తించారు. ఈ క్రమంలోనే అతడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు కూడా మోసాన్ని అంగీకరించిన నేపథ్యంలో తాజాగా జైలు శిక్ష పడింది. ఈ జైలు శిక్ష పూర్తయిన అనంతరం నిందితుడిని దేశం నుంచి బహిష్కరించే అవకాశాలు ఉన్నాయి.



# సంచార్ సాథీపై కేంద్రం యుటర్న్

- ఆ యాప్ వ్యక్తిగత గోప్యతకు భంగం - పార్లమెంట్‌లో ప్రతిపక్షాల ఆందోళన
- ప్రిఇన్‌స్టలేషన్ తప్పనిసరి కాదని జ్యోతిరాదిత్య వివరణ - మాస్కులతో పార్లమెంటుకు ఎంపిలు - రేణుకాచౌదరిపై ప్రివిలేజ్ మోషన్

**న్యూఢిల్లీ, డిసెంబరు 3:** సైబర్ నేరాల నుంచి రక్షణ కోసం సంచార్ సాథీ యాప్‌ను ముందస్తుగానే ఇన్‌స్టాల్ చేసి ఇవ్వాలన్న కేంద్రం ఆదేశాలు పార్లమెంట్‌లో దుమారం రేపాయి. ఇది ప్రజల వ్యక్తిగత జీవితాల్లోకి చొరబడటమేనని ప్రతిపక్షాలు ఆందోళన వ్యక్తం చేశాయి. బుధవారం పార్లమెంట్ ఉభయ సభల్లో ఈ అంశంపై చర్చకు అనుమతించాలని విపక్షాలు పట్టుబట్టాయి. అయితే, యాప్‌ను ఇన్‌స్టాల్ చేసినప్పటికీ, వినియోగదారులు తొలగించుకోవచ్చని, రిజిస్టర్ అయిన తర్వాతే అది పనిచేయడం ప్రారంభిస్తుందని ప్రభుత్వం వివరణ ఇచ్చింది. అయినప్పటికీ, ప్రతిపక్షాలు తమ ఆందోళనను కొనసాగించాయి. ఈ నేపథ్యంలో కేంద్ర కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా లోక్‌సభలో కీలక ప్రకటన చేశారు. సైబర్ సెక్యూరిటీ యాప్‌ను కొత్త డివైస్‌లను ప్రీలోడ్ చేయాలని స్మార్ట్‌ఫోన్ కంపెనీలకు కేంద్రం ఆదేశాలు ఇచ్చిన నేపథ్యంలో వస్తున్న ఆరోపణలకు మంత్రి ఈ మేరకు లోక్‌సభలో ప్రకటన చేశారు. "సంచార్ సాథీ సేఫ్టీ యాప్‌తో స్నూపింగ్ జరగదు" అని సింధియా స్పష్టంచేశారు. యాప్ ప్రీఇన్‌స్టలేషన్ తప్పనిసరి కాదని ప్రజల రక్షణ కోసమే ఆ యాప్‌ను తయారు చేసినట్లు ఆయన వెల్లడించారు. లోక్‌సభ ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. ప్రజలు తమను తాము రక్షించుకునేందుకు వారికే అధికారాన్ని ఇస్తున్నట్లు మంత్రి చెప్పారు. స్మార్ట్‌ఫోన్లలో సంచార్ సాథీ యాప్‌ను ఇన్‌స్టాల్ చేయాలని నవంబర్ 28వ తేదీన కేంద్ర ప్రభుత్వం టెక్ కంపెనీలకు ఆదేశాలు ఇచ్చిన విషయం తెలిసిందే. ప్రతిపక్షాల నుంచి వ్యతిరేకత వ్యక్తమైన నేపథ్యంలో, ఈ యాప్ ప్రీఇన్‌స్టలేషన్ తప్పనిసరి కాదని కేంద్రం స్పష్టం చేసింది. ఈ మేరకు ముందస్తు ఇన్‌స్టలేషన్ ఉత్తర్వును వెనక్కి తీసుకుంది.

**మాస్కులతో పార్లమెంట్‌కు ఎంపిలు:** దేశ రాజధాని ఢిల్లీ కాలుష్య కోరల్లో చిక్కుకుంది. వాయు కాలుష్యం ప్రమాదకరస్థాయిలో కొనసాగుతోంది. ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 400గా నమోదవుతోంది. దీంతో కాలుష్యంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఢిల్లీలో వాయు కాలుష్యంపై ఎంపిలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు వాయు కాలుష్యానికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేస్తూ ప్రతిపక్ష ఎంపిలు గ్యాస్ మాస్కులు ధరించి పార్లమెంట్ శీతాకాల సమావేశాలకు హాజరయ్యారు.

**కొత్త కార్మిక చట్టాలపై ఆందోళన:** మరోవైపు కొత్త కార్మిక చట్టాలను వ్యతిరేకిస్తూ పార్లమెంట్ ఆవరణలో విపక్ష సభ్యులు ఆందోళన చేపట్టారు. లోక్‌సభలో కొత్త లేబర్ చట్టాలపై చర్చ చేపట్టాలని కాంగ్రెస్ నేత మాణిక్యం ఠాకూర్ వాయిదా తీర్మానం అందజేశారు. ఇటీవల కేంద్ర సర్కారు నాలుగు లేబర్ కోడ్‌లను ప్రకటించింది. కోడ్ ఆఫ్ వేజెస్ 2019, ఇండస్ట్రియల్ రిలేషన్స్ కోడ్ 2020, కోడ్ ఆన్ సోషల్ సెక్యూర్టీ 2020, ఆక్యుపేషనల్ సేఫ్టీ, హెల్త్, వర్కింగ్ కండీషన్స్ కోడ్‌ను అమలు చేయనున్నారు. నవంబర్ 21వ తేదీ నుంచి కొత్త కార్మిక చట్టాలను అమలులోకి తెచ్చారు. పార్లమెంట్ ఆవరణలో బ్యానర్, ప్లకార్డులు చేతబూని నిరసన చేపట్టారు. కార్పొరేట్ జంగిల్ రాజ్‌కు నో చెప్పాలని ఆ బ్యానర్‌లో డిమాండ్ చేశారు.

**ఫేక్ న్యూస్ ప్రజాస్వామ్యానికి ముప్పు:** నకిలీ వార్తలు (ఫేక్ న్యూస్) ప్రజాస్వామ్యానికి పెనుముప్పుగా పరిణమించాయని కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఆందోళన వ్యక్తం చేశారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లపై తప్పుడు సమాచారం, ఎఐ ఆధారిత డీప్‌ఫేక్‌లపై తక్షణం కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. ఎఐ ఆధారిత డీప్‌ఫేక్‌లను కట్టడి చేయడానికి బలమైన చట్టపరమైన చట్రాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అభిప్రాయపడ్డారు.

లోక్‌సభలో డీప్‌ఫేక్‌లపై సభ్యులడిగిన ప్రశ్నలకు అశ్వినీ వైష్ణవ్ సమాధానమిస్తూ, తాజాగా తెచ్చిన కొత్త నిబంధనలు అమలు చేస్తున్నామని, నోటిఫికేషన్ వచ్చిన 36 గంటల్లోపు కంటెంట్ తొలిగించాలి. లేదంటే కఠిన చర్యలుంటాయని కేంద్ర మంత్రి వివరించారు.

**రేణుకాచౌదరిపై ప్రివిలేజ్ మోషన్:** పార్లమెంట్ ఆవరణలో కుక్కను తీసుకురావడమే కాక, పార్లమెంట్ సభ్యులపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు బిజెపి ఎంపి షెహ్‌జాద్ పూనావాలా రాజ్యసభలో ప్రివిలేజ్ మోషన్ ఇచ్చారు. కాంగ్రెస్ ఎంపి రేణుకాచౌదరిపై ప్రత్యేక హక్కుల తీర్మానం ప్రస్తుతం పరిశీలనలో ఉందని రాజ్యసభ చైర్మన్ వివి రాధాకృష్ణన్ తెలిపారు. ప్రివిలేజ్ మోషన్‌పై రేణుకాచౌదరి స్పందిస్తూ, తానేమీ పార్లమెంట్ సభ్యులను కించపరచలేదని వ్యాఖ్యానించారు.

## ‘ఆరావళి’ సవరణలు డెత్ వారంట్ లాంటిదే!

### కేంద్రంపై సోనియా ఆగ్రహం



**న్యూఢిల్లీ, డిసెంబరు 3:** ఆరావళి పర్వత శ్రేణికి సంబంధించి కేంద్ర పర్యాటక శాఖ నూతన మార్పులు తీసుకువచ్చింది. వంద మీటర్ల కంటే తక్కువ ఎత్తులో ఉన్న కొండల్లో మైనింగ్ కార్యకలాపాలు నిర్వహించుకునేందుకు అనుమతిస్తూ ఆరావళి పర్వతాల విషయంలో సవరణలు చేసింది. దీనిపై ఏఐసీసీ అగ్రనాయకురాలు సోనియా గాంధీ తీవ్రంగా స్పందించారు. ఆరావళి పర్వతాల భౌగోళిక స్వరూపాన్ని మార్చేలా తీసుకుంటున్న చర్యలు డెత్ వారెంట్ లాంటివని ఆమె హెచ్చరించారు. ఈ మేరకు ఓ జాతీయ మీడియా సంస్థకు రాసిన కథనంలో ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. వాటిలోని కొన్ని అంశాలను కాంగ్రెస్ సామాజిక మాధ్యమాల ద్వారా పంచుకుంది. గుజరాత్, రాజస్థాన్, హర్యానా రాష్ట్రాల్లో విస్తరించి ఉన్న ఈ పర్వతాలకు దేశ చరిత్ర, భౌగోళిక స్వరూపంలో కీలక స్థానం ఉందని ఆమె అన్నారు. అక్రమ మైనింగ్ కారణంగా ఇప్పటికే వాటి సహజ సంపద తరిగిపోతుండగా, నరేంద్ర మోదీ ప్రభుత్వం వాటికి డెత్ వారెంట్ ఇచ్చిందని అన్నారు. 100 మీటర్ల కంటే తక్కువ ఎత్తులో ఉన్న కొండల్లో మైనింగ్‌కు అనుమతించడం మైనింగ్ మాఫియాకు బహిరంగ ఆహ్వానం పలకడమేనని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. పర్యావరణం పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యాన్లికి ఇది నిదర్శనమని అన్నారు. ఇది వన్యప్రాణుల సంరక్షణ చట్టాన్ని ఉల్లంఘించడమేనని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ నూతన విధానాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

## మృతుల కుటుంబంలోని 13 యేళ్ల బాలుడితో హంతకుడికి మరణశిక్ష అమలు

### అఫ్ఘాన్‌లో కొనసాగుతున్న తాలిబన్ల ఉరితీతలు



**కాబూల్, డిసెంబరు 3:** ఆఫ్ఘనిస్థాన్‌లో తాలిబన్ల పాలనలో అనాగరిక, ఆటవిక న్యాయం మరోసారి బయటపడింది. ఒకే కుటుంబంలో 13 మందిని దారుణంగా హత్య చేసిన వ్యక్తికి, మృతుల కుటుంబానికి చెందిన 13 ఏళ్ల బాలుడి చేత మరణశిక్షను అమలు చేయించారు. కోస్త్ ప్రావిన్స్‌లోని ఓ క్రీడా మైదానంలో సుమారు 80,000 మంది ప్రేక్షకుల సమక్షంలో ఈ బహిరంగ శిక్షను అమలు చేయడం ప్రపంచవ్యాప్తంగా తీవ్ర విమర్శలకు దారితీసింది. మంగళ్ అనే వ్యక్తి సుమారు 10 నెలల క్రితం అబ్దుల్ రెహమాన్‌తో పాటు అతని కుటుంబంలోని 13 మందిని, అందులో తొమ్మిది మంది పిల్లలను హత్య చేశాడు. ఈ కేసులో దోషిగా తేలిన మంగళ్‌కు తాలిబన్ల సుప్రీంకోర్టు "కిసాస్" (ప్రతీకారం) చట్టం కింద మరణశిక్ష విధించింది. ఈ శిక్షను అమలు చేసేందుకు అధికారులు ప్రజలను బహిరంగంగా ఆహ్వానించారు. శిక్ష అమలుకు ముందు, దోషిని క్షమించే అవకాశం ఉందా అని ఆ 13 ఏళ్ల బాలుడిని అడిగారు. అయితే, అందుకు ఆ బాలుడు నిరాకరించడంతో అతని చేతికే తుపాకీ ఇచ్చి దోషిని కాల్చి చంపమని ఆదేశించారు. 2021లో తాలిబన్లు అధికారం చేపట్టిన తర్వాత ఇలా న్యాయవ్యవస్థ ద్వారా మరణశిక్ష అమలు చేయడం ఇది 11వ సారి. ఈ ఘటనపై ఐక్యరాజ్యసమితి తీవ్రంగా స్పందించింది. ఆఫ్ఘనిస్థాన్‌లోని మానవ హక్కుల ప్రత్యేక ప్రతినిధి రిచర్డ్ బెన్నెట్ ఈ చర్యను అమానవీయమైన, క్రూరమైన శిక్ష అని అభివర్ణించారు. ఇది అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధమని, ఇలాంటి వాటిని తక్షణమే ఆపాలని ఆయన డిమాండ్ చేశారు. తాలిబన్లు షరియా చట్టం పేరుతో బహిరంగ ఉరిశిక్షలు, కొరడా దెబ్బలు వంటి కఠిన శిక్షలను తిరిగి ప్రవేశపెట్టడంపై మానవ హక్కుల సంస్థలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.



## రూ.53 లక్షల వాచ్‌తో

### సిద్ధరామయ్య మరోసారి వైరల్

**బెంగళూరు,డిసెంబరు 3:** కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మరోసారి తన ఖరీదైన వాచ్ కారణంగా మళ్లీ వార్తల్లో నిలిచారు. తనను తాను సోషలిస్టు నేతగా అభివర్ణించుకునే ఆయన, తాజాగా రూ. 43 లక్షలకు పైగా విలువైన వాచ్ ధరించి కనిపించడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. గతంలో హుబ్లో వాచ్‌తో తీవ్ర వివాదంలో చిక్కుకున్న ఆయన, ఇప్పుడు మరోసారి అదే తరహా విమర్శలను ఎదుర్కొంటున్నారు. డికె ఇంట్లో జరిగిన బ్రేక్ ఫాస్ట్ సమావేశంలో సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇద్దరి చేతులకు కార్టియర్ బ్రాండ్ వాచ్‌లు ఉండగా, అందరి దృష్టి సిద్ధరామయ్య ధరించిన వాచ్‌పైనే పడింది. ఆయన చేతికి ఉన్నది శాంటోస్ డి కార్టియర్ మోడల్ అని, దాని ధర రూ. 43 లక్షల 20 వేలు ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ఇది పూర్తిగా 18 క్యారెట్ల రోజ్ గోల్డ్‌తో తయారు చేసిన అత్యంత ఖరీదైన మోడల్. ఇదే తరహాలో 2016లోనూ సిద్ధరామయ్య తీవ్ర వివాదంలో చిక్కుకున్నారు. అప్పట్లో ఆయన రూ. 50 నుంచి 70 లక్షల విలువైన వజ్రాలు పొదిగిన హుబ్లో వాచ్ ధరించడంపై ప్రతిపక్షాలు దుమారం రేపాయి. పేదల పక్షపాతిగా చెప్పుకునే నేత ఇంతటి ఖరీదైన వస్తువులు ఎలా వాడతారని నిలదీశాయి. ఆ సమయంలో సిద్ధరామయ్య స్పందిస్తూ.. ఆ వాచ్‌ను దుబాయ్‌లో ఉండే తన స్నేహితుడైన ఒక ఎన్నారై డాక్టర్ బహుమతిగా ఇచ్చారని, అది సెకండ్ హ్యాండ్ వాచ్ అని వివరణ ఇచ్చారు.

## విమాన ప్రయాణాలకోసం ఎంపి సర్కారు భారీ వ్యయం!

**భోపాల్, డిసెంబరు 3:** విమానాలు, హెలికాప్టర్లలో ప్రయాణం కోసం మధ్యప్రదేశ్ ప్రభుత్వం భారీగా ఖర్చు చేస్తున్నది. విమానయాన బిల్లు రోజుకు రూ.21 లక్షలకు చేరింది. ఈ నేపథ్యంలో ఆ రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వంపై కాంగ్రెస్ మండిపడింది. మధ్యప్రదేశ్ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రతాప్ గ్రేవాల్, పంకజ్ ఉపాధ్యాయ్ లేవనెత్తిన ప్రశ్నలకు ఆ రాష్ట్ర ప్రభుత్వం సమాధానం ఇచ్చింది. 2021 జనవరి నుంచి 2025 నవంబర్ వరకు ప్రైవేట్ విమానాలు, హెలికాప్టర్ల అద్దెల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.290 కోట్లు ఖర్చు చేసింది. ఈ ఏడాది ఇప్పటి వరకు ప్రైవేట్ వైమానిక ఆపరేటర్లకు అత్యధికంగా రూ. 90.7 కోట్లు చెల్లించింది. జనవరి 2024 నుంచి నవంబర్ 2025 వరకు ప్రైవేట్ విమానాలు, హెలికాప్టర్ల అద్దెల కోసం మధ్యప్రదేశ్ ప్రభుత్వం రూ.143 కోట్లు ఖర్చు చేసింది. సుమారు 23 నెలల్లో నెలకు దాదాపు రూ. 6.2 కోట్లు లేదా రోజుకు సగటున రూ. 2021 లక్షలు వ్యయం చేసింది. దీనికి ముందు మూడు ఏళ్లల్లో 2021 జనవరి నుంచి 2023 డిసెంబర్ వరకు ప్రభుత్వం రూ.147 కోట్లు ఖర్చు చేసింది. అంటే నెలకు దాదాపు రూ. 4.1 కోట్లు లేదా రోజుకు సగటున రూ.13 నుంచి రూ.14 లక్షలు వ్యయమైంది. మరోవైపు 2019లో మధ్యప్రదేశ్ రాష్ట్ర విమానాల అద్దె వ్యయం ఏటా రూ.1.63 కోట్లు ఉన్నది. అయితే 2025 నాటికి అది రూ.90.7 కోట్లకుపైగా పెరిగిందని సీఎం మోహన్ యాదవ్ అంగీకరించారు. కోవిడ్ తర్వాత పర్యాటకంతోపాటు విమానాల డిమాండ్ పెరగడం, లోక్‌సభ ఎన్నికలు, ఇంధనంతోపాటు నిర్వహణ ఖర్చులు తీవ్రంగా పెరుగడం వంటి కారణాల వల్ల అద్దె రేట్లను ఆ రాష్ట్ర ప్రభుత్వం సవరించింది. దీంతో ప్రైవేట్ విమానం, హెలికాప్టర్ ఛార్జీలు 20నుంచి30 శాతం పెరిగాయి. 2022-23లో గంటకు రూ.4.45 లక్షలుగా ఉన్న ధరలు 2024లో రూ.5.70 లక్షలకు పెరిగాయి. కొన్ని సంస్థల హెలికాప్టర్ ధరలు గంటకు రూ.5.29 లక్షలకు చేరుకున్నాయి. 2021 మేలో కూలిపోయిన ఆ రాష్ట్ర ప్రభుత్వ విమానం గ్వాలియర్ ఎయిర్‌బేస్‌లో నిలిచిపోయింది.

## భారత్‌తో యుద్ధానికి ఆసిమ్ మునీర్ తహతహ!



**రావల్పిండి, డిసెంబరు 3:** పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ సోదరి అలీమా ఖాన్, ఆ దేశ ఆర్మీ చీఫ్ జనరల్ ఆసిమ్ మునీర్‌పై సంచలన ఆరోపణలు చేశారు. ఆసిమ్ మునీర్ భారత్‌తో యుద్ధం చేయాలని తహతహలాడుతుంటే, తన సోదరుడు ఇమ్రాన్ ఖాన్ మాత్రం పొరుగు దేశంతో స్నేహాన్ని కోరుకుంటారని ఆమె అన్నారు. ఒక ఆంగ్ల ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. ఆసిమ్ మునీర్ ఛాందసవాద ఇస్లామిస్ట్. అందుకే ఇస్లాంను విశ్వసించని వారితో యుద్ధం చేయాలని ఆయన కోరుకుంటున్నారు. ఇమ్రాన్ ఖాన్ అధికారంలోకి వచ్చిన ప్రతిసారి భారత్‌తో, చివరికి బీజేపీతో కూడా స్నేహం చేయడానికి ప్రయత్నిస్తారు. కానీ, మునీర్ లాంటి వ్యక్తి ఉన్నప్పుడు భారత్‌తో యుద్ధం తప్పదని అలీమా స్పష్టం చేశారు. ఈ ఏడాది మే నెలలో పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత సైన్యం ఆపరేషన్ సిందూర్ పేరిట పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని 9 ఉగ్ర స్థావరాలపై దాడులు చేసిన విషయం తెలిసిందే. గతంలో ఇమ్రాన్ ఖాన్ ప్రధానిగా ఉన్నప్పుడు, ఆయన భార్య బుష్రా బీబీపై వచ్చిన అవినీతి ఆరోపణలపై విచారణకు అప్పటి ఐఎస్ఐ చీఫ్‌గా ఉన్న మునీర్ ఆసక్తి చూపారు. దీంతో ఆగ్రహించిన ఇమ్రాన్, మునీర్‌ను ఎనిమిది నెలల్లోనే ఆ పదవి నుంచి తొలగించారు. అప్పటి నుంచి వారి మధ్య విభేదాలు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం ఇమ్రాన్ ఖాన్ 2023 ఆగస్టు నుంచి రావల్పిండిలోని అదియాలా జైల్లో ఉన్నారు. ఇటీవల ఆయన మరో సోదరి డాక్టర్ ఉజ్మా ఖాన్ జైల్లో కలిసి, తన సోదరుడిని మానసికంగా హింసిస్తున్నారని ఆరోపించారు.

## బెంగాల్ ‘సర్’పై ప్రధానిమోడీ బిజెపి ఎంపిలకు మార్గనిర్దేశనం

**న్యూఢిల్లీ, డిసెంబరు 3:** పశ్చిమబెంగాల్ లో వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో అక్కడ ఓటరు జాబితా ‘ప్రత్యేక సమగ్ర సవరణ జరుగుతోంది. దాంతో ఎస్ఐఆర్ నిర్వహణపై బెంగాల్‌కు చెందిన బీజేపీ ఎంపీల కు ప్రధాని నరేంద్రమోడీ కీలక సూచనలు చేశారు. ఆ ప్రక్రియ సరళంగా, పారదర్శకంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. అర్హత ఉన్న ఓటర్లను చేర్చడం, అర్హతలేని వారిని తొలగించడమే ఎస్ఐఆర్ ఉద్దేశమని, ఇదే సందేశం క్షేత్రస్థాయికి చేరేలా చూసుకోవాలని ఎంపీలను ప్రధాని ఆదేశించారు. ఈ మేరకు ప్రధాని మోడీ సన్నిహితవర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియా కథనాలు ప్రచురితమయ్యాయి. అదేవిధంగా 2026లో జరిగే అసెంబ్లీ ఎన్నికలకు పూర్తిస్థాయిలో సంసిద్ధంగా ఉండాలని ఎంపీలకు మోదీ సూచించారు. తృణమూల్ కాంగ్రెస్, ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పేర్లను ప్రస్తావించకుండానే విపక్షాల ట్రాప్‌లో పడవద్దని ఎంపీలను హెచ్చరించారు. అదేవిధంగా ఆ రాష్ట్రంలో బీజేపీ ఎదిగిన తీరును ప్రస్తావించారు. 2011లో అసెంబ్లీలో ముగ్గురు ఎమ్మెల్యేలు మాత్రమే ఉన్నారని, 2021లో ఆ సంఖ్య 65కు చేరిందని చెప్పారు.

## సంక్షిప్తంగా..

### వలసలపై ఆంక్షలు విధిస్తే సొంత ప్రయోజనాలకు దెబ్బ : జైశంకర్



**న్యూఢిల్లీ, డిసెంబర్ 3:** అమెరికా, ఐరోపా దేశాల్లో వలసల ఆంక్షలపై విదేశాంగ శాఖ మంత్రి జైశం కర్ కీలక వ్యాఖ్యలు చేశారు. వలసలు, నైపు ణ్యం కలిగిన ఉద్యోగుల రాక పోకలపై మితిమీరిన ఆంక్షలు విధిస్తే వాటి సొంత ప్రయోజనాలే దెబ్బతినే అవకాశం ఉందన్నారు. చివరకు ఆ దేశాలే నష్టపోతాయని హెచ్చరించారు. ఢిల్లీలో ఢిల్లీలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఈ మేరకు మాట్లాడారు. చాలా సందర్భాల్లో వాళ్లే ఈ సమస్యను సృష్టించారని, కాబట్టి స్వయంగా పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. నైపుణ్యం కలిగిన ఉద్యోగుల రాక పోకలకు, ఈ సంక్షోభానికి ఎటు వంటి సంబంధం లేదు. వల సలకు సంబంధించి అమెరికా, ఐరోపా దేశాల్లో ఏమైనా ఆందోళనలు ఉంటే అవి ఆ దేశాలు అమలు చేసిన దీర్ఘకాలిక విధానాల ఫలితమే. గత రెండు దశాబ్దాల్లో ఉద్దేశపూర్వకంగా, అన్ని తెలిసే తమ వ్యాపా రాలను విదేశాలకు విస్తరించాయి.

### గాజాలో పెళ్లి సందడి.. పెద్దఎత్తున సామూహిక వివాహాలు



**గాజా, డిసెంబర్ 3:** గాజా రెండేళ్లపాటు బాంబ్ దాడులతో దద్దరిల్లింది. భీకర దాడులతో గాజా కకావికలం అయింది. ఇటీవల గాజా, ఇజ్రాయెల్ మధ్య శాంతి ఒప్పందం జరగడంతో ప్రస్తుతం ప్రశాంతంగా ఉంది. దీంతో ఎప్పు డెప్పుడా అంటూ ఎదురుచూసిన జంటలన్నీ ఒకేసారి వివాహ బంధంలోకి అడుపెట్టాయి. పెద్ద ఎత్తున సామూహిక వివాహాలు జరిగాయి. దీంతో గాజాలో సందడి వాతవరణం నెలకొంది. గాజాలో 54 జంటలు వైవాహిక బంధంలోకి అడుగుపెట్టాయి. గాజాలోని ఖాన్ యూనిస్‌లోని హమద్‌నగర్‌లో జరిగిన వేడుకలో 54 పాలస్తీనా జంటలు వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. ఈ వేడుక సందడి సందడిగా సాగింది. గాజాలో 2 మిలియన్ల మంది నివాసం ఉంటున్నారు. యుద్ధం కారణంగా అనేక మంది నిరాశ్రయలయ్యారు. ఇజ్రాయెల్ జరిపిన బాంబు దాడులతో భవనాలు నేలమట్టం అయ్యాయి. యుద్ధ సమయంలో బంధువుల ఇళ్లకు వెళ్లి తలదాచుకున్నారు.

### పాక్ ఐఎస్ఐకి గూఢచర్యం కేసులో లాయర్ అరెస్ట్!

**న్యూఢిల్లీ, డిసెంబరు 3:** పాకిస్థాన్ నిఘా సంస్థ ఐఎస్ఐకు గూఢచర్యం చేస్తున్నాడన్న ఆరోపణలపై హర్యానాలోని గురుగ్రామ్‌కు చెందిన న్యాయవాది రిజ్వాన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. అతడు డబ్బులు తీసుకోవడానికి ఏడుసార్లు అమృత్‌సర్ వెళ్లినట్లు తేలింది. ఈ విషయం పోలీసుల అదుపులో ఉన్న రిజ్వాన్ స్నేహితుడు ముషారఫ్ అలియాస్ పర్వేజ్ ద్వారా తేలింది. మూడేళ్ల క్రితం సోహ్నా కోర్టులో రిజ్వాన్, ముషారఫ్‌కు పరిచయం ఏర్పడింది. అప్పటి నుంచి వారిద్దరూ మంచి స్నేహితుల య్యారు. ఆ తర్వాత ఇద్దరూ వృత్తిరీత్యా వేరువేరు ప్రాంతాలకు వెళ్లిపోయారు. ముషారఫ్ ప్రాక్టీస్ కోసం నుహ్ కోర్టుకు వెళ్లగా.. రిజ్వాన్ గురుగ్రామ్ కోర్టుకు వెళ్లాడు. అయినప్పటికీ తరచూ కలుసుకునే వాళ్లు. అయితే, రిజ్వాన్ తరచూ అమృత్‌సర్ వెళ్లేవాడని ముషారఫ్ పోలీసులకు తెలిపాడు. ఈ జులైలో అతడితో కలిసి తాను కూడా అమృత్‌సర్ వెళ్లినట్లు చెప్పాడు.

## చాయ్‌వాలా మోడీ విడియోవైరల్!

### కాంగ్రెస్‌పై ధ్వజమెత్తిన బిజెపి



**న్యూఢిల్లీ, డిసెంబరు 3:** పార్లమెంట్ శీతాకాల సమావేశాల వేళ ప్రధాని నరేంద్ర మోదీని లక్ష్యంగా చేసుకుని కాంగ్రెస్ నాయకురాలు ఒకరు షేర్ చేసిన వీడియో రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతోంది. కాంగ్రెస్ నేత రాగిణి నాయక్, ప్రధాని మోదీని చాయ్ వాలాగా చిత్రీకరిస్తూ రూపొందించిన ఒక ఏఐ జనరేటెడ్ వీడియోను తన సోషల్ మీడియా ఖాతాలో పోస్ట్ చేశారు. ఈ వీడియోలో ప్రధాని మోదీ ఒక చేతిలో టీ కెటిల్, మరో చేతిలో కప్పులు పట్టుకుని టీ అమ్ము తున్న ట్లుగా ఉంది. ఈ వీడియో క్షణాల్లో వైరల్‌గా మారింది.

దీనిపై భారతీయ జనతా పార్టీ (బీజేపీ) తీవ్రంగా స్పందించింది. కాంగ్రెస్ చర్య సిగ్గుచేటని, ఇది ప్రధాని మోదీని ఉద్దేశపూర్వకంగా అవ మానించడమేనని బీజేపీ నేతలు మండిపడుతున్నారు. గతంలో కూడా చాయ్‌వాలా అంటూ కాంగ్రెస్ చేసిన విమర్శలను ప్రధాని మోదీ అనుకూలంగా మార్చుకున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు మరోసారి అదే అంశాన్ని ప్రస్తావిస్తూ ఏఐ టెక్నాలజీతో వీడియోను సృష్టించడంపై బీజేపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఈ వీడియో పార్టీల మధ్య మాటల యుద్ధానికి దారితీసింది.


## నాన్‌ఏసి ప్యాసింజర్లకు జనవరి నుంచి బెడ్‌రోల్స్!

**న్యూఢిల్లీ, డిసెంబరు 3:** రైలుప్రయాణం మరింత సౌకర్యంగా ఉండేందుకువీలుగా రైల్వే మంత్రిత్వశాఖ కొత్త కొత్తవసతులు కల్పిస్తోంది. నాన్ ఎసి స్లీపర్‌కోచ్‌లోప్రయాణించేవారికి కూడా బెడ్‌షీట్లు, దిండ్లు అందించనున్నట్లు రైల్వేశాఖ ప్రకటించింది. ఈ సౌకర్యం ఇప్పటివరకూ ఫస్ట్, సెకండ్, థర్డ్ ఎసి కోచ్‌లలో మాత్రమే లభించేంది. గరీబ్‌రథ్ వంటి కొన్ని ప్రత్యేక రైళ్లలో బెడ్‌రోల్‌కావాలంటే అదనంగా రూ.25 చెల్లించాల్సి ఉంటుందని రైల్వే అధికారులు పేర్కొన్నారు. బెడ్‌రోల్స్‌లో రెండు దిండ్లు, రెండు బెడ్‌షీట్లు, ఒక దుప్పటి, ఒక టవల్ ఉంటాయి. స్లీపర్ క్లాస్ బెడ్‌రోల్స్ కొన్ని రైళ్లకే ఉండేది. అలాంటిది 2023-24 చలికాలం నుంచి నాన్‌ఎసి స్లీపర్‌ప్రయాణీకులకు అద్దెకు బెడ్‌షీట్లు ఇస్తోంది.

ప్రయాణీకులనుంచి మంచి స్పందన కూడా లభించిందన్నారు.

అదనంగా అద్దెఛార్జి 50 మాత్రమే తీసుకుంటారని తెలిపారు. 2026 జనవరి ఒకటినుంచి ఈ సౌకర్యం తొలుత చెన్నై డివిజన్ దక్షిణరైల్వేలో ప్రారంభిస్తారు.

## కేబినెట్‌మీట్‌లో నిద్రపోయిన అమెరికా అధ్యక్షుడు!



**వాషింగ్టన్, డిసెంబరు 3:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి తన ఆరోగ్యం విషయంలో వార్తల్లో నిలిచారు. నిన్న వైట్‌హౌస్‌లో జరిగిన సుదీర్ఘ క్యాబినెట్ సమావేశంలో ఆయన నిద్రమత్తులో జోగుతున్నట్టు కనిపించడం చర్చనీయాంశంగా మారింది. తాను 25 ఏళ్ల క్రితం కన్నా ఎంతో చురుగ్గా ఉన్నానని మీడియా ముందు ప్రకటించిన కొద్దిసేపటికే ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం. దాదాపు రెండు గంటల పాటు సాగిన ఈ సమావేశం ప్రారంభంలో తన ఆరోగ్యంపై వస్తున్న కథనాలను ట్రంప్ తీవ్రంగా ఖండించారు. అయితే, మీటింగ్ మొదలైన 15 నిమిషాల నుంచే ఆయన కళ్లు మూతలు పడుతున్నట్లు కనిపించారు. పలువురు క్యాబినెట్ మంత్రులు తమ శాఖల పనితీరును వివరిస్తుండగా, ట్రంప్ పలుమార్లు 10 నుంచి 15 సెకన్ల పాటు కళ్లు మూసుకుని కునుకు తీస్తున్నట్లు వీడియో ఫుటేజీలో రికార్డయింది. విదేశాంగ మంత్రి మార్కో రూబియో ఆయన పక్కనే కూర్చుని మాట్లాడుతున్నప్పుడు కూడా ట్రంప్ నిద్రమత్తులోనే ఉన్నారు. అయితే, ఈ ఆరోపణలను వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లెవిట్ తోసిపుచ్చారు. అధ్యక్షుడు ట్రంప్ సమావేశాన్ని ఎంతో శ్రద్ధగా వింటున్నారని, మొత్తం మీటింగ్‌ను ఆయనే నడిపించారని ఆమె స్పష్టం చేశారు. సమావేశం చివర్లో విలేకరుల ప్రశ్నలకు ఆయన దీటుగా సమాధానాలు చెప్పడమే ఇందుకు నిదర్శనమని ఆమె అన్నారు. ఇటీవలి కాలంలో 79 ఏళ్ల ట్రంప్ ఆరోగ్యంపై తరచూ వార్తలు వస్తున్నాయి. ఆయన క్రానిక్ వీనస్ ఇన్సఫిషియన్సీ అనే రక్తనాళాల సమస్యతో బాధపడుతున్నట్లు వైట్‌హౌస్ గతంలో వెల్లడించింది. అయితే, అక్టోబర్‌లో జరిపిన వైద్య పరీక్షల అనంతరం సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నారన్నారు.

4-12Pg6exHMNWJQE 10_4-12Pg6exHMNWJQE.qxd 03/Dec/25 10:08 PM Page 1



## పార్లమెంటులో ప్రధాని వ్యాఖ్యలు సరికాదు

### సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ

విజయవాడ, డిసెంబరు 3 ప్రభాతవార్త ప్రతినిధి: ప్రతిపక్షాలను పార్లమెంట్ సమావేశాల వేదికగా ప్రధాని మోడీ కించపరిచే విధంగా చేసిన వ్యాఖ్యల్ని సిపిఐ జాతీయ కార్యదర్శి కె రామకృష్ణ తప్పుబట్టారు. చట్టసభల్లో ప్రజా సమస్యలపై ప్రతిపక్షాలు ప్రశ్నలు లేవనెత్తితే అది ఎందుకు డ్రామా అవుతుందో మోడీ సమాధానం చెప్పాలని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 11 ఏళ్లలో మోడీ చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ గణనీయంగా తగ్గిందన్నారు. 2014లో రూ.60 ఉంటే అది ప్రస్తుతం రూ.90.13కు చేరుకుందని తెలిపారు. రూ.55 లక్షల కోట్ల అప్పును రూ.200 లక్షల కోట్లకు పెంచారని చెప్పారు. నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించలేకపోతున్నారని పేర్కొన్నారు. కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, మాజీ మంత్రి థామస్ ఐజాక్‌పై అక్రమ కేసులు బనాయించారన్నారు. కేవలం అప్రజాస్వామిక విధానాలతో మోడీ ప్రభుత్వాన్ని నడపగలనని భావిస్తున్నారన్నారు. ఇందుకు ఆయన తగిన మూల్యం చెల్లిస్తారన్నారు.

## మెగా పేరెంట్, టీచర్ సమావేశాల్లో టిడిపి కార్యకర్తలేంటి?

### సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

విజయవాడ, డిసెంబరు 3 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 5న పాఠశాలల్లో జరగనున్న మెగా పేరెంట్, టీచర్ సమావేశాల్లో పాల్గొనాలని టిడిపి కార్యకర్తలకు ముఖ్యమంత్రి పిలుపునివ్వడం తీవ్ర అభ్యంతరకరమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తెలిపారు. అధికారిక కార్యక్రమాల్లో తమ పార్టీ కార్యకర్తలను పాల్గొనాలని చెప్పడం పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాలకు తేడా లేకుండా చేయడమేనన్నారు. పాఠశాల అకడమిక్ కార్యకలాపాలను అధికార పార్టీ రాజకీయ ప్రచారానికి వినియోగించుకోవడం సరైంది కాదని, విద్యా కమిటీలు, తల్లిదండ్రులు, విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాలను మాత్రమే వీటికి అనుమతించాలని కోరారు. బయట వ్యక్తులు, విద్యార్థి సంఘాలు విద్యా సంస్థల్లోకి ప్రవేశించరాదని, ఒకపక్క జిఓ ఇచ్చి మరోపక్కన తమ పార్టీ కార్యకర్తలను విద్యా సంస్థల్లో జరిగే సమావేశాల్లో పాల్గొనాలని చెప్పడం ప్రభుత్వ ద్వంద్వ వైఖరిని వెల్లడిస్తోందని విమర్శించారు. విద్యాసంస్థల్లో బయట వ్యక్తులనే పేరుతో విద్యార్థి సంఘాలను నిషేదిస్తూ జిఓ జారీ చేయడాన్ని రాష్ట్రంలోని విద్యార్థి సంఘాలు, ప్రజాతంత్ర వాదులు, మేధావులందరూ నిరశించినా ప్రభుత్వం తన మొండివైఖరి కొనసాగిస్తోందని వివరించారు.

## విద్య, వైద్యం ప్రైవేటీకరణతో వ్యవస్థ చిద్రం

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య

విజయవాడ, డిసెంబరు 3,ప్రభాతవార్తప్రతినిధి: విద్యా, వైద్య రంగాల ప్రైవేటీకరణతో వ్యవస్థ చిద్రం అవుతుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేసారు. రాష్ట్రంలో విద్య, వైద్య రంగాలను ప్రైవేటుకు కట్టబెట్టేందుకు కూటమి ప్రభుత్వం తెరతీసింది. రాష్ట్రంలో విద్యారంగాన్ని శాసించే స్థాయికి శ్రీ చైతన్య, నారాయణ వంటి కార్పొరేట్ సంస్థలు, ప్రైవేట్ యూనివర్సిటీలు చేరుకున్నాయి. పిపిపి పద్ధతిలో 10 మెడికల్ కాలేజీలతోపాటు తొలివిడతగా 4 బోధనాసుపత్రులను ప్రైవేటుకు అప్పగించేందుకు చంద్రబాబు సర్కార్ రంగం సిద్ధం చేసింది. ప్రభుత్వ భూమి, వనరులు, భవనాల నిర్మాణం, సిబ్బంది నియామకం, జీతాల చెల్లింపు వంటి వందల కోట్ల ప్రజాధనాన్ని ప్రైవేటు శక్తులకు అప్పగిస్తున్నది. గత ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నెంబర్ 107, 108లను రద్దు చేయాలి. పిపిపి విధానానికి స్వస్తిపలికి మెడికల్ కాలేజీలను, బోధన ఆసుపత్రులను ప్రభుత్వ ఆధీనంలోనే నడపాలని కోరారు.

## పిటిఎంలను టిడిపి ప్రచార కేంద్రాలుగా మార్చొద్దు: ఎస్ఎఫ్ఐ

విజయవాడ, డిసెంబరు 3 ప్రభాతవార్తప్రతినిధి: మెగా టీచర్స్ పేరెంట్స్ మీటింగ్ (పిటిఎం)లను టిడిపి ప్రచార కేంద్రాలుగా మార్చొద్దని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ సమావేశాల్లో టిడిపి కార్యకర్తలు, నాయకులు హాజరు కావాలని ఆదేశించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పి.రామ్మోహన్‌రావు, కె.ప్రసన్నకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల సమస్యలు విద్యారంగ అభివృద్ధి చర్చించే వేదికగా ఉండాలని, రాజకీయ వేదికగా ఉండకూడదని సూచించారు. విద్యా సంస్థల్లోకి విద్యార్థి సంఘాలు రాకూడదని ఒకవైపు సర్క్యులర్‌ను విడుదల చేసిన కూటమి ప్రభుత్వం.. మరోవైపు నేరుగా పాఠశాలల సమావేశాలకు పార్టీ కార్యకర్తలు హాజరుకావాలని ఆదేశించడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఒకవైపు విద్యాసంస్థల్లోకి రాజకీయ ప్రసంగాలు, కార్యకలాపాలు, జెండాలు వద్దని చెప్తూనే వారి పార్టీ కార్యకర్తలతో పేరెంట్స్ సమావేశాలు నిర్వహించాలని అనుకోవడం దుర్మార్గమైన చర్య అని తెలిపారు. ఈ నెల 5న జరిగే పిటిఎం సమావేశాలకు విద్యార్థి సంఘాలకు అనుమతులిచ్చి, విద్యార్థి సమస్యలు, అకడమిక్, మౌలిక సదుపాయాలపై చర్చించాలని కోరారు. ఈ సమావేశాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. విద్యారంగంలో సమస్యలు గాలికొదిలేసి ఇప్పుడు అది కప్పిపుచ్చేందుకు పార్టీ కార్యకర్తలు పాల్గొనాలని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు.



## శాస్త్రోక్తంగా కృత్తికా నక్షత్ర పూజలు

శ్రీకాళహస్తి, డిసెంబరు 3 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం ఉదయం శాస్త్రోక్తంగా కృత్తికా నక్షత్ర పూజలను నిర్వహించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కొట్టె సాయిప్రసాద్, ఆలయ ఇఓ డి.బాపిరెడ్డి ఆదేశాలతో ఆలయ పౌరోహితులు అర్ధగిరి ప్రసాద్ పూజలు నిర్వహించారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే జ్వాలాతోరణానికి సంబంధించిన పూజలు బుధవారం ఉదయం ఆలయంలోని నంది మండపం ఎదురుగా నిర్వహించారు. ఓ వైపు అధికారులు, ధర్మకర్తల మండలి సభ్యులు అభిషేక గురుకుల్ వరదా గురుకుల్, ఆలయ ప్రధానార్చకులు కరుణాకర్ గురుకుల్, నిరంజన్ గురుకుల్ సారధ్యంలో పూజలు నిర్వహించారు. ఆలయ సంప్రదాయంమేరకు పెద్దనంది విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన తాటి మానుకు పూజలు జరిపారు. ఇక్కడ కలశస్థాపన గావించారు. పౌరోహి తులు వేద మంత్రాలను పఠిస్తుండగా అభిషేక గురుకుల్ డాక్టర్ స్వామినానాధన్, ప్రధానార్చకులు కరుణాకర్ గురుకుల్, అభిషేక గురుకుల్స్ వరదగురుకుల్, నిరంజన్ గురుకుల్, దండ నాయకుడు డాక్టరనఅచ్చితా గురుకుల్ పూజలు జరిపారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ధర్మకర్తల మండలి సభ్యుడు వాకచర్ల గుర్రప్పశెట్టి, ఆలయ డిప్యూటి కార్యనిర్వహణాధికారి ఎన్ఆర్ కృష్ణారెడ్డి, ఆలయ పర్యవేక్షకులు నాగభూషణం యాదవ్ పాల్గొన్నారు. ఏర్పాట్లను టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరాజు పర్యవేక్షించారు.

## దక్షిణకైలాసంలో 'గంగజాతర' సంబరాలు



శ్రీకాళహస్తి, డిసెంబరు 3 ప్రభాతవార్త: పుణ్యక్షేత్రంగా, శైవక్షేత్రంగా ప్రసిద్ధిపొందిన దక్షిణకైలాసమైన శ్రీకాళహస్తిలో ప్రతినెలా ఓ ధార్మిక కార్యక్రమం ప్రత్యేకతగా సాగుతోంది. ఈ ఏడాది జాతరకు శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి ఉంది. స్థానిక శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి సారధ్యంలో ఎన్నో ధార్మిక కార్యక్రమాలు చేపడుతున్నారు. దేశంలోనే మంచు కాలం జాతర నిర్వహించే ఒకే ఒక ప్రాంతం శ్రీకాళహస్తి. ఇక్కడ నిర్వహించే ప్రతి ధార్మిక కార్యక్రమంలోను దేవస్థానం భాగస్వామ్యం ఉంటోంది. మంచుకాలంలో పండుగ నెల ధనుర్మాసం ప్రారంభానికి ముందు నిర్వహించే ఏడు గంగమ్మల జాతర ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది. ఏ ఏడాదికాఏడాది జాతర సంబరాల్లో నిర్వాహకులు ప్రత్యేకతను ఆపాదిస్తున్నారు యువకమిటీల సారధ్యంలో నిర్వహించే జాతరకు యువకులు అలంకారాల నిర్వహణలో ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ఈఏడాది కూడా యువకమిటీలు చొరవచూపి భారీ ఎత్తున నిర్వహిస్తున్నారు. పదిహేను రోజులుగా ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. అమ్మవార్లకు బంగారు వెండినగలను కూడా తయారుచేస్తున్నారు. ఏడు గంగమ్మలకు సారెను అందించేందుకు మేళతాళాలు మంగళ వాయిద్యాలు ఏర్పాటు చేస్తున్నారు. సారెను అందించేందుకు ముత్యాలమ్మగుడివీధిలో మామిడి తోరణాలు, అరటిచెట్లతో ఇరు వైపులా ముస్తాబులు చేశారు.

### పెండ్లిమండపం కమిటీ ఏర్పాట్లు

శ్రీకాళహస్తిలో నిర్వహిస్తున్న ఏడుగంగమ్మల జాతరలో పెండ్లిమండపం గంగమ్మ కమిటీ యువకులు తమదైనశైలిలో ఏర్పాట్లతో పాటు కార్యక్రమాలను రూపొందిస్తున్నారు. సప్పరాల విషయంలో ఎవరికి వారు తమ ప్రత్యేకతను చాటుకునేందుకు ప్రయత్నాలు చేపట్టారు. ఆదివారం రాత్రి చాటింపుకు సన్నాహాలు చేపట్టారు. ఈ నెల 9న మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఏడు ప్రాంతాల్లోని గంగమ్మలను ముత్యాలమ్మగుడి వీధిలోని ఏడుగంగమ్మల ఆలయం వద్దకు చేర్చి అక్కడ పసుపుముద్దలతో అమ్మవారిని తయారుచేసి దీపం వెలిగించి బలి ఇవ్వడం ఆనవాయితీ. అయితే సప్పరాల విషయంలో ఎవరికి వారు ప్రత్యేకతను చోటు చేసుకుంది.రక రకాల సప్పరాను రూపకల్పనకు రూపొందిస్తున్నారు.

## భద్రాచలం- కొవ్వూరు రైల్వే లైన్ పూర్తి చేయండి

### రైల్వే మంత్రికి ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ విజ్ఞప్తి



ఏలూరు, డిసెంబరు 3 ప్రభాతవార్త: హైదరాబాద్, విశాఖ మధ్య దాదాపు 150 కిలోమీటర్ల దూరం తగ్గించి, నాలుగు ఎస్సి అసెంబ్లీ నియోజకవర్గాలు, మూడు ఎస్టి అసెంబ్లీ నియోజకవర్గాలను అనుసంధానం చేస్తూ వెళ్లే అత్యంత ముఖ్యమైన భద్రాచలం కొవ్వూరు రైల్వే లైన్ పనులను త్వరగా చేపట్టాల్సిందిగా రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ను ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కోరారు. పార్లమెంటు శీతాకాల సమావేశాల సందర్భంగా ఢిల్లీలో కేంద్ర రైల్వే మంత్రిని కలిసిన ఎంపీ, భద్రాచలం కొవ్వూరు రైల్వే లైన్‌కు సంబంధించి డీపీఆర్ సిద్ధమైందని అధికారులు చెబుతున్నారని, దానిపై త్వరగానే నిర్ణయం తీసుకొని పనులు వెంటనే మొదలుపెట్టే విధంగా రైల్వే అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ ఒక లేఖను కేంద్ర మంత్రికి అందించారు. ఈ రైల్వే లైన్ కోసం అవసరమైన భూమిని ఉచితంగా అందించడానికి ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పిన ఎంపీ, రాష్ట్ర ప్రభుత్వం వద్ద ఆర్థిక వనరులు తక్కువగా ఉన్న కారణంగా 100 శాతం రైల్వే నిధులతో ఈ ప్రాజెక్టు చేపట్టాలని గతంలోనే కోరిన విషయాన్ని కూడా ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తన లేఖలో గుర్తుచేశారు. అదేవిధంగా ఏలూరు పార్లమెంట్ పరిధిలో ఇప్పటికే మంజూరైన 11 ఆర్వోబీ/ ఆర్యూబీల పనులను కూడా త్వరగా మొదలు పెట్టాలని కోరుతూ ఎంపీ పుట్టా మహేష్ కుమార్ రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు మరో లేఖ అందించారు. ప్రాధాన్యత ప్రాతిపదికన ఈ ఆర్వోబీల పనులను త్వరగా పూర్తిచేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలివ్వాల్సిందిగా తన లేఖలలో కేంద్ర రైల్వే మంత్రికి విజ్ఞప్తి చేశారు.

## స్వాంతన కింద రూ.5 కోట్లతో నిధి

### - మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి

సచివాలయం, డిసెంబరు 3 ప్రభాతవార్త: దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకులాలు, సాంఘీక సంక్షేమ వసతి గృహాల విద్యార్థులు ఎవరైనా దురదృష్టవశాత్తు మరణిస్తే వారి కుటుంబానికి భరోసాగా స్వాంతన పథకం కింద కూటమి ప్రభుత్వం రూ.3 లక్షల ఆర్థికసాయం అందిస్తుందని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి తెలిపారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ముగ్గురు విద్యార్థులు కుటుంబాలకు స్వాంతన చెక్కులను బుధవారం అమరావతి తాడేపల్లిలోని ఏపి ఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్ కార్యాలయంలో మంత్రి అందజేశారు. పల్నాడు జిల్లా ఆర్కేపురం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకులం 10వ తరగతి విద్యార్థి టి.నిహారిక, ప్రకాశం జిల్లా రాచర్ల గురుకులం 10వ తరగతి విద్యార్థిని కొఠారి కర్ణ, బాపట్ల జిల్లా డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకులం 7వ తరగతి విద్యార్థిని బి.శ్వేత ఇటీవల దురదృష్టవశాత్తు అనారోగ్యంతో మరణించారు. బుధవారం వారి తల్లిదం డ్రులకు కుటుంబ సభ్యులకు మంత్రి డాక్టర్ స్వామి ఒక్కొక్క విద్యార్థి కుటుంబానికి రూ.3లక్షల చొప్పున మొత్తం రూ.9లక్షలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి స్వామి మాట్లాడుతూ దురదృష్టవశాత్తు అనారోగ్యంతో మరణించిన విద్యార్థుల కుటుంబాలకు బాసటగా ఉండేందుకు సీఎం చంద్రబాబు నాయుడు సూచనలతో రూ.5 కోట్ల నిధులు కేటాయించి స్వాంతన పథకం తీసుకొచ్చాం. అనారోగ్యంతో మరణించిన విద్యార్థుల కుటుంబాలకు ఆర్థికసాయం అందించి భరోసానిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ డైరెక్టర్ బి.లావణ్య వేణి, ఏపి ఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్ అడిషనల్ సెక్రటరీ సునీల్‌రాజ్ కుమార్, డాక్టర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## లోక్ భవన్‌లో నాగాలాండ్, అసోం ఆవిర్భావ దినోత్సవాలు

విజయవాడ, డిసెంబరు 3 ప్రభాతవార్త ప్రతినిధి: ఏక్ భారత్ శ్రేష్ఠ్ భారత్ కార్యక్రమంలో భాగంగా బుధవారం లోక్ భవన్‌లోని దర్బార్ హాల్‌లో నిర్వహించిన నాగాలాండ్, అసోం రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, నాగాలాండ్ పచ్చని కొండలు, దట్టమైన అడవులు, అద్భుతమైన లోయలతో నిండి ఉందని, నాగాలాండ్ పండుగలకు ప్రసిద్ధి అని, అక్కడ ప్రతి గిరిజన తెగకు వారి స్వంత పండుగలు, ఆచారాలు ఉన్నాయని అన్నారు. అసోం సంవత్సరంలో మూడుసార్లు జరుపుకునే రంగురంగుల బిహు పండుగను గుర్తుకు తెస్తుందని, ఆ రాష్ట్రం ఆధ్యాత్మిక అనుభవాల అద్భుత భూమి అని, ముఖ్యంగా కామాఖ్య ఆలయం దీనికి ప్రత్యేక కేంద్రంగా ఉందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమం నాగాలాండ్ గవర్నర్ అజయ్ కుమార్ భల్లా, అసోం గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య వీడియో సందేశాలతో ప్రారంభమైంది, తరువాత ఐకాన్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన నాగాలాండ్, అసోం జానపద నృత్యాలు జరిగాయి. గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి. అనంత రాము, పి.ఎస్. సూర్యప్రకాష్, జాయింట్ సెక్రటరీ, లోక్ భవన్ అధికారులు, నాగాలాండ్, అసోం విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## అంధుల క్రికెట్ టీమ్‌కు సిఎస్ అభినందనలు

సచివాలయం, డిసెంబరు 3 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ అంధుల క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధి బృందం బుధవారం రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్‌ను కలసింది. ఇటీవల అంధ మహిళల ప్రపంచ క్రికెట్ కప్ గెలుచుకున్న ఈ బృందం టీమ్ కెప్టెన్ దీపిక, టీమ్ సభ్యురాలు కరుణకుమారి నేతృత్వంలో సిఎస్‌ను మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా అంధుల క్రికెట్ టీమ్‌ను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఆంధ్రప్రదేశ్ ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయిలో నిలబెట్టిన అంధులైన క్రికెటర్లను ప్రభుత్వం నుంచి తగిన సహాయ సహకారాలు అందిస్తుందని హామీ ఇచ్చారు. సీఎస్‌ను కలసిన వారిలో ఏపి క్రికెట్ బ్లైండ్ అసోసియేషన్ అధ్యక్షులు చెన్న శరత్‌బాబు, కార్యదర్శి జి.రవీందర్, కోచ్ మరియు ట్రెజరర్ అర్జున అవార్డు గ్రహీత అజయ్‌కుమార్ రెడ్డి, టి20 ప్రపంచ కప్ బ్లైండ్ క్రికెట్ ఇండియా కెప్టెన్ దీపిక టిసి, టి20 ప్రపంచ కప్ బ్లైండ్ క్రికెట్ స్టార్ ప్లేయర్ కరుణకుమారి, టీం ఇండియా మేనేజర్ శిఖా శెట్టి, బోర్డు మేనేజ్ కె.కీర్తన, మెడికల్ హెడ్ డాక్టర్ జింకా లక్ష్మీ ప్రసన్న, లక్ష్మీనారాయణ్ కుర్రా తదితరులు పాల్గొన్నారు.





## సాంకేతికతతో రైతన్నకు మూడు రెట్ల ఆదాయం

- రైతును రాజు చేసేలా ప్రభుత్వ ప్రణాళిక
- 3 మండలాల విలీనానికి సూత్రప్రాయ అంగీకారం: గంటా

ఆనందపురం, డిసెంబరు 3 ప్రభాతవార్త: సంప్రదాయ వ్యవసాయానికి సాంకేతికను జోడించడం ద్వారా రైతులు మూడు రెట్ల ఆదాయాన్ని ఆర్జించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని బోని గ్రామంలో బుధవారం ఏర్పాటు చేసిన "రైతన్న మీ కోసం" కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వాణిజ్యపరంగా డిమాండ్ ఉన్న పంటల ద్వారా వ్యవసాయాన్ని పండగలా మార్చడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రణాళికబద్ధంగా ముందుకు వెళ్తున్నారని చెప్పారు. చక్కని ఆరోగ్యాన్ని అందించే మిల్లెట్ వంటలు తనకు ఎంతగానో నచ్చాయన్నారు. పంటలతో పాటు పువ్వులు వంటివి నిల్వ చేసుకోవడానికి రైతులు సొసైటీగా ఏర్పడితే, కోల్డ్ స్టోరేజ్‌ల నిర్మాణం ద్వారా వారికి సహకరించడానికి కొన్ని స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చాయని తెలియజేశారు. ఇనాం భూముల్లో తరాలుగా వ్యవసాయ చేస్తున్న రైతులు ఎదుర్కొంటున్న సమస్యకు తొందర్లోనే పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చారు.

భీమిలి రూరల్, ఆనందపురం, పద్మనాభం మండలాలను జీవీఎంసీలో విలీనం చేయడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యా శాఖ మంత్రి లోకేష్, మున్సిపల్ మంత్రి నారాయణ సూత్రప్రాయంగా అంగీకారం తెలిపారని ప్రకటించారు. రైతుకు అండగా నిలుస్తున్న ముఖ్యమంత్రి చిత్రపటానికి గంటా సహా కూటమి నేతలు పాలాభిషేకం చేశారు. అనంతరం వ్యవసాయ శాఖ ఏర్పాటు చేసిన వ్యవసాయ ఉత్పత్తుల ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. వ్యవసాయ శాఖ పోస్టర్ ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, భీమిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కురుమిన రామస్వామి నాయుడు, వ్యవసాయ శాఖ ఏడీ చంద్రశేఖర్, కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, గాడు వెంకటప్పడు, బి.ఆర్.బి.నాయుడు, కోరాడ రమణ, ఎస్. సత్యవరప్రసాద్, పాండ్రంగి అప్పలరాజు, శాఖారి శ్రీనివాస్, కురుమిన లీలావతి, గండ్రెడ్డి స్వామినాయుడు, బలిరెడ్డి మల్లిఖార్జునరావు, కొప్పల రమేష్, ఎం.శివాజీ, రామరాజు, మామిడి దుర్గారావు, కె.అచ్యుతరావు, మజ్జి నందీష్, మొకర అప్పలనాయుడు, చందవరపు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## చేయని నేరానికి బాధ్యుడ్ని చేశారని బాలుడి ఆత్మహత్యాయత్నం

విజయవాడ, డిసెంబరు 3 ప్రభాతవార్త ప్రతినిధి: కృష్ణా జిల్లాలో ఘోరం చోటు చేసుకుంది. చేయని నేరానికి బాధ్యున్ని చేయడంతో తీవ్ర మనస్తాపానికి గురై 15 ఏళ్ళ బాలుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పామర్రు మండలం యడదిబ్బ గ్రామంలో కైలే యశ్వంత్(15) విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. దొంగతనం ఆరోపణతో యశ్వంత్ ఈ దారుణ నిర్ణయం తీసుకున్నాడు. తమ ఇంట్లో రూ.1500 కాజేసాడంటూ పొరుగింట్లో ఉండే వాళ్లు బాలుడిపై ఆరోపణలు చేశారు. తమ ఇంట్లో ఏది పోయిన నీదే బాధ్యత అంటూ బాలుడికి బెదిరించినట్లు సమాచారం. పొరుగింటి వారి బెదిరింపులతో యశ్వంత్ భయాందోళనకు గురయ్యాడు. ఈ క్రమంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో యశ్వంత్ ఆత్మహత్య చేసుకున్నాడు. బాలుడు జమీదగ్గుమిల్లి హైస్కూల్లో 10వ తరగతి చదువుతున్నాడు. యశ్వంత్ భౌతిక కాయాన్ని చూసి తల్లిదండ్రులు భోరున విలపిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## శబరిమలకెళ్లి వస్తూ.. రోడ్డు ప్రమాదంలో తండ్రి, కొడుకులు మృతి

### మృతులు తిరుపతి జిల్లా వాసులు

బుచ్చినాయుడు కండ్రిగ, డిసెంబరు 3 ప్రభాతవార్త: అయ్యప్ప స్వామి దీక్ష తీసుకుని శబరిమలైలో అయ్యప్ప స్వామి దర్శనం చేసుకుని తిరుగు ప్రయాణంలో తిరుపతి జిల్లా బుచ్చినాయుడుకండ్రిగ మండలంలోని కారణి గ్రామానికి చెందిన తండ్రి కొడుకులు కారు ప్రమాదంలో మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల సమాచారం మేరకు... కారణి గ్రామానికి చెందిన గురిజాల వేణు(49) కుమారుడు గురజాల నరేష్(30), చాతుర్య(9) వరదయ్యపాళెం మండలం గోవర్ధనపురం గ్రామానికి చెందిన మునితేజ అయ్యప్ప దీక్ష మాల వేసుకుని స్వామి దర్శనం కోసం కారులో బయలుదేరి శబరిమలై చేరుకుని అయ్యప్ప స్వామి దర్శనం చేసుకుని మంగళవారం తిరుగు ప్రయాణం అయ్యారు. మార్గ మధ్యలో కేరళలోని తేనె టౌన్ సమీపంలో కారు అదుపు తప్పి డివైడర్‌ని ఢీకొనడంతో పక్కనే ఉన్న కాలువలో బోల్తా పడింది. సంఘటనలో కారు డ్రైవింగ్ చేస్తున్న నరేష్, పక్కనే ఉన్న వేణుకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వీరితో పాటు ప్రయాణిస్తున్న మునితేజ, చాతుర్యకు గాయాలయ్యాయి. తేనె టౌన్‌లోని ఆస్పత్రిలో మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వ హించి, గురువారం కారుని గ్రామానికి మృతదేహాలు వస్తాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

## రాజంపేటను జిల్లా కేంద్రం చేయండి




రాజంపేట, డిసెంబరు 3 ప్రభాతవార్త: రాజంపేట జిల్లా కేంద్రం ఆకాంక్ష మరోసారి ప్రజల నుంచి బద్దలైంది. రాజంపేట జిల్లా కేంద్రం చేయాలని ప్రకటించాలని డిమాండ్ చేస్తూ జెఎసి ఆధ్వర్యంలో బుధవారం జరిగిన రాజంపేట ర్యాలీకి ప్రజలు వేలాదిగా తరలివచ్చారు. వైసిపి అన్ని రాజకీయ పక్షాలు ఏకమయ్యాయి. ఉద్యమం ఊపొందుకుంది. రాజకీయ పక్షాలు ఊహించిన దానికంటే ప్రజల్లో జిల్లా కేంద్రం కావాలనే ప్రగాఢమైన ఆకాంక్ష మరోసారి ఉద్యమంలో బయటపడింది. రాజంపేట జిల్లా కేంద్ర మనోభావాలను ప్రజల ఆకాంక్షలను ప్రభుత్వం దృష్టికి తీసుకుని పోవాలని రాష్ట్ర ప్రభుత్వ విప్ రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ ఆధ్వర్యంలో జేఏసీ నాయకులు రాజంపేట సబ్ కలెక్టర్ భావనాను కలిసి వినతి పత్రం అందజేశారు. అంతకుముందు వేలాదిగా అన్నమయ్య జిల్లా రాజంపేట పాత బస్టాండ్ నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు జేఏసీ ఆధ్వర్యంలో ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరవ శ్రీధర్ మాట్లాడుతూ రాజంపేటలో జిల్లా కేంద్రం చేయాలని రాజంపేట, రైల్వే కోడూరు నియోజకవర్గాల ప్రజలు కోరుతున్నారని ముఖ్యమంత్రి నారా చంద్రబాబును కూడా చైర్మన్ ముక్కా రూపానంద రెడ్డి తో చంద్రబాబు నాయుడు కలిసి కోరమన్నారు. అలాగే ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ డిస్టిక్ కూడా తీసుకుపోయి సీఎం డిప్యూటీ సీఎంలను జిల్లా కేంద్రం విషయంలో హామీ ఇచ్చేలా ఒప్పిస్తామని ఎమ్మెల్యే ధీమా వ్యక్తం చేశారు. రాజంపేట రైల్వే కోడూరు బద్వేల్ నియోజకవర్గం కలిపి రాజంపేట కేంద్రంగా జిల్లా ప్రకటించాలని డిమాండ్ చేశారు.రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గం కేంద్రంగా ఉందని, డివిజన్ కేంద్రంగా ఉందని అటు రైలు సౌకర్యం కేవలం, 50 కిలోమీటర్ల నుంచి 100 కిలోమీటర్ల దూరంలో రెండు విమానాశ్రయాలు, జాతీయ రహదారి ఉందని ప్రజలు ఎప్పటినుంచో జిల్లా చేయాలని డిమాండ్ చేస్తున్నారని పాలకులు ఇది గుర్తించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు, జనసేన, టిడిపి, బిజెపి, సిపిఐ, సిపిఎం నేతలు, ప్రజా సంఘాలు, ఉద్యోగ సంఘాల నేతలు పాల్గొన్నారు.

## అన్నదాత సుఖీభవ కింద రూ.213 కోట్లు పంపిణి



జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి

ఏలూరు, డిసెంబరు 3 ప్రభాతవార్త: ప్రభాతవార్త: పెదపాడు మండలం అప్పనవీడు గ్రామంలో రైతన్నా... మీకోసం వర్క్ షాప్‌లో బుధవారం జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అప్పనవీడు రైతు సేవ కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ వ్యవసాయం, అనుబంధ రంగాల శాఖల సిబ్బంది రైతుల ఇళ్లకు వెళ్లి ఆధునిక వ్యవసాయ పద్ధతులతో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధనతో రైతులకు అవగాహన కలిగించడం రైతన్న మీకోసం కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. రైతు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్నదన్నారు. జిల్లాలో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నామన్నారు. మరింత విస్తీర్ణంలో ప్రకృతి సాగుచేసేలా రైతులలో అవగాహన పెంచాలని వ్యవసాయాధికారులు కలెక్టర్ ఆదేశించారు. రైతులకు ఎరువులు, విత్తనాలు సబ్సిడీపై అందించడమే కాక అన్నదాత సుఖీభవ పథకం కింద రెండు విడతలలో లక్షా 60 వేల 968 మంది రైతులకు 213.31 కోట్ల రూపాయలు ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం అందించిందన్నారు. సాగులో యాంత్రీకరణను ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నదని, జిల్లాలో 60 డ్రోన్లను రైతులకు అందించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు రైతులను ఉద్దేశించి ప్రసంగించిన కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా రైతులతో పాటు అధికారులు తిలగించారు. జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ భాషా, తహసీల్దార్ కృష్ణజ్యోతి, ఎంపిడిఓ, ఏడిఏ అనిల కుమారి, ఎంఏఓ షేక్ ఇమామిఖాసిమ్, ఏరువాక కేంద్రం ఏలూరు శాస్త్రవేత్త ఎన్.నాగేంద్రబాబు, పెద్దపాడు మండల నాయకులు రవి, గుప్తా అనిల్, వ్యవసాయం, అనుబంధ రంగాల శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

4-12P□g7exHMNWJQE 11_4-12P□g7exHMNWJQE.qxd 03/Dec/25 10:54 PM Page 1



## రక్షణ, విద్యాశాఖల రోజువారి ఆహారంలో

# రొయ్యలు, చేపలను చేర్చాలి!

**- రాజ్యసభలో ఎంపి పాక సత్యనారాయణ**



భీమవరం, డిసెంబరు 3 ప్రభాతవార్త: ఆక్వా ఉత్పత్తులకు అంతర్జాతీయ ఎగుమతులు ఇబ్బందులను ఎదుర్కొంటున్న తరుణంలో ఆత్మనిర్భర్ భారత్ పథకంలో మన రొయ్యలను స్థానిక వినియోగానికి ప్రోత్సాహం కల్పించాలి... దీనివలన ఆక్వారైతులు ఎగుమతుల సంక్షోభాలను అధిగమించటానికి వీలుంటుంది అని రాజ్యసభ సభ్యుడు పాక వెంకట సత్యనారాయణ చెప్పారు. రాజ్యసభ సమావేశాలలో బుధవారం సాయంత్రం ఆక్వా రైతుల సమస్యలపై ప్రసంగించారు. ముఖ్యంగా రొయ్యలు చేపల ఎగుమతులకు ఉన్న అవరోధాలను అధిగమించడానికి ఆయన కొన్ని సూచనలు చేశారు. ప్రస్తుతం మన ఆక్వా మార్కెట్ అంతర్జాతీయంగా 75 శాతం వాటాతో గ్లోబల్ లీడర్‌గా ఉందన్నారు. ఇందులో ఆంధ్రప్రదేశ్ నుంచి 70శాతం వాటా ఉందన్నారు. కొంతకాలంగా మన వ్యాపారంపై అమెరికా వాణిజ్య ఆంక్షలు విధించిన నేపథ్యంలో అంతర్జాతీయంగా మన ఆక్వా ఎగుమతులు సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయన్నారు. ఇటువంటి పరిస్థితులలో మన ఆక్వా ఉత్పత్తులకు డొమెస్టిక్ వినియోగం పెంచడం ద్వారా ఈ రైతులను ఆదుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. రోజువారి ఆహారంలో ఆక్వా ఉత్పత్తుల తినడం చాలా ఆరోగ్యకరమన్నారు. వీటిని తీసుకోవడం వల్ల శరీరానికి మంచి ప్రోటీన్ అందుతుందన్నారు. రోగ నిరోధక శక్తి కూడా ఉంటుందని చెప్పారు. అందువలన ప్రధానంగా రక్షణ శాఖలో సిఆర్పిఎఫ్, బిఎస్ఎఫ్ లాంటి డిఫెన్స్ విభాగంలో ఉన్న క్యాంటీన్లకు ఈ ఆక్వా ఉత్పత్తులను చేర్చాలని, దీనికి సంబంధించి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయాలని కోరారు. అలాగే విద్య శాఖకు సంబంధించి పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పథకానికి, అంగన్వాడి విద్యార్థులకు పోషక ఆహారంలో భాగంగా ఆక్వా ఉత్పత్తులను అందించవచ్చు అన్నారు. ఆక్వా ఉత్పత్తుల వినియోగం వలన వారిలో ఆరోగ్య పరిస్థితిలు బాగా మెరుగు పడే అవకాశం ఉందన్నారు. కాబట్టి మన దేశ సైనికులకు, విద్యార్థులకు ఆహారంలో ఆక్వా ఉత్పత్తులను చేర్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కేంద్ర, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు ఈ నిర్ణయం తీసుకుంటే దేశంలోనే అత్యధిక ఆక్వా సాగు చేస్తున్న ఆంధ్రప్రదేశ్ రైతులకు ఎంతగానో ప్రయోజనం ఉంటుందన్నారు. మరొక వైపు అంతర్జాతీయంగా ఆక్వా ఎగుమతుల సంక్షోభాన్ని కూడా ఎదుర్కోవటానికి అవకాశాలు మెరుగ్గా ఉంటాయని పాక సత్యనారాయణ వివరించారు.




## ఉద్యోగులకు, పెన్షనర్లకు హెల్త్ కార్డులపై

# మెరుగైన వైద్యం అందించాలి

**- ఎపి ఎన్జీవో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్**


భీమవరం, డిసెంబరు 3 ప్రభాతవార్త: గత ప్రభుత్వంలో చట్టపరంగా ఉద్యోగులు పొందాల్సిన బకాయిలను ప్రస్తుత కూటమి ప్రభుత్వం దశలవారీగా చెల్లించేందుకు ఏపీ ఎన్జీవో సంఘం చేపట్టిన ఆందోళన కార్యక్రమాలే కారణమని ఏపీ ఎన్జీజీవో సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎ.విద్యాసాగర్ అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా సంఘం అడ్ హక్ కమిటీ ఏర్పాటు కార్యక్రమం భీమవరం త్యాగరాజ భవన్‌లో బుధవారం నిర్వహించారు. ప్రధాన వక్తగా పాల్గొన్న విద్యాసాగర్ మాట్లాడుతూ తక్షణమే 12వ పిఆర్‌సి కమిటీ ఏర్పాటు చేయాలని, పెండింగ్ డిఏలను మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హెల్త్ కార్డ్స్ సరిగా వినియోగం లోకి రావటం లేదని దీని వలన ఉద్యోగ వర్గం తీవ్రంగా నష్టపోతున్నారనే విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లిన వెంటనే హెల్త్ ఇన్సూరెన్స్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించడం శుభ పరిణామం అన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులను గత ప్రభుత్వం 10,280 మందికి క్రమబద్ధీకరణ చేస్తామని కేవలం 2,800 ఉద్యోగులనే క్రమబద్ధీకరణ చేసారని, మిగతా వారిని కూడా క్రమబద్ధీకరణ చేయాలని డిమాండ్ చేశారు. గ్రామ, వార్డ్ సచివాలయాలలో పనిచేస్తున్న ఉద్యోగులకు నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, పెన్షనర్లకు గత ప్రభుత్వం తొలగించిన అడిషనల్ క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ తగ్గించారని దాన్ని పునరుద్ధరణ చేయాలని డిమాండ్ చేసారు. ముఖ్యఅతిథి పిడిఎఫ్ ఎమ్మెల్సీ గోపిమూర్తి మాట్లాడుతూ ఉద్యోగులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారి సమస్యలు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతానని సభకి హామీ ఇచ్చారు. అనంతరం పశ్చిమగోదావరి జిల్లా అడ్ హక్ కమిటీ ప్రకటించారు. చైర్మన్‌గా ఉదిసి వెంకట పాండురంగారావు, పోతన సుకుమార్ ఫైనాన్స్ మెంబర్‌గా అల్లూరి శ్రీనివాస రాజు, మెంబర్స్‌గా ఎంఆర్‌కె రాజు, దేవాబత్తుల నాగదేవి ఇంజేటి రమేష్, సుంకర వెంకటేష్‌లను ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి డి.వి. రమణ, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్, కార్యదర్శి నెరుసు రామారావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెనుమరెడ్డి శ్రీనివాసులు, రాష్ట్ర కార్యదర్శులు శివప్రసాద్, రాంప్రసాద్, జెఏసి నాయకులు ఆర్ఎస్ హరనాథ్, రాష్ట్ర ట్రెజరీ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడు పాము శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి దేవిరెడ్డి రమణారెడ్డి, రాష్ట్ర విమెన్ వింగ్ ఉపాధ్యక్షురాలు తోట కుసుమ కుమారి పాల్గొన్నారు.



## హెచ్ఓడి టవర్ల నిర్మాణ కార్మికులకు శిక్షణ

గుంటూరు, డిసెంబరు 3 ప్రభాతవార్త ప్రతినిధి: ప్రజారాజధాని అమరావతిలో ఎపి సిఆర్డీఏ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న హెచ్ఓడీ టవర్ల 1, 2 ప్రాజెక్ట్‌లో వర్క్ అట్ హైట్, ఫాల్ ఫ్రమ్ హైట్ రెస్క్యూ ఆపరేషన్ స్కాఫోల్డింగ్ సేఫ్టీ ట్రైనింగ్, మాక్ డ్రిల్‌ను ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ(ఏపీ సిఆర్‌డీఏ) విజయవంతంగా నిర్వహించింది. భవన నిర్మాణ పనులలో భాగంగా అత్యంత ఎత్తులో నిర్వహించే నిర్మాణ కార్యక్రమాలలో భద్రతా ప్రమాణాలను బలోపేతం చేయడం, కార్మికులలో అవగాహన పెంపొందించడం లక్ష్యంగా ఈ శిక్షణ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది. హెచ్ఓడీ టవర్ల నిర్మాణ ప్రాంగణంలో నిర్వహించిన ఈ సమగ్ర శిక్షణ కార్యక్రమాన్ని ప్రముఖ భద్రతా సంస్థ అయిన కరం సేఫ సహకారంతో, హెచ్ఓడీ టవర్లు 1, 2 నిర్మాణ కాంట్రాక్టర్ షాపూర్‌జీ పల్లోంజీ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. పరంజాల మీద ఎత్తులో పనులు చేసే సందర్భాలలో అనుసరించాల్సిన భద్రతా చర్యలు, అత్యవసర పరిస్థితుల్లో స్పందించే పద్ధతులపై కార్మికులకు శిక్షణ నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఏపీ సిఆర్‌డీఏ అసిస్టెంట్ లేబర్ కమిషనర్ అనిత వాణి, సిఆర్‌డీఏ సీనియర్ ఓహెచ్ఎస్ అధికారి గుడివాడ గోపీకృష్ణ, సీనియర్ లేబర్ ఓహెచ్ఎస్ మేనేజర్లు బోయ శ్రీధర్‌రెడ్డి, పీజీఎంసీ ప్రతినిధులు, కాంట్రాక్టర్ సిబ్బంది, కార్మిక బృందం పాల్గొని కార్యక్రమం సాఫీగా సాగేలా సమన్వయం చేశారు.

# ఉక్కు కార్మికులు ఉక్కిరి బిక్కిరి




- ఉద్యోగాల కోత... వేతనాలపై కత్తి
- యాజమాన్యం దౌర్జన్యం... ప్రభుత్వాల నిశ్శబ్దం
- తుగ్లక్ నిర్ణయాలు... కార్మికులు ఆగ్రహం

గాజువాక, డిసెంబరు 3 ప్రభాతవార్త: విశాఖస్టీల్ ప్లాంట్‌లో కార్మికులపై అన్యాయాలు, యాజమాన్యం చేస్తున్న అడ్డదారులు మళ్లీ తీవ్రంగా చర్చనీయాంశంగా మారాయి. ఉక్కు యాజమాన్యం తీసుకుంటున్న తుగ్లక్ నిర్ణయాలతో కార్మికుల భవిష్యత్ అగమ్యగోచరంగా మారింది. ఉత్పత్తి పేరుతో వేతనాలను ముడిపెట్టడం, కార్మికుల తొలగింపులను న్యాయంగా చూపించే ప్రయత్నాలు, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల పూర్తిస్థాయి నిరక్ష్యం ఇవన్నీ కలిసి వేలాది కుటుంబాలను వీధి బాట పట్టిస్తున్నాయని కార్మిక సంఘాలు తీవ్రంగా మండిపడుతున్నాయి. 64 గ్రామాలు, 26 వేల ఎకరాలు, 32 మంది ప్రాణ త్యాగం... విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు నినాదంతో ఏర్పడ్డ విశాఖ ఉక్కు కర్మాగారం నేడు ప్రైవేటికరణ దిశగా అడుగులు వేయడం దారుణమని కార్మికలోకం అగ్గిమీద గుగ్గిళమవుతుంది.

ఉక్కు కర్మాగారంలో గణాంకాల ప్రకారం.. ఎమ్ఎమ్ డిపార్ట్మెంట్, మార్కెటింగ్, రోలింగ్ మిల్స్ ఎస్ఎమ్ఎస్, బ్లాస్ట్ ఫర్నేసు, సింటర్ ప్లాంట్, సీవో, సీసీపీలలో తొలుత అధికారులు, ఉద్యోగులు 18 వేల మంది ఉండే వారు. ప్రస్తుతం 9వేల 5వందల మంది ఉన్నారు. ఉద్యోగ విరమణ, స్వచంద ఉద్యోగ విరమణ చేసిన తరువాత 8 వేల 5 వందమంది ఉన్నారు. ఇక కాంట్రాక్టు కార్మికులైతే మొదట 15వేల మంది ఒప్పంద కార్మికులు ఉండేవారు. ఆ తరువాత ఉక్కు యాజమాన్యం వివిధ కారణాల చేత సుమారు 6వేల 5 వందల మందిని విధుల నుంచి తొలగించారు. తాజాగా గత సోమవారం 450 మందిని తొలగించింది. మరో 200 మందిని ఈ నెల చివరన తొలగొంచేందుకు ప్రయత్నిస్తుంది. దీంతో 7వేల నుంచి 8వేల మంది మిగిలిన పరిస్థితి. ఉత్పత్తి తగ్గిందనే పేరుతో కార్మికులపై మొత్తం భారం మోపుతూ, వ్యయాలు తగ్గించాలనే నెపంతో కార్మిక జీవితాలను పణంగా పెడుతోందని కార్మిక సంఘాల తీవ్రంగా ఆరోపిస్తున్నాయి. ఉత్పత్తి ఆధారంగా వేతనాల చెల్లింపు కార్మికులపై శిక్ష విధానమేనని, ఉత్పత్తి తగ్గితే వేతనం కూడా తగ్గాలనే తాజా విధానం పై కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ నిర్ణయం వల్ల నెలనెలా స్థిరత్వం లేని జీతాలు వస్తున్నాయనీ, దాంతో కుటుంబాలు తీవ్ర ఆర్థిక క్లేశాలు అనుభవిస్తున్నాయని కార్మికులు చెబుతున్నారు. ఉత్పత్తి యాజమాన్యం ప్లాన్ తప్పిదాల వల్ల తగ్గినా, శిక్ష మాత్రం కార్మికులకే ఎందుకు? అని ప్రశ్నిస్తున్నారు. సకాలంలో జీతాలు ఇవ్వకపోవడం, పనిస్థలాల్లో కనీస భద్రతా చర్యలు పాటించకపోవడం వల్ల గతంలో పలు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. అయినా యాజమాన్యం అసలు పట్టించుకోవడం లేదని యూనియన్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉత్పత్తి పేరుతో ప్రాణాలు తీసుకోవడమే యాజమాన్యం లక్ష్యం అయిపోయింది" అని వారు మండిపడుతున్నారు.

### యాజమాన్యం దౌర్జన్యం.. ప్రభుత్వాల నిశ్శబ్దం

ఉక్కు యాజమాన్యం తుగ్లక్ నిర్ణయాలతో కార్మికులు అనేక ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు, ఉక్కు ప్లాంట్‌ను పునరుద్ధరిస్తామని నిర్వాసితులకు శాశ్వత ఉపాధి కల్పిస్తామని, కాంట్రాక్టు కార్మికులకు భరోసా ఇస్తామనిమొత్తం మీద కార్మికులకు ఉపశమనం కల్పిస్తామని ఘనంగా హామీలు ఇచ్చింది. కానీ ఎన్నికలు ముగిసిన వెంటనే అవన్నీ మరుగున పడ్డాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిర్వాసితులు ఇప్పటికీ శాశ్వత ఉద్యోగాల కోసం ఎదురు చూస్తూనే ఉన్నారు. కానీ ఉక్కు యాజమాన్యం నిర్ణయాలపై ఎవరు నోరు మెదపటం లేదని, కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డి కుమారస్వామి చెప్పిన మాటలు, ఇచ్చిన హామీలు అవిరైపోయాయని కార్మిక సంఘాలు వాపోతున్నాయి. తొలగింపులతో వేలాది కాంట్రాక్టు కార్మికులు కుటుంబాలతో కలిసి అక్షరాలా రోడ్డున పడ్డారు. అయినా యాజమాన్యం స్పందించకపోవడమే గాక, పరిష్కారం కోసం కనీస సమావేశం కూడా ఏర్పాటు చేయకుండా ఎటూ వెళ్లని పరిస్థితిని సృష్టించిందని యూనియన్లు ఆరోపిస్తున్నాయి.

### కార్మికుల్లో ఆగ్రహం...

కార్మిక సంఘాలు పలుమార్లు కేంద్ర, రాష్ట్ర మంత్రులతో, అధికారులతో భేటీ అయ్యేందుకు ప్రయత్నించినా స్పందన ఏమీ రాలేదని నాయకులు చెబుతున్నారు. ఉక్కు కార్మికుల వేదనను అధికార యంత్రాంగం పూర్తిగా పట్టించుకోవడం లేదన్న భావన కార్మికుల్లో తీవ్ర ఆగ్రహానికి దారితీస్తోంది. ఈ అన్యాయాలపై స్టీల్ ప్లాంట్ పరిసరాల్లో రోజూ నిరసనలు, రచ్చబండ కార్యక్రమాలు జరుగుతూనే ఉన్నాయి. ఇకనైనా ప్రభుత్వాలు మేల్కొని ప్లాంట్ పరిస్థితిని పరిశీలించి, కార్మికులకు న్యాయం చేయాలంటూ యూనియన్లు హెచ్చరిస్తున్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే ఉక్కు ప్లాంట్ వద్ద భారీ ఉద్యమాలకు మేము సిద్ధం అని కార్మిక నాయకులు ధ్వజమెత్తుతున్నారు.

# గ్రీవెన్స్‌లో ఫిర్యాదులపై సత్వరమే చర్యలుండాలి

- అర్థరహితంగా పరిష్కరించరాదు
- గ్రీవెన్స్‌పై సిఎం ప్రత్యేక దృష్టి పెట్టారు
- రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్



అనంతపురం, డిసెంబరు 3 ప్రభాతవార్త బ్యూరో: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజా సమస్యల పరిష్కార వేదికని సమర్థవంతంగా వినియోగించుకోవాలని చెప్పి ప్రజల్ని కోరడం జరిగిందని, దాని మీద ప్రజలు పెద్ద ఎత్తున ప్రభుత్వానికి వివిధ స్థాయిల్లో అర్జీలు, దరఖాస్తులు ఇవ్వడం జరుగుతోందని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ వెల్లడించారు. ఫిర్యాదులపై నిర్ణీతకాలంలో స్పందించిన అధికారులపై చర్యలు తీసుకునేందుకు వెనుకాడవు అని ఆయన అన్నారు. గ్రీవెన్స్ లో వచ్చిన ఫిర్యాదులు, పరిష్కారాలకు సంబంధించి అనంతపురం లోని జిల్లా కలెక్టరేట్లో బుధవారం మంత్రి జిల్లా అధికారులతో కలెక్టర్ ఆనంద్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ అనంతపురం జిల్లాలో ఇప్పటివరకు పిజిఆర్ఎస్ ద్వారా దాదాపు 50,000 పైగా అర్జీలు రావడం జరిగిందని, అందులో 35,000 దాకా ఇప్పటికీ పరిష్కారం చేశామన్నారు. ఈ వ్యవస్థలో ఇంకా ఇంప్రూవ్ చేయాల్సింది చాలా ఉందని, కొన్ని పరిష్కారం అయినవి, పరిష్కారం కానటువంటివి కూడా అయినట్టుగా చూపించడం లాంటివి జరుగుతా ఉంటే, ముఖ్యమంత్రి మూడు అంచెల వ్యవస్థని, నాలుగు అంచెల వ్యవస్థని ఏర్పాటు చేద్దాం అనే దానిపై ఇప్పటికీ చెక్ పెట్టారన్నారు. ఏదైనా ఒక అధికారి, తనకు వచ్చినటువంటి ఫిర్యాదుని పరిష్కరించబడిందని కారణాలు చెప్పి క్లోజ్ చేస్తే, జిల్లాలో ఉన్నటువంటి ప్రీ ఆడిట్ టీం దగ్గర నుంచి, కాల్ సెంటర్ దగ్గర నుంచి ప్రతి ఫిర్యాదు మీద ఫిర్యాదుదారుడికి ఫోన్ వెళ్తుందని, ఆ సమస్య పరిష్కారం చేయబడిందా లేదా అనేటువంటిది కనుక్కోవడం జరుగుతుందని, ఆ సమస్య పరిష్కారం చేయబడలేదని అంటే, దాన్ని తిరిగి అదే పరిష్కారాన్ని ఓపెన్ చేసి ఆ అధికారికి కూడా దాన్ని ఫార్వర్డ్ చేయడం జరుగుతుందన్నారు. అర్థరహితంగా పరిష్కరించిన అధికారుల మీద చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఉన్నా కూడా, ఒకేసారి ఇట్లా చేయడం కన్నా ఒకటికి రెండుసార్లు చెప్పి పని చేయించాలనేటువంటి ఉద్దేశంతో దాని మీద ఒత్తిడి పెట్టి డ్రైవ్ చేయడం జరుగుతోందన్నారు. ఈరోజు సమీక్ష చేసినప్పుడు కొన్ని లోపాలు కూడా గుర్తించామన్నారు. ఒక స్థాయిలో ఇచ్చిన అర్జీ, అతని స్థాయి ఉన్నంత మేరకు పరిష్కారం చేసి అతను క్లోజ్ చేసినప్పుడు సమస్య పరిష్కారం కాలేదు కానీ అతని బాధ్యత తీరిపోయిందని చెబుతున్నారన్నారు. మనకున్నటువంటి సాఫ్ట్వేర్ లో ఇప్పటిదాకా దాన్ని అక్కడికే క్లోజర్ చూపించి, మీరు పై అధికారిని కలవండి అని చెప్పేసేవారని, అలా కాకుండా మార్పులు చేయాలని చెప్పామన్నారు. ఒక ఫిర్యాదుదారుడికి ఖచ్చితంగా ఒక రెస్పాన్సిబుల్ పర్సన్ ఇప్పుడు ఫిక్స్ అవుతాడన్నారు. సాధ్యమైనంత మేరకు సమస్యను పరిష్కారం చేయాలన్నారు. ఎక్కువగా సమస్యలు రెవెన్యూ, పోలీస్ మీద వస్తున్నాయని, 50 శాతం దాకా ఈ రెండు వ్యవస్థల్లోనూ అర్జీలు వస్తున్నాయని, మరింత లోతుగా అవగాహన చేసుకోవడం కోసం సమీక్ష నిర్వహించామని, దీనిపై జిల్లా కలెక్టర్ ని సమీక్ష చేయమని చెప్పామని, మేము కూడా ఎప్పుడు అవకాశం కుదిరితే అప్పుడు దాని మీద రివ్యూలు చేసి, గ్రీవెన్స్ పరిష్కారాన్ని పెంచాలను కుంటున్నామన్నారు. గ్రీవెన్స్ పరిష్కరించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాలు ఇచ్చారని, వాటి పరిష్కారానికి అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో టాప్ ప్రయారిటీ గ్రీవెన్స్ రెడ్రెసల్ మెకానిజం మీద కూడా దృష్టి పెట్టడం జరుగుతుందని, ప్రతి అర్జీని కూడా ప్రత్యేక అర్జీగానే భావించి ఆ సమస్యను పరిష్కరించడానికి ప్రయత్నం చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం బాధ్యతతో, చిత్తశుద్ధితో పనిచేస్తోందని, ప్రభుత్వంపై నమ్మకంతోనే అర్జీలు వస్తున్నాయని, ప్రతి అర్జీకి పరిష్కారం చూపించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

## బాపట్ల - మార్కాపురం రైల్వే లైన్

# సర్వే పూర్తి చేయండి

**కేంద్ర రైల్వే మంత్రికి ఎంపి కృష్ణప్రసాద్ వినతి**



విజయవాడ, డిసెంబరు 3 ప్రభాతవార్త ప్రతినిధి: బాపట్ల పార్లమెంట్ సభ్యులు, ప్యానల్ తెన్నేటి కృష్ణప్రసాద్ బుధవారం కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కి వినతి పత్రం సమర్పించారు. బాపట్ల–మార్కాపురం మధ్య కొత్త బ్రాడ్‌గేజ్ రైల్వే లైన్ నిర్మాణానికి సాధ్యతా అధ్యయనం, తుది స్థానం సర్వే ను తక్షణమే చేయాలని ఆయన కోరారు. ఈ ప్రతిపాదిత రైల్వే లైన్ బాపట్ల, పర్చూరు, అద్దంకి, సంతనూతలపాడు మీదుగా మార్కాపురం వరకు పయనిస్తుంది. ఇది బాపట్ల మరియు ప్రకాశం జిల్లాల ప్రజల చిరకాల ఆకాంక్ష అని ఎంపి పేర్కొన్నారు. అనేక గ్రామీణ మరియు సెమీఅర్బన్ ప్రాంతాలలో ముఖ్యంగా విద్యార్థులు, రైతులు, కార్మికులకు ఇది ఎంతో ఉపయోగపడుతుంది, ఈ ప్రాంతం వరి, మిరప, పత్తి, పొగాకు పంటలకు ప్రధాన కేంద్రం. అద్దంకి పరిసరాలలో సమృద్ధిగా ఉన్న సున్నపురాయి, ఎగుమతిస్థాయి గ్రానైట్ నిక్షేపాల భారీ రవాణాకు రైలు మార్గం ఎంతగానో దోహదపడుతుంది, రవాణా ఖర్చులను తగ్గిస్తుంది. అలాగే, తూర్పు తీరానికి, మార్కాపూర్, నంద్యాల, కర్ణాటకకు మధ్య సరుకు రవాణా కోసం ఇది సమర్థవంతమైన మార్గాన్ని సృష్టిస్తుంది. ఈ ప్రాజెక్టు ఖర్చు ప్రయోజన దృక్పథం అత్యంత అనుకూలంగా ఉందని పేర్కొంటూ, ప్రజల దీర్ఘకాలిక డిమాండ్‌ను నెరవేర్చడానికి మంత్రిత్వ శాఖ తక్షణమే స్పందించాలని తెన్నేటి కృష్ణప్రసాద్ విజ్ఞప్తి చేశారు.



# సిఎం దృష్టికి జిల్లాల పునర్విభజన అభ్యంతరాలు

**- రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి**

నెల్లూరు, డిసెంబరు 3 ప్రభాతవార్త–వైద్యం: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమాన్ని సమ్మిళితం చేస్తూ ప్రజలకు సుపరిపాలన అందించడమే ప్రధాన లక్ష్యంగా ఈనెలలో పెద్ద ఎత్తున ప్రభుత్వ కార్యక్రమాలు చేపడుతున్నట్లు రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. బుధవారం నెల్లూరు సంతపేటలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పలు ప్రభుత్వ కార్యక్రమాలపై ఎమ్మెల్సీ బీద రవిచంద్రతో కలిసి పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ 4న అన్ని నియోజకవర్గాల్లో డివిజనల్ అభివృద్ధి అధికారి కార్యాలయాల ప్రారంభోత్సవం, ఈ నెల 5న మెగా పేటీఎం కార్యక్రమాలను పండుగ వాతావరణంలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. రైతులకు ప్రభుత్వం తోడుగా ఉంటుందనే భరోసా కల్పించేందుకు రైతన్న మీ కోసం కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. రైతులకు ఈ ఖరీఫ్ సీజన్‌లో విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను అందిస్తూ వారికి అన్ని విధాల ప్రభుత్వం అండగా ఉందన్నారు.

### సిఎం దృష్టికి జిల్లా పునర్విభజన సమస్యలు

జిల్లాల పునర్విభజనపై అభ్యంతరాలు తెలిపేందుకు 30 రోజుల గడువును ప్రభుత్వం ప్రకటించిందని, ఈ లోగా ప్రజలు, ఆయా ప్రాంతాల ప్రజాప్రతినిధుల నుంచి వచ్చిన అభ్యంతరాలను, సలహాలను మంత్రివర్గ ఉపసంఘం దృష్టికి తీసుకెళ్తామని, అన్ని విషయాలను కూలంకుషంగా చర్చించిన తదుపరి సిఎం చంద్రబాబునాయుడు తది నిర్ణయం ప్రకటిస్తారని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ చెంచలబాబు యాదవ్, బొల్లినేని గిరినాయుడు, కేశవ్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.



# మొగలిచెర్ల దత్త మందిరంలో దత్తాత్రేయుని ఊంజల్‌సేవ

తిరుపతి, డిసెంబరు 3 ప్రభాతవార్త ప్రతినిధి: అవధూత దత్తాత్రేయస్వామి మందిరంలో దాత సహకారంతో అందించిన ఊయలలో ఆలయ నిర్వాహకులు స్వామివారి ఊంజల్‌సేవ నిర్వహించే అవకాశం లభించింది. నెల్లూరు జిల్లా లింగసముద్రం మండలం మొగలిచెర్ల గ్రామంలో వెలసిన దత్తాత్రేయ మందిరంకు నెల్లూరుకు చెందిన దాత కంఠం పద్మనాభరావు కుటుంబసభ్యులు బంగారువర్ణ త్రిడి డిజైన్‌తో త్రిమూర్తి దత్తాత్రేయుని అవతారంతో రూపొందించబడిన ఊయలను ఆలయానికి విరాళంగా అందించారు. కార్తీకపౌర్ణమి సందర్భంగా ప్రత్యేకంగా స్వామివారికి నేడు ఉదయం ఈ ఊయలసేవ నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పవని నాగేంద్రప్రసాద్, నిర్వాహక ప్రతినిధి పవని విష్ణుకౌశిక్ తెలిపారు. భక్తులు పాల్గొని స్వామివారి సేవలో తరించాలని కోరారు.



దాతలకు దుర్గమ్మవారిచిత్రపటం అందిస్తున్న దృశ్యం

# నేడు కలశజ్యోతి ఉత్సవం

ఇంద్రకీలాద్రి, డిసెంబరు 3 ప్రభాతవార్త: శ్రీ గంగా భవానీ సమేత దుర్గామల్లేశ్వరస్వామి వార్లు నగర వీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహించనున్నారు. గురువారం మార్గశిరమాసం పూర్ణిమ పర్వదినాన జరగబోయే కలశజ్యోతి ఉత్సవంలో సత్యనారాయణపురంలోని శ్రీ శృంగేరీ పీఠపరిపాలిత శ్రీ శివరామకృష్ణ క్షేత్రం నుండి బయల్దేరి నగరవీధుల గుండా విహరిస్తూ దుర్గమ్మవారి ఆలయానికి చేరుకుంటారు. ఈ ఉత్సవంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొనాలని ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు.

### నేడు గిరి ప్రదక్షణ

పౌర్ణమి పర్వదినాన ఉదయం 5.55లకు ఘాట్‌రోడ్డు వద్ద వేంచేసియున్న శ్రీ కామధేను మాత ఆలయం వద్ద నుండి బయల్దేరి శ్రీ స్వామి అమ్మవార్ల గిరి ప్రదక్షణ గురువారం నిర్వహిస్తామని భక్తులు పాల్గొనాలని ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు.

### నిత్యాన్నదాన పథకానికి విరాళం

దుర్గమ్మవారి ఆలయంలో జరిగే నిత్యాన్నదాన పథకానికి రూ.1,00,116ల విరాళాన్ని విజయవాడకు చెందిన సతీష్‌కుమార్ తన కుటుంబసభ్యులతో కలిసి బుధవారం అందించారు. విజయవాడకు చెందిన మరో దాత కనపర్తి వెంకట రవిరాజ తమ కుటుంబసభ్యులతో కలిసి రూ.1,00,116ల విరాళం అందించారు. దాతలకు దుర్గమ్మవారి దర్శనం ఏర్పాటు చేసిన అధికారులు వారికి దుర్గమ్మవారి చిత్రపటం, ప్రసాదం, చిత్రపటం, శేష వస్త్రాలందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలందించారు.

# కూటమి ప్రభుత్వంలో మహిళలకు ప్రాధాన్యత

**డ్వాక్రా సాధికార కమిటీ రాష్ట్ర అధ్యక్షురాలు ఆచంట సునీత**

విజయవాడ, డిసెంబరు 3 ప్రభాతవార్త ప్రతినిధి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 18 నెలల్లోనే మహిళా సంక్షేమం, సాధికారతలో ఆంధ్రప్రదేశ్ దేశానికే ఆదర్శంగా నిలిచిందని డ్వాక్రా సాధికార కమిటీ రాష్ట్ర అధ్యక్షురాలు ఆచంట సునీత అన్నారు. ఎన్టీఆర్ భవన్‌లో ఆమె మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఎప్పుడూ మహిళల అభివృద్ధినే రాష్ట్ర అభివృద్ధిగా భావిస్తారని, ఆ దిశగా సూపర్ సిక్స్ హామీలను ఇచ్చిన మాట తప్పకుండా నెరవేరుస్తూ సూపర్ హిట్ చేశారని కొనియాడారు. గత వైసీపీ ప్రభుత్వం డ్వాక్రా మహిళల పొదుపు నిధులను కూడా దోచుకుందని, వారిని కేవలం రాజకీయ కార్యకర్తలుగానే వాడుకుందని ఆరోపించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం పావలా వడ్డీ రుణాలను రూ.5 లక్షలకు పెంచడంతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళలకు రూ.2-5 లక్షల వరకు వడ్డీ రహిత రుణాలు అందిస్తోందని తెలిపారు. ఉచిత బస్సు ప్రయాణం ద్వారా చిరు వ్యాపారస్తులు, విద్యార్థినులు నెలకు రూ.1,500 నుంచి రూ.3,000 వరకు ఆదా చేసుకుంటున్నారని, ఇది మహిళలకు ఎంతటి ఊరట కలిగించిందో ప్రతి మహిళా నోట వినిపిస్తోందని అన్నారు. తల్లికి వందనం కార్యక్రమం ద్వారా ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉన్నా అందరికీ సహాయం అందేలా 67 లక్షల మంది తల్లుల ఖాతాల్లో నగదు జమ చేశామని, ఇది దేశంలోనే అరుదైన కార్యక్రమమని పేర్కొన్నారు.

# గాయపడిన ఏనుగు మృతి

తిరుపతి, డిసెంబరు 3 ప్రభాతవార్త ప్రతినిధి: చిత్తూరు జిల్లా యాదమరి సమీపంలో చెరువులో కూరుకుపోయి రక్షించిన ఏనుగు తిరుపతి ఎస్వీ జూలో చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం మృతి చెందింది. రెండురోజుల క్రిందట ఏనుగు యాదమరి పరదరామి రిజర్వు ఫారెస్ట్‌లోని గుడ్డివానిచెరువులో దిగి బురదలో కూరుకుపోయి తీవ్రంగా గాయపడింది. స్థానికుల సమాచారంతో అటవీశాఖ అధికారులు తిరుపతి జూపార్కు సిబ్బందితో రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించి మత్తుమందుతో జూకు తరలించారు. రెండురోజులుగా జూలో చికిత్స తీసుకుంటున్న ఏనుగు క్రమంగా ఆహారం తీసుకోలేకపోవడంతో ద్రవాలను పంపి పశువైద్య అధికారులు చికిత్స చేశారు. బుధవారం సాయంత్రం మృతి చెందడంతో ఎస్వీ పశువైద్య కళాశాల వైద్యులు, జూ వైద్యులు పోస్టుమార్టమ్ నిర్వహించి అనంతరం ఖననం చేశారు.

# ఆట

### వింటర్ నేషనల్ బ్రిడ్జ్ ఛాంపియన్‌షిప్‌లో

## విద్య, కల్పనకు టైటిల్స్

**న్యూఢిల్లీ:** వింటర్ నేషనల్ బ్రిడ్జ్ ఛాంపియన్‌షిప్-2025లో విద్యా పటేల్-కల్పన గుర్జర్ మహిళల జంట టైటిల్‌ను గెలుచుకున్నారు. 67వ అశోక్ రుయా మెమోరియల్ వింటర్ నేషనల్ బ్రిడ్జ్ ఛాంపియన్‌షిప్‌లో రెండో రోజు మధ్యప్రదేశ్‌లోని రాయ్‌బిద్‌పురా గ్రామానికి చెందిన విద్యా-కల్పనా జంట అమ్లా రుయా ఉమెన్ పెయిర్స్ టైటిల్‌ను కైవసం చేసుకున్నారు. ఈ సంవత్సరం ప్రారంభంలో చెన్నైలో జరిగిన జాతీయ మహిళా పెయిర్స్ ఈవెంట్‌ను గెలుచుకున్న విద్యా-కల్పన 57.42 అంతర్జాతీయ మ్యాచ్ పాయింట్లు సాధించారు. రేఖా మోడీ-వందన టూస్లిదాస్ 56 ఐఎంపీలను సేకరించి రన్నరప్ స్థానంతో, సంగీత మోహ్తా-బర్నా ఖత్రీ 26.89 ఐఎంపీలు సేకరించి 3వ స్థానంలో నిలిచారు. క్వాలిఫైయింగ్ రౌండ్ల ముగింపులో మొదటి, రెండవ స్థానాలను కైవసం చేసుకున్న కామ్నా శర్మ రిచా శ్రీరామ్-వసంతి షా భారతి డే అంచనాలను అందుకోలేకపోయారు. తదుపరి చివరి రౌండ్ ముగింపులో వరుసగా 3 ఐఎంపీలు, 16.68 ఐఎంపీలతో 6వ మరియు 5వ స్థానాల్లో నిలిచారు.





## రోహిత్‌కు దగ్గరగా కోహ్లీ

### 32 రేటింగ్ పాయింట్ల దూరం

**న్యూఢిల్లీ:** ఐసిసి ర్యాంకింగ్స్ 83వ అంతర్జాతీయ సెంచరీ సాధించి వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో నిలిచేందుకు భారత దిగ్గజం విరాట్ కోహ్లీ ఉవ్విళూరుతున్నాడు. తద్వారా తన సహచరుడు రోహిత్ శర్మను అధిగమించేందుకు దగ్గరవుతున్నాడు. ఇందుకు రోహిత్‌కు కేవలం 32 రేటింగ్ పాయింట్ల దూరంలో ఉన్నాడు. బుధవారం విడుదలైన వరల్డ్ ర్యాంకింగ్స్‌లో ఈ విషయం వెల్లడైంది. దక్షిణాఫ్రికాతో రాంచీలో జరిగిన మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ తొలి వన్డేలో, 37 ఏళ్ల కోహ్లీ 120 బంతుల్లో 135 పరుగులు చేశాడు. అతని ప్రదర్శన అతన్ని ఒక స్థానానికి ఎగబాకి నాల్గవ స్థానంలో ఉన్నాడు. ప్రస్తుతం కోహ్లీ రేటింగ్ 751 పాయింట్లకు చేరుకుంది. గత దశాబ్దం చివరి నాటికి కోహ్లీ మూడు సంవత్సరాలకు పైగా అగ్రస్థానంలో ఉన్నాడు, కానీ 2021 ఏప్రిల్‌లో పాకిస్తాన్‌కు చెందిన బాబర్ అజామ్ అతన్ని అధిగమించినప్పటి నుండి అతను అగ్రస్థానాన్ని నిలబెట్టుకోలేదు. ఇంతలో, రోహిత్ అగ్రస్థానంలో తన ఆధిక్యాన్ని పెంచుకున్నాడు. న్యూజిలాండ్‌కు చెందిన రెండవ స్థానంలో ఉన్న డారిల్ మిచెల్ మరియు 3వ స్థానంలో ఉన్న ఆఫ్ఘనిస్తాన్‌కు చెందిన ఇబ్రహీం జాద్రాన్‌లను అధిగమించాడు. అయితే కోహ్లీ తన సహచరుడు శుభ్‌మాన్ గిల్‌ను అధిగమించి 4వ స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. ఇక వన్డే బౌలర్లలో ఎడమచేతి వాటం స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ ఒక స్థానం ఎగబాకి ఆరో స్థానంలో నిలిచాడు. ఇంతలో, ఇటీవల పాకిస్తాన్‌లో జరిగిన ట్రైసిరీస్ తర్వాత టి20 ఆల్ రౌండర్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానం మరోసారి మారిపోయింది. ఫైనల్లో శ్రీలంకపై 6 వికెట్ల తేడాతో విజయం సాధించి పాకిస్తాన్ ముక్కోణపు సిరీస్‌ను కైవసం చేసుకుంది. ఓపెనర్ సైమ్ అయూబ్ ఆల్‌రౌండర్ల ర్యాంకింగ్స్‌లో తన అగ్రస్థానాన్ని తిరిగి పొందాడు. ముక్కోణపు సిరీస్‌లో పాకిస్తాన్ విజయంతో సహచరులు అబ్రార్ అహ్మద్ (4 స్థానానికి) మరియు మహ్మద్ నవాజ్ (2 స్థానాలు ఎగబాకి 11వ స్థానానికి) బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో తమ స్థానాలను మెరుగుపరుచుకున్నాడు. ముక్కోణపు సిరీస్‌లో కమిల్ మిషారా ప్రదర్శన శ్రీలంకకు మరింత బలానిచ్చింది. ఈ మ్యాచ్‌లో అతను నాలుగు ఇన్నింగ్స్‌లలో 169 పరుగులు చేయడంతో టెస్ట్ ఆల్ రౌండర్ల ర్యాంకింగ్స్‌లో జాన్సెన్ నాలుగు

### మహిళా ఫుట్‌బాల్‌లో భారత్

## అజేయ విజయ పరంపర

### ఉజ్బెకిస్థాన్‌పై 4-2 తేడాతో విక్టరీ



**న్యూఢిల్లీ:** భారత అండర్20 మహిళా ఫుట్‌బాల్ జట్టు తన అజేయ విజయ పరంపరను కొనసాగిస్తూ 9 ఆటలకు విస్తరింప చేసింది. మహాబలిపురంలో జరిగిన 2 మ్యాచ్‌ల సిరీస్‌లో భారత అండర్ 20 మహిళా ఫుట్‌బాల్ జట్టు ఉజ్బెకిస్తాన్‌పై వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసింది. ఈ సంవత్సరం ఆ జట్టు తమ మంచి ఫామ్‌ను కొనసాగించి ఉజ్బెక్స్‌పై 4-2 తేడాతో ఆధిపత్య విజయాన్ని సాధించింది. అంతేకాకుండా చారిత్రాత్మక ఆసియా కప్ క్వాలిఫైయర్‌లతో సహా 9 ఆటలకు వారి అజేయ విజయాన్ని విస్తరించింది. గత మ్యాచ్ కంటే భారత్ తన గోల్ స్కోరింగ్ సామర్థ్యాన్ని మెరుగుపరుచుకుంది. ఆ మ్యాచ్‌లో ఒకే ఒక్క గోల్ తేడాతో అదే ప్రత్యర్థులను అధిగమించింది. ఇక గత నెలలో యంగ్ టైగ్రెస్సెస్ కజకిస్తాన్ అండర్ 19 తో షిమ్కెంట్‌లో రెండు మ్యాచ్‌లు ఆడింది, 3-2 తేడాతో గెలిచి 1-1తో డ్రాగా ముగిసింది. మొత్తం మీద, ఈ సంవత్సరం భారత్ మహిళా జట్టు 12 ఆటలు ఆడింది. ఫిబ్రవరిలో ఉన్నత ర్యాంక్‌లో ఉన్న రష్యాతో జరిగిన మ్యాచ్‌లో 8 విజయాలు, 3 డ్రాలు, ఒకే ఒక ఓటమితో ఘన విజయం సాధించింది. ఫలితంగా రెండు దశాబ్దాల తర్వాత మహిళల అండర్ 20 ఆసియా కప్‌కు చారిత్రాత్మక అర్హత సాధించింది. ఇదే గ్రూప్‌లో జపాన్, ఆస్ట్రేలియా మరియు చైనీస్ తైపీ వంటి జట్లు ఉన్నాయి. కాగా ఆసియా కప్ 2026 ఏప్రిల్ 1-18 వరకు థాయిలాండ్‌లో జరుగుతుంది.

### ప్రతీకారం తీర్చుకున్న

## న్యూజిలాండ్

### 167కే కుప్పకూలిన వెస్టిండీస్

**న్యూఢిల్లీ:** న్యూజిలాండ్, వెస్టిండీస్ మధ్య జరుగుతున్న తొలి టెస్ట్ మ్యాచ్ హోరాహోరీగా సాగుతోంది. తొలుత విండీస్ బౌలర్లు రెచ్చిపోయి 231 పరుగులకే కట్టడి చేయగా, ఆ తర్వాత కివీస్ బౌలర్లు విండీస్‌ను 167 పరుగులకే కుప్పకూల్చి ప్రతీకారం తీర్చుకున్నారు. బుధవారం క్రైస్ట్‌చర్చ్‌లోని హాగ్లీ ఓవల్‌లో వెస్టిండీస్‌తో జరిగిన తొలి టెస్టు మ్యాచ్‌లో రెండో రోజు న్యూజిలాండ్ జట్టుపై మీడియాం పేసర్ జాకబ్ డఫీ టెస్టుల్లో తొలిసారి 5 వికెట్లు పడగొట్టాడు. అతను 34 పరుగులకు ఐదు వికెట్లు పడగొట్టడం, మాట్ హెన్రీ మూడు వికెట్లు తీయడంతో న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్‌లో సాధించిన 231 పరుగలకు సమాధానంగా వెస్టిండీస్ స్వల్ప స్కోరుకు ఆలౌట్ అయింది. తేజ్‌నరైన్ చంద్రపాల్ (52), షాయ్ హోప్ (56) అర్ధ సెంచరీలతో రాణించడంతో వెస్టిండీస్ ఈ మాత్రం స్కోరు అయినా చేయగలిగింది. వీరు కాకుండా ఇమ్లాచ్ (14), రోచ్ (10 నాటౌట్) మాత్రమే రెండంకెల స్కోర్లు చేయగలిగారు. వెస్టిండీస్ ఇన్నింగ్స్‌లో ఏకంగా నలుగురు ఖాతా కూడా తెరవలేకపోయారు. అంతకు ముందు విండీస్ బౌలర్లు తలో చేయి వేసి కివీస్‌ను స్వల్ప స్కోరుకే కట్టడి చేశారు. కేన్ విలియమ్సన్ (52), బ్రేస్ వెల్ (47) ఓ మోస్తరుగా రాణించడంతో ఆ జట్టు ఒక మోస్తరు స్కోరు చేసింది. ఇక ఆట ముగిసే సమయానికి ఆతిథ్య జట్టు తన రెండో ఇన్నింగ్స్‌లో వికెట్ నష్టపోకుండా 32 పరుగులు చేసి ఆధిక్యాన్ని 96 పరుగులకు పెంచుకుంది.





## ఆసియా ఈక్వెస్ట్రియన్ ఛాంపియన్‌లో ఆశిష్‌కు స్వర్ణం

**న్యూఢిల్లీ:** ఆసియా ఈక్వెస్ట్రియన్ ఛాంపియన్‌షిప్-2025లో ఆశిష్ లిమాయే స్వర్ణంతో మెరిశాడు. థాయిలాండ్‌లో జరిగిన ఈ ఈవెంట్‌లో భారతదేశం తరపున మొట్టమొదటి బంగారు పతకాన్ని గెలుచుకోవడం ద్వారా ఆశిష్ లిమాయే బుధవారం పట్టాయాలో చరిత్ర సృష్టించాడు. మూడు రోజుల పాటు జరిగిన ఈవెంటింగ్ పోటీలో మొత్తం 29.4 స్కోరుతో అతను అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నాడు. 1982 ఆసియా క్రీడల తర్వాత వ్యక్తిగత ఖండాంతర స్వర్ణం గెలుచుకున్న తొలి భారతీయుడు అయ్యాడు. అలాగే ఆశిష్, శశాంక్ కనుమూరి, శశాంక్ కటారియాలతో కూడిన భారత జట్టు 121.8 స్కోరుతో రజత పతకాన్ని కైవసం చేసుకుంది. థాయిలాండ్ (117.6) కంటే కొంచెం వెనుకబడి ఉంది. తన గుర్రమైన విల్లీ బీ డన్‌పై స్వారీ చేస్తూ, ఆశిష్ డ్రెస్సేజ్ రౌండ్ తర్వాత మూడవ స్థానంలో నిలిచాడు. ఆసియా క్రీడల స్వర్ణం, రజత పతక విజేతలు హువా టియాన్ (చైనా) మరియు కొర్ంటావత్ సమ్రాన్ (థాయిలాండ్) కంటే వెనుకబడి ఉన్నాడు. అయితే అతను క్రాస్‌కంట్రీ మరియు జంపింగ్ దశల్లో అద్భుతమైన పునరాగమనాన్ని ప్రదర్శించాడు. ఎటువంటి సమయ పెనాల్టీలు లేకుండా దోషరహిత రౌండ్లను సృష్టించాడు. ఈవెంటింగ్‌లో ఈ రెండు పతకాలతో పాటు, డ్రెస్సేజ్ ఈవెంట్‌ల నుండి మూడు పతకాలతో భారత్ ఇప్పుడు ఆసియా ఈక్వెస్ట్రియన్ ఛాంపియన్‌షిప్‌లో 5 పతకాలు (ఒక స్వర్ణం మరియు నాలుగు రజతాలు)తో అత్యుత్తమ సంఖ్యను సాధించింది.

## పసిడితోపాటే వెండి ధరలు పరుగులు!



**ముంబయి, డిసెంబరు 3:** బంగారంతో పాటే ఇపుడు వెండికూడా మరింత ప్రియం అవుతోంది. దేశీయంగా కిలో వెండి ధరలు రూ.1.84 లక్షలుగా కొనసాగుతోంది. పసిడి కూడా పది గ్రాముల విలువ రూ.1.30 లక్షలకు పైగానే ఉంది. అంతర్జాతీయ మార్కెట్లలో ధరపెరగడానికి తోడు రూపాయి విలువలు క్షీణించడం కూడా ఈ విలువైన లోహాల ధరలు పెరగడానికి కారణం అని ఆర్థికవేత్తలు, బులియన్ నిపుణులు చెపుతున్నారు. ఎంసిఎక్స్ గోల్డ్ ఫ్యూచర్స్‌లో 2026 ఫిబ్రవరి కాంట్రాక్టు 10 గ్రాములధర రూ.1.30 లక్షలుగా పలుకుతోంది. అలాగే ఎంసిఎక్స్‌లోమార్చి డెలివరీవెండి అత్యధికంగా రూ.3126 పెరిగి రూ.1,84,727 వద్ద ఆల్‌టైమ్ గరిష్టానికి చేరింది. బుధవారం డాలరుతో రూపాయి మారకం విలువలు రూ.90 మార్కు దాటింది. దీనితో దేశీయంగా ధరలు పెరిగాయి. ఫెడ్‌రిజర్వు వడ్డీరేట్లు తగ్గిస్తుందన్న అంచనాలుకూడా అంతర్జాతీయ మార్కెట్‌లోను, ఫ్యూచర్ మార్కెట్‌లోనూ ధరలు పెరుగుతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం గ్లోబల్ మార్కెట్‌లో స్పాట్ రేట్ ఔన్స్ విలువలు 4204 డాలర్లవద్దట్రేడ్ అవుతోంది.

వెండి ఔన్స్ ఒక్కింటికి 57.90 డాలర్లవద్ద కొనసాగుతోంది. మధ్యాహ్నం ఒంటిగంట సమయానికి హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 10 గ్రాముల స్వచ్ఛమైన పసిడి రూ.1.32 లక్షలు పలుకుతుండగా కిలో వెండి రూ.1.83 లక్షలుగా ఉంది.రానున్న రోజుల్లో వెండి కిలో ధరలు రూ.2 లక్షలు దాటేస్తుందన్న అంచనాలు కూడా జోరందుకున్నాయి. సౌరవిద్యుత్ పలకాల్లోను, పూజాసామగ్రి, దేవుళ్ల బొమ్మలు, సంపన్నుల ఇళ్లల్లో పళ్లాలు, గ్లాసులు వెండివే కొనుగోలుచేస్తుంటారు. అలాగే పారిశ్రామికంగా వెండి వినియోగం కూడా పెరగడంతో ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. కాగా బుధవారం బంగారంధరలు తులం ధరలు రూ.710 పెరిగితే కిలో వెండిధరలు రూ.3వేలు పెరిగింది.

## నాలుగోరోజూ నష్టాల్లోనే సూచీలు

### రూపాయి పతనం.. ఇన్వెస్టర్ల లాభాల స్వీకరణే కీలకం




**ముంబయి, డిసెంబరు 3:** స్టాక్ మార్కెట్లలో కీలక ఈక్విటీసూచీలు నాలుగోరోజు కూడా నష్టాలపాలయ్యాయి. ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గుచూపించడం, ఆర్‌బిఐ పాలసీ నిర్ణయాలు, డాలర్ రూపాయి మారకం విలువలు క్షీణించడం, విదేశీఇన్వెస్టర్లు పెట్టుబడుల ఉపసంహరణ వంటివి మార్కెట్లకు నష్టాలు తెచ్చిపెట్టాయి. నిఫ్టీ 26 వేల దిగువన ముగిసింది. పిఎస్‌యు బ్యాంకుషేర్లలో భారీ పతనం కనిపించింది. ప్రభుత్వానికి ఎఫ్‌డిఐ పరిమితి పెంచే ఉద్దేశ్యం లేదన్న సమాచారం బ్యాంకుషేర్లకు నష్టాలు తెచ్చింది. వినియోగరంగం, ఆటో మొబైల్ స్టాక్స్ కొంతమేర పర్వాలేదనిపించాయి.ఐటిషేర్లు ఒత్తిడితో కొనసాగాయి. బిఎస్‌ఇ సెన్సెక్స్ 31.46 పాయింట్ల నష్టంతో 85,106.81వద్ద ముగిసింది. నిఫ్టీ 50 సూచీ కూడా 46.20 పాయింట్లు క్షీణించి 25,986వద్ద ముగిసింది. మూడు సెషన్లలోను సెన్సెక్స్ 0.72శాతం క్షీణిస్తే నిఫ్టీ 0.88శాతం క్షీణించింది. ఆదాని ఎంటర్‌ప్రైజెస్ 2.26శాతం, మహీంద్ర 1.79శాతం, ఎస్‌బిఐ 1.69శాతం చొప్పున క్షీణించాయి. ఇక బిఎస్‌ఇ మిడ్‌క్యాప్‌సూచీ 0.95శాతం, స్మాల్‌క్యాప్‌సూచీ 0.43శాతం చొప్పున ముగిసాయి. మార్కెట్లపరంగా బిఎస్‌ఇలో 1481 కంపెనీల షేర్లు పెరిగితే 2681షేర్లు క్షీణించాయి. మొత్తంగా 159 కంపెనీల షేర్లు స్థిరంగా కొనసాగాయి. డాలరుతో రూపాయి మారకం విలువలు ఒకేసారి 90కి చేరుకుంది. విదేశీ ఇన్వెస్టర్ల విత్‌డ్రాలే ఇందుకు కీలకం అయింది. ఇక స్టాక్స్‌పరంగా పిఎస్‌యు బ్యాంక్‌సూచీ 3.07శాతం దిగజారింది. అలాగే ఏంజెల్ వన్ 5.21శాతం క్షీణించింది. బజాజ్‌ఫైనాన్స్ కూడా 0.50శాతం దిగజారింది. ఐఆర్‌ఎఫ్‌సి కూడా 1.42శాతం పతనం అయ్యాయి. ఇక మహీంద్ర లైఫ్ స్పేస్ డెవలపర్స్ 0.25శాతంగా ఉంది.క్వాలిటీ పవర్ ఎక్విప్‌మెంట్ 2.65శాతం పెరిగితే గుజరాత్ పిపావావ్ పోర్టు 1.40శాతం పెరిగింది. ఇక మోయిల్ కూడా 0.40శాతం పెరిగినట్లు తేలింది.



## ఆల్‌టైమ్ కనిష్టానికి భారత్ రూపాయి

**ముంబయి, డిసెంబరు 3:**అంతర్జాతీయ మార్కెట్‌లో అమెరికా డాలర్‌తో పోలిస్తే భారత్ రూపాయి మారకం విలువ చారిత్రాత్మక కనిష్ఠ స్థాయికి పడిపోయింది. ఎఫ్‌ఐఐ అమ్మకాలు, డాలర్‌కు కొనుగోళ్ల మద్దతు వంటి కారణాల వల్ల రూపాయి పతనం అవుతోందని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. అమెరికా భారత్‌లమధ్య జరుగుతున్న వాణిజ్య చర్చల్లో ప్రతిష్టంభన, విదేశీ ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణ వంటివి రూపాయల క్షీణతకు కారణం అయింది.

బుధవారం నాటి ఫారెక్స్ ట్రేడింగ్‌లో రూపాయి విలువ తొలిసారిగా 90 మార్క్‌ను దాటి సరికొత్త ఆల్‌టైమ్ కనిష్ఠాన్ని నమోదు చేసింది. ముందురోజు 89.96 వద్ద స్థిరపడిన రూపాయి, బుధవారం ఉదయం సెషన్ ప్రారంభంనుంచే బలహీనంగా కదలాడింది. భారత కరెన్సీ రూపాయి కొద్దికాలంగా తీవ్రంగా పతనమవుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ ముఖ్య ఆర్థిక సలహాదారు (సిఇఎ) వి. అనంత నాగేశ్వరన్ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వచ్చే ఏడాది పరిస్థితి మెరుగు పడుతుందని దీనివల్ల ద్రవ్యోల్బణం లేదా ఎగుమతులపై ఎలాంటి ప్రభావం ఉండదని ఆయన స్పష్టం చేశారు.

## ఈనెలాఖరు వరకే ఐటి రిటర్నులకు గడువు!

**న్యూఢిల్లీ, డిసెంబరు 3:** ఆదాయపు పన్ను రిటర్నులు దాఖలు చేసే పన్ను చెల్లింపుదారులకు ఐటిశాఖ చివరిఛాన్స్ ఇచ్చింది. ఆర్థిక సంవత్సరం 2024-25కు సంబంధించి మీరు రివైజ్డ్ లేదా ఆలస్యపు రిటర్న్‌లను ఫైల్ చేసేందుకు గడువు తేదీ డిసెంబరు 31తో ముగియనుంది. ఈ గడువును దాటకముందే పన్ను చెల్లింపుదారులు తమ బాధ్యతలను పూర్తి చేసుకోవాలని ఆదాయపు పన్ను శాఖ వెల్లడించింది. గడువులోపు పూర్తి చేయని వారికి ఐటీ శాఖ నుంచి నోటీసులు వస్తాయి. పన్ను బకాయిలు ఉంటే భారీగా పెనాల్టీలతో పాటు కొన్నిసార్లు జైలుకు సైతం వెళ్లాల్సి రావచ్చని హెచ్చరించింది. సాధారణంగా ఆర్థిక సంవత్సరం 2024-25కు సంబంధించిన ఐటిఆర్ ఫైలింగ్ గడువు రెండుసార్లు పొడిగించారు. సెప్టెంబర్ 16వ తేదీతో ఈ గడువు ముగిసింది. అయితే, ఆ రిటర్నులలో ఏవైనా పొరపాట్లు జరిగాయని గుర్తించినట్లయితే పన్ను చెల్లింపుదారులు సెక్షన్ 139(5) కింద డిసెంబర్ 31 వరకు రివైజ్డ్ రిటర్న్‌లు దాఖలు చేయవచ్చు. ఏదైనా ముఖ్యమైన సమాచారాన్ని చేర్చడం మరచిపోయినా లేదా పొరపాటు చేసినా ఆ తప్పును సరిదిద్దుకోవడానికి రివైజ్డ్ ట్యాక్స్ రిటర్న్‌ను ఫైల్ చేయవచ్చు. ఈ పొరపాటు అనుకోకుండా జరిగిన తప్పిదం కావచ్చు. సెక్షన్ 139(1) కింద నిర్దేశించిన అసలు గడువు తేదీ ముగిసిన తర్వాత దాఖలు చేసే రిటర్న్‌ను ఆలస్యపు రిటర్న్ అంటారు. మీరు ఏదైనా ఆదాయాన్ని వెల్లడించకపోయినా లేదా పన్ను రిఫండ్‌ను క్లెయిమ్ చేయాల్సి ఉన్నా, ఆలస్యపు ఐటిఆర్‌ను డిసెంబర్ 31 లోపు ఫైల్ చేయవచ్చు. డిసెంబర్ 31వ తేదీ తర్వాత, పన్ను చెల్లింపుదారులు ఏవైనా ఆదాయపు పన్ను రిఫండ్‌లను క్లెయిమ్ చేసుకునే అవకాశం ఉండదు. ఆలస్యంగా రిటర్న్ దాఖలు చేసినందుకు పన్ను చెల్లింపుదారుల నుంచి లేట్ ఫైలింగ్ ఫీజు, వడ్డీ కూడా వసూలు చేస్తారు. ఐటీఆర్ ఫైల్ చేయని వారికి ఐటీ శాఖ నోటీసులు పంపిస్తుంది. తప్పుడు టిడిఎస్ క్లెయిమ్ లేదా ఆదాయాన్ని తక్కువగా చూపడం వంటి లోపాలు ఉన్నప్పుడు కూడా పన్ను చెల్లింపుదారులు ఆలస్యంగా లేదా సవరించిన రిటర్న్‌ను దాఖలు చేయవలసి వస్తుంది. కాబట్టి, పన్ను చెల్లింపుదారులు డిసెంబరు 31, 2025 గడువును దృష్టిలో ఉంచుకుని, తమ ఆర్థిక బాధ్యతలను సకాలంలో పూర్తి చేసుకోవడం తప్పనిసరి.




## ప్రైవేటు క్యాబ్‌లకు దీటుగా 'భారత్ ట్యాక్సీ'!




**న్యూఢిల్లీ, డిసెంబరు 3:** దేశంలోని రెండు ప్రధాననగరాల్లో కొత్త ట్యాక్సీ పరుగులు పెట్టేందుకు సిద్ధం అవుతోంది. క్యాబ్‌డ్రైవర్లకు యాజమాన్య హక్కులు కల్పించే లక్ష్యంతో భారత్ ట్యాక్సీ రూపుదిద్దుకున్నది. ఓలా, ఊబర్ వంటిప్రైవేటు క్యాబ్ సంస్థలకు చెక్‌పెడుతూ ప్రత్యామ్నాయంగా దేశవ్యాప్తంగా డ్రైవర్లకు ఆర్థిక సాధికారత కల్పించే లక్ష్యంతో భారత్ ట్యాక్సీ వస్తోంది. ప్రస్తుతం ఢిల్లీ, గుజరాత్‌లోని సౌరాష్ట్ర ప్రాంతాల్లో ప్రారంభిం చారు. సహకార్ ట్యాక్సీ కోఆపరేటివ్ ఈ సేవలు ప్రారంభించింది. బీటా యూజర్లతో ట్రయల్‌రన్‌కూడా ప్రారంభించారు. ప్రపంచంలోనే అతిపెద్ద డ్రైవర్ యజమా నిగా ఉన్న నెట్‌వర్క్‌గా భారత్ ట్యాక్సీ ఎదుగుతుందని చెపుతున్నారు. ఇప్పటికే 51 వేలమందికిపైగా డ్రైవర్లను ఈప్లాట్‌ఫమ్‌పైకి తీసుకువచ్చారు. భారత్ ట్యాక్సీ మొబైల్‌యాప్‌ప్రస్తుతం గూగుల్‌ప్లేస్టోర్‌లో ట్రయల్ అండ్ ఫీడ్‌బ్యాక్‌కోసం అందుబాటులో ఉంచారు. ఐఒఎస్ వెర్షన్‌కూడా త్వరలోనే విడుదలచేస్తున్నారు. ఆప్‌ను భారత్ ట్యాక్సీడ్రైవర్‌పేరుతో సహకార్ ట్యాక్సీ కోఆపరేటివ్ విడుదలచేసింది. యాప్‌ను ఢిల్లీ మెట్రోతో అనుసంధానంచేసారు. ప్రయాణీకులు మెట్రో, క్యాబ్‌సేవలు ఒకే యాప్‌లో బుక్‌చేసుకుని మొత్తం ప్రయాణం చేసుకునే వీలుంది. మల్టీమోడల్ రవాణాను సులభతరంచేస్తుందని సహకార్‌సంస్థ వెల్లడించింది.




## మారుతి సుజుకినుంచి సరికొత్త ఇ-విటారా

**న్యూఢిల్లీ, డిసెంబరు 3:** కార్ల తయారీలో అగ్రగామి సంస్థయైన మారుతి సుజుకీ తన తొలి ఎలక్ట్రిక్ వాహనమైన ఇ-విటారాను ప్రదర్శించింది. వచ్చే ఏడాది దేశీయ మార్కెట్లోకి విడుదల చేయనున్న ఈ కారుపై అప్పుడే భారీ అంచనాలు నెలకొన్నాయి. 49 కిలోవాట్లు, 61 కిలోవాట్ల బ్యాటరీ కలిగిన ఈ కారు సింగిల్ చార్జింగ్‌తో 543 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. దేశవ్యాప్తంగా 2030 నాటికి దేశవ్యాప్తంగా లక్ష చార్జింగ్ స్టేషన్లను నెలకొల్పబోతున్నట్టు మారుతి సుజుకీ ఇండియా ఎండీ, సిఇఒ హిసాచీ తకేచి తెలిపారు.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at Plot Nos. 56&58, 9th line, Ramnagar, Ongole - 523001, ph: 2312451, Fax: 08592-236879, RNI No, 64847/96, Editor.Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act, Regd. No.H/SD/337/12-14 Air Surcharge:Delhi:40 Ps